# క్రాంతి

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఎ.పి, ఎన్.టి, ఎ.ఒ.బి కమిటీల అధికార పత్రిక

సంపుటి : 33 సంచిక : 2 మార్చి - ఏప్రిల్ 2008 వెల : ఐదు రూపాయలు


లోపలి పేజీల్లో...


రెండు రూ.లకు కిలో బియ్యం............5
కంచాల్ హత్యాకాండపై............8
అమరుల జీవిత చరిత్రలు............11
కంచాల్ అమరులు............12
కామ్రేడ్ గంగారాం............18
మార్చి 8 కరపత్రం............21
మహిళా ఉద్యమాలు............మధ్య పేజీలో
'వాకపల్లి'పై న్యాయస్థాన తీర్పు............40


# ఓటు కోసం బడ్జెట్ పాట్లు

రాబోయే సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర బడ్జెట్ 2008-09ని యు.పి.ఎ. ప్రభుత్వం జనాకర్షకంగా తయారు చేసిందని లోక్‌సభలో చిదంబరం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను పరిశీలిస్తే దేశ ప్రజలకు అర్థమవుతున్న విషయమే. ఈ బడ్జెట్‌లో అరవై వేల కోట్ల రూపాయలతో కూడిన రైతాంగ రుణ విముక్తి పథకాన్ని బాగా ఎత్తిపట్టారు. ఈ పథకం కిందికి వచ్చే మూడు కోట్ల మంది రైతులకు మేలు చేకూర్చే పథకంగా దీన్ని పొగిడారు. మధ్యతరగతి ప్రజలకు తాయిలంగా ఆదాయపన్ను పరిమితిని రూపాయలు 1 లక్షా 10 వేల నుండి 1 లక్షా 50 వేలు పెంచారు. విద్యా, వైద్య రంగాలకు నిధులు పెంచామన్నారు. అసంఘటిత కార్మికులకు బీమా పథకం వర్తింపు, దారిద్ర్య రేఖకు దిగువగా వుండే వర్గాలకు 30 వేల రూపాయల బీమా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని 596 జిల్లాలకు వర్తింప చేయడం, మార్చి 6 తేదీ కల్లా ఆరవ వేతన సంఘం సిఫారసులు పూర్తి చేయడం, ప్రాణ రక్షణ ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని 5 శాతం తగ్గించడం, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలపై, బస్సులు, చిన్న కార్లపై ఎక్సైజ్ సుంకాలను 16 నుండి 12 శాతానికి తగ్గించడం, కేంద్ర వ్యాట్ రేటును (సి.ఇ.ఎన్ వ్యాట్) 16 నుండి 14 శాతానికి తగ్గించడం, మహిళలకు ఆదాయపరిమితిపై పన్ను 1 లక్షా 80 వేల రూపాయల పెంపు లాంటి రాయితీలతో బడ్జెట్‌ను రైతు, మహిళ, పేద, మధ్యతరగతి వర్గాలకు వరాలనిచ్చిన బడ్జెట్ అని, ఇది అన్ని తరగతుల ప్రజలకు సంతృప్తినిచ్చిన బడ్జెట్ అని, విమర్శించడానికి ప్రతిపక్షాలకు ఏమి మిగలని బడ్జెట్ అని పత్రికలు ఈ బడ్జెట్ ప్రత్యేకతను పొగుడుతూ వచ్చాయి.

నిజంగా ఈ బడ్జెట్ ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తున్నదని చెప్పుకోవాలా? లేక పత్రికలచే అపర కౌటిల్యుడిగా అభివర్ణించబడిన ఆర్థిక మంత్రి చిదంబరం చేసిన మాయాజాలం అనుకోవాలా? చిరకాలంగా ప్రజల డిమాండ్‌గా వున్న రైతాంగ రుణ విముక్తి పథకం ఆశించిన ఫలితాలను యిస్తుందా? తక్కిన వరాలు అన్నీ, మధ్య తరగతితోపాటు అన్ని తరగతుల ప్రజల ఆర్థిక బాధలను నివారించడానికేనా! ఇవన్నీ ప్రజలను ఆకర్షించి ఓట్లు దండుకోవడానికేనా? మన పాలకుల్లో ఆర్థిక సంస్కరణలను ముందుంచి నడిపించే త్రయమైన మన్‌మోహన్, చిదంబరం, మాంటెంగ్‌సింగ్‌లు తమ విధానాల నుండి ఏమైనా పక్కకు తొలగి ఈ వరాలను ప్రజలకు ఇచ్చారా? లాంటి అనేక ప్రశ్నలు బడ్జెట్ రాజకీయాన్ని, ఆర్థిక అంశాలను వాటి మధ్య సంబంధాల్ని లోతుగా పరిశీలిస్తే ముందుకు వచ్చే సహజమైన ప్రశ్నలు.

బడ్జెట్ కంటే ఒక్కరోజు ముందు లోకసభలో ప్రవేశపెట్టే ఆర్థిక సర్వే మన దేశ ఆర్థిక వ్యవస్థ, దాని తీరుతెన్నులపై నిజాల్ని మనముందుంచింది. ఆ మరునాడే బడ్జెట్‌లో ఆ ఛాయలు కూడా కానరాకుండా చిదంబరం దేశ ప్రజలకు ఆర్థిక రాయితీలతో మభ్యపెట్టాడు. ఆ ముగ్గురి నేతృత్వంలో రూపొందిన ఆర్థిక సర్వే వాళ్ల అసలు స్వరూపాన్ని బయటపెడుతోంది. ఆర్థిక సంస్కరణలను


వేగవంతం చేయాలనీ, వివిధ రంగాల్లో విదేశీ ప్రత్యేక పెట్టుబడులను అనుమతించాలని సూచించింది. గత సంవత్సరం 9.6 శాతం ఉన్న ఆర్థికాభివృద్ధి రేటు ఈ సంవత్సరం 8.7 శాతానికి కూనారిల్లిందని, దీన్ని నిలబెట్టడానికైనా ఆర్థిక సంస్కరణలు అవసరమని అభిప్రాయపడింది. గ్రామీణ వ్యవసాయ బ్యాంకుల్లో నూరు శాతం, బీమా రంగంలో 49 శాతానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు అనుమతించాలని పేర్కొంది. దేశంలో ద్రవ్యోల్బనం 4.4 శాతం ఉందని, దీన్ని తగ్గించాలని, బొగ్గు గనులను ప్రయివేటీకరణ చేయాలని అందుకు బొగ్గు గనుల జాతీయ చట్టానికి సవరణలు చేయాలని ప్రతిపాదించింది.


ఈ విధానాలను అట్టిపెట్టుకొని, ఆర్థిక మంత్రి చిదంబరం బడ్జెట్‌లో కొన్ని రాయితీలు ఎలా ఇవ్వగలిగాడు? పాలక పార్టీలు యు.పి.ఎ. గానీ, ఎన్.డి.ఎ. గానీ ప్రజలపై ప్రతి సంవత్సరం మోపుతున్న విపరీతమైన ప్రత్యక్ష, పరోక్ష పన్నుల భారంతోనే ఈ జిమ్మిక్కులు చేయగలుగుతున్నాయి.2007–08 బడ్జెట్‌లో ప్రభుత్వంకు పన్ను ఆదాయం 5 లక్షల 85 వేల 410 కోట్లుకాగా,2008–09 కు 6 లక్షల 87 వేల 715 కోట్ల అంచనా వేశారు. ఇది జి.డి.పి నిష్పత్తిలో 12.5 శాతంగా వుంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుండగానే, పన్నుల వసూళ్లు గత సంవత్సరం 9.2 శాతం నుండి 12.5 శాతానికి పెరిగింది. అందుకు ఆర్థిక మంత్రి చిదంబరం మాట్లాడుతూ తాను అదృష్టవంతుడ్ని అనీ, పన్నుల ఆదాయం తగినంతగా చేతిలోకి రాగా ప్రజలకు కొన్ని రాయితీలు ఇవ్వడంలో సమస్య ఏమిటి అని తన ప్రసంగంలో ఛలోక్తి విసిరాడు.

పాలకవర్గాలు ప్రజల నుండి రాబట్టిన సొమ్మునే ఎన్నికల భాగోతంలో భాగంగా ప్రజలకు ఆశగా ఎలా ఎర చూపుతారో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో సారా వ్యాపారంతో ప్రభుత్వం పది వేల కోట్ల ఆదాయం సంపాదించగా, అందులో 2 రూపాయలకు కిలో బియ్యం పథకం ద్వారా వందల కోట్లు విదిల్చితే ప్రభుత్వానికి పోయేదేముంటుంది? ప్రజల ఆర్థిక స్థితి బాగుపడేది ఏముంటుంది? అదే ఈ రోజు జరుగుతున్న మసిబూసి మారేడుకాయను సృష్టిస్తున్న పాలకవర్గాల బడ్జెట్‌ల తతంగం.

బడ్జెట్‌తో సంబంధం లేకుండానే ఎప్పటికప్పుడు పెట్రోలియం ఉత్పత్తులైన పెట్రోల్, కిరోసిన్, డీజిల్, వంట గ్యాస్ లాంటి వాటిపై ప్రభుత్వాలు పెంచుతున్న ధరలు మధ్య తరగతితోపాటు పేదలపై తీవ్ర ప్రభావం చూపెడుతూనే వున్నాయి.

ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేసుకుంటున్న రైతుల రుణ విముక్తి పథకాన్ని పరిశీలిస్తే ఈ కార్యక్రమం రైతులు ఎదుర్కొంటున్న సమస్యను ఏమేరకు పరిష్కరించగలుగుతూందో చూడాలి. పాలక వర్గాలు నూతన ఆర్థిక విధానాలను అనుసరిస్తున్న ఫలితంగా వ్యవసాయ రంగంలో ఏర్పడిన సంక్షోభం వల్ల దేశంలో అత్యంత విషాదకరమైన రైతాంగ ఆత్మహత్యలు కొనసాగుతూ వున్నాయి. 1997–2005 మధ్యకాలంలో లక్షా యాభైవేల మంది రైతుల ఆత్మహత్యలు జరిగాయని ఒక అధ్యయనం వెల్లడించింది. ఆ తరువాత కాలంలో యు.పి.ఎ. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి




పెద్దపీట వేశామని చెప్పినప్పటికీ ఈ ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే వుంది. అనేక మంది మేధావులు ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రభుత్వాల ముందు అనేక పరిష్కార మార్గాలు వుంచుతూనే వున్నారు. అందులో తాత్కాలిక వుపశమనంగా రుణ విముక్తి పథకపు ప్రతిపాదన కూడా వుంది. ఈ ప్రతిపాదనను పెడచెవిన పెడుతూ వస్తున్న ప్రభుత్వం చివరకు ఎన్నికల క్రీడలో భాగంగా రుణ విముక్తి పథకాన్ని ప్రతిష్టాకరంగా

ప్రకటించుకొంది. గత ఐదు సంవత్సరాలుగా యు.పి.ఎ. ప్రభుత్వం వ్యవసాయ రంగంపై శ్రద్ధ కనపరుస్తున్నానని చెప్పినప్పటికీ ఏమాత్రం పురోగతి లేదు. రైతాంగానికి వ్యవసాయం గిట్టుబాటు కావాలంటే ఈ రంగం అభివృద్ధి రేటు కనీసం 4 శాతంగా ఉండాలని ప్రభుత్వమే చెబుతున్నప్పటికీ, ప్రస్తుతం వ్యవసాయ రంగం అభివృద్ధి రేటు గత సంవత్సరం వున్న 3.6 నుండి 2.6 శాతానికి పడిపోయింది. ఈ స్థితిలో రుణ మాఫీ పథకం వలన ఎంతమందికి లాభం చేకూరుతుందో చూద్దాం. మన దేశంలో ఒక హెక్టారు భూమి కలిగిన రైతులు 61 శాతం కాగా, ఇందులో 48.6 శాతం కుటుంబాలు అప్పుల్లో ఉన్నాయి. 57.7 శాతం కుటుంబాలకు సంస్థాగత అప్పులు లభించగా, 42.3 శాతం కుటుంబాలకు అప్పులు వడ్డీ వ్యాపారుల నుండి లభించినవే. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ పథకం సంస్థాగత రుణాలకు మాత్రమే వర్తిస్తుంది. రైతులు తీవ్రస్థాయిలో ఎదుర్కొంటున్న వడ్డీ వ్యాపారుల దోపిడి నుండి విముక్తి అనేది ఈ పథకం పరిధిలోకి రానపుడు రైతుకు రుణం నుండి విముక్తి లభించడం కల్ల. అప్పులతోపాటు రైతులు తీవ్రంగా నష్టపోతున్న పెట్టుబడిలో ముఖ్యపాత్ర వహిస్తున్న ఉత్పత్తికారకాలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు తక్కువ ధరలకు లభించడం లేదు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం వీటిపై సబ్సిడీలు తగ్గిస్తూనే వస్తున్నది. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా, ప్రభుత్వం ప్రకటించిన ప్రస్తుత రుణ మాఫీ పథకం వలన రైతాంగం సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడం వట్టి మాటే.

మధ్య తరగతి ఉన్నతాదాయా వర్గాలకు ఆదాయం పన్ను భారాన్ని గణనీయంగా తగ్గించడం వెనుక ఈ వర్గాలను ప్రసన్నం చేసుకోవడంతోపాటు స్టాక్ మార్కెట్ నుండి నిష్క్రమిస్తున్న నిధులను దేశీయంగా సమీకరించుకోవాలన్న ప్రయత్నం ప్రభుత్వ ఆశయంగా వుంది. అంతేగాక ప్రస్తుతం బడ్జెట్‌లో ప్రస్తావించిన వరాల లక్ష్యం ప్రజల చేతిలో డబ్బు ఆడేటట్టు చేస్తూ, మందగిస్తున్న ఆర్థిక వ్యవస్థలో కృత్రిమ డిమాండ్ సృష్టించి, ఆర్థిక వ్యవస్థను మళ్లీ ఊపులోకి తీసికొని వచ్చే ప్రయత్నంగా వుంది. ప్రస్తుతం ప్రకటించిన రాయితీల వల్ల అయిదు రకాల వనరుల నుండి ప్రజల చేతిలోకి డబ్బు చేరుతుందని ప్రభుత్వం అంచనా. కేంద్ర వ్యాట్ పన్నులో 16 శాతం నుండి 14 శాతం తగ్గించడం వల్ల తయారీ సరుకుల ధరలు తగ్గుతాయి. రెండవది, బస్సులు చిన్న కార్లు, ద్వి, త్రి చక్ర వాహనాలు కాఫీ, మందులపై సుంకాల తగ్గింపులు, మూడవది, ఆదాయపరిమితి పెంపువల్ల పన్ను చెల్లింపుదారులకు మిగిలే సొమ్ము, నాలుగవది, రైతాంగ రుణ మాఫీ వల్ల సరుకులు కొనుగోలు చేసే శక్తి కొంతమేరకు సమకూరడం, అయిదవది, ప్రభుత్వ ఉద్యోగులకు 6వ వేతన సవరణల వల్ల సమకూరే ఆదాయం. వీటన్నిటి వల్ల మార్కెట్‌లో డిమాండ్ పెంచే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపకల్పన చేశారు. అయితే ఇవన్నీ అమలులోకి రాకముందే మార్కెట్‌లో ఆహార, వినిమయ సరుకుల, పెట్రోలియం ఉత్పత్తుల ధరలు ఎన్నడూ లేనంతగా మండిపోతూ దేశంలో ద్రవ్యోల్బనం రేటు జూన్ 7 నాటికి 11.05 శాతం చేరి 13 సంవత్సరాల క్రితపు రికార్డును బద్దలుకొడుతూ సామాన్యుడికి గుదిబండగా మారింది. చిదంబరం తన బడ్జెట్ ప్రసంగంలో ద్రవ్యోల్బనాన్ని అదుపులో ఉంచడం తమ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలలో మైలురాయి వంటిదని చెప్పాడు. కానీ అందుకు విరుద్ధంగా ద్రవ్యోల్బనం పెరిగిపోయి, ప్రభుత్వం తిండి గింజలు, పారిశ్రామిక వస్తువులు, స్టీల్ వగైరాల ఎగుమతుల మీద ఆంక్షలు విధించడంతోపాటు మానెటరింగ్ చర్యలను చేపడుతూ, వడ్డీ రేట్లను పెంచడం, క్యాష్ రిజర్వు రేషియో, రెపోరేటింగ్ రేట్లను పెంచడం ద్వారా డబ్బుపై నియంత్రణ చేసి ద్రవ్యోల్బనాన్ని తగ్గించే ప్రయత్నాలు ప్రారంభించవలసి వస్తున్నది. మొత్తంగా చిదంబరం బడ్జెట్ ఆర్థిక వ్యవస్థలో ఎదుర్కొంటున్న సమస్యలను సరిగా పరిష్కరించలేకపోతున్నది. తత్ఫలితంగా సామాన్యుడి జీవనం అతి భారమైపోయింది.

ఒకవైపు రాయితీల పరిధిలోకి రాక సిమెంట్, ఉక్కు లాంటి వాటిపై పన్నుల పెంపుతో కూడా ప్రజలపై అధిక భారం పడుతున్నది. కార్పోరేట్ సెక్టార్‌కు లాభాలు పెంచడానికే చిన్న కార్లపై సుంకం తగ్గించడం జరిగింది.

బడ్జెట్‌లో రక్షణ శాఖకు ఈ సంవత్సరం కూడా 10 శాతం అదనంగా నిధులు కేటాయించారు. రక్షణ బడ్జెట్ రికార్డ్ స్థాయిలో లక్షా అయిదువేల కోట్లకు పెంచారు. ఈ ఏడు సంవత్సరాల్లో రక్షణ బడ్జెట్ రెట్టింపు పెరిగింది. ఇలాంటి అనుత్పాదక రంగాలపై అధిక కేటాయింపులు చేసి ఉత్పాదక రంగమైన వ్యవసాయ రంగంపై తగినంతగా నిధులు కేటాయించడంలేదు. ఇలాంటి స్థితిలో ప్రభుత్వాలు ఎలా రైతు బాంధవ ప్రభుత్వాలుగా చెప్పుకోగలుగుతాయి?

కార్పోరేట్ వర్గాలకు లభించిన పన్ను రాయితీల్లో కార్పోరేట్

హాస్పిటల్స్, హోటల్స్ ఉన్నాయి. అలాగే వివిధ రాష్ట్రాల్లో కార్పోరేట్ సంస్థలకు స్థలాల దగ్గర నుంచి అన్ని మౌలిక సదుపాయాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు దగ్గర వుండి కల్పిస్తూ ఎర్ర తివాచీలతో స్వాగతం పలుకుతూనే ఉన్నాయని స్వయంగా చిదంబరమే ఇంటర్వ్యూలో చెప్పాడు.

బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజు స్టాక్ మార్కెట్‌లోని బి.ఎస్.ఇ సెన్సెక్స్ 245 పాయింట్లకు పడిపోయింది. బడ్జెట్‌లో స్వల్పకాలిక క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను 10 శాతం నుంచి 15 శాతానికి పెంపు మూలంగా ఇది జరిగిందని అంచనా వేశారు. అయితే సెన్సెక్స్ పెరుగుదల, తరుగుదల ఎఫ్.ఐ.ఐ. పెట్టుబడులపై ఆధారపడి ఉంటున్నాయి. బడ్జెట్‌కు ముందునుండే సెన్సెక్స్ పడిపోవడం కొనసాగుతున్నది. స్వల్పకాలిక క్యాపిటల్ గెయిన్స్‌పై పన్ను పెంపుదల స్టాక్ మార్కెట్‌లో స్పెక్యులేషన్‌కు కట్టడి చేసి ఇన్‌వెస్ట్‌మెంట్ ధోరణిని పెంచేందుకు ఉద్దేశించిందని చిదంబరం ప్రకటించాడు. స్టాక్ మార్కెట్లపై ఎఫ్.ఐ.ఐ పెట్టుబడుల ఆధిక్యం కొనసాగుతున్నంత కాలం చిదంబరం ఆశయం నెరవేరడం కష్టం. అయితే ఎక్సైజ్ సుంకాలు తగ్గినా బస్సులు, ద్వి, త్రి చక్ర వాహనాలు, చిన్న కార్ల తయారు చేసే ఆటోమోబైల్ కంపెనీల షేర్లు మాత్రం ఊపందుకోవడం జరుగుతుంది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థ జి.డి.పిలో పది శాతం అభివృద్ధి సాధించగలదని, ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబడుతుందని ప్రభుత్వాలు పదే పదే చెబుతూ వస్తున్నాయి. కానీ వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. దేశ పారిశ్రామిక ఉత్పత్తిలో మాంద్యంకు దారితీస్తున్నది. తిండి గింజల కొరత తీవ్ర స్థాయిలో వుంది. ద్రవ్యోల్బనం రేటు పది సంవత్సరాల నాటి స్థితికి మళ్లీ చేరింది. మార్కెట్‌లో తిండి సరుకుల, పారిశ్రామిక వస్తువుల కొరత ఏర్పడి ధరలు ఎన్నడూ లేనంతగా పెరిగిపోయి సామాన్యుల జీవనం దుర్భరంగా మారింది. ఇలాంటి స్థితిలో చిదంబరం ప్రవేశపెట్టిన జనరంజకమైన బడ్జెట్ ప్రజలను ఆచరణలో రంజింప చేసేందేమిలేదు. బడ్జెట్ ప్రవేశపెట్టిన కొద్ది కాలంలోనే దాన మాయాజాలం నుండి ప్రజలంతా వాస్తవ ప్రపంచంలో నిజాల్ని చూడగలుగుతున్నారు. అందుకే నాడు ఎన్.డి.ఎ. ప్రభుత్వం "భారత్ వెలిగిపోతుందని" ప్రజలను నమ్మించడానికి ప్రయత్నించి 2004 ఎన్నికల్లో ఘోర పరాభావం చెందింది. నేడు యు.పి.ఎ. ప్రభుత్వం కూడా ప్రజల ఆగ్రహం నుండి తప్పించుకోవడం సాధ్యం కాదు.

పాలకవర్గాలు నూతన ఆర్థిక విధానాలను అనుసరిస్తూ, సామ్రాజ్యవాదుల పాదసేవకు అంకితమైనంత కాలం ప్రతి సంవత్సరం ఆనవాయితీగా ప్రకటిస్తున్న బడ్జెట్‌లు ప్రజలకు ఒరగబెట్టేదేముండదు. ఇవి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపడానికి సాధికారతను కల్పిస్తాయి. పాలకవర్గాలైన భూస్వామ్య, దళారీ నిరంకుశ, సామ్రాజ్యవాదాలు అనే ఈ మూడు పర్వతాలను ప్రజలు కలిసికట్టుగా పోరాడి తొలగించినప్పుడే దేశంలో కార్మికవర్గ నాయకత్వంలో నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం అయి ప్రజల సంక్షేమానికి నిజంగా అంకితమైన ప్రజా బడ్జెట్‌లను రూపొందించగలుగుతాం. ★

---

అమెరికా సామ్రాజ్యవాదం ఒక కాగితపు పులి అని మేమంటున్నప్పుడు, మేము వ్యూహాన్ని దృష్టిలో పెట్టుకొని మాట్లాడుతున్నాం. మొత్తం మీద చూసినప్పుడు, దాన్ని మనం తప్పనిసరిగా చిన్న చూపు చూడాలి. కానీ, ప్రతిఒక్క భాగానికి సంబంధించి దాన్ని మనం తప్పక జాగ్రత్తగా పట్టించుకోవాలి. దానికి పంజాలు, కోరలు వున్నాయి. దాన్ని మనం ఒక్కొక్క ముక్కగా నాశనం చేయాలి. ఉదాహరణకు, దానికి పది కోరలుంటే, మొదటిసారి ఒక కోరనూడగొట్టి తొమ్మింది మిగిలిపోతాయి.... మరో దాన్ని వూడగొట్టు యెనిమిది మిగిలిపోతాయి. అన్ని కోరలు పోయిన తర్వాత దానికింకా పంజాలు మిగిలి వుంటాయి. దానితో మనం అంచెలంచలుగానూ, మనస్ఫూర్తిగాను వ్యవహరించినట్టయితే, మనం ఖచ్చితంగా అంతిమంగా గెలుస్తాం.

– మావో

# ఈ 'బియ్యం' పేదల కోసం కాదు, ఓట్ల కోసం!

రాజశేఖర్ రెడ్డి సర్కార్ ఈ ఉగాది నాడు రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని పెద్ద ఎత్తున ప్రచార ఆర్భాటంతో ప్రారంభించింది. వచ్చే ఎన్నికల్లో ప్రజల ఓట్లను కొల్లగొట్టడానికి ఈ పథకం ఒక గాలం వంటిది అని చెప్పడానికి పెద్దగా అధ్యయనాలూ, పరిశీలనలూ అవసరం లేదు. ఎందుకంటే బూర్జువా ప్రభుత్వాలకు నిజమైన ప్రజాసంక్షేమం ఎన్నడూ పట్టదని అరవయ్యేళ్లు పైబడిన 'స్వాతంత్ర్య' భారత చరిత్రను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. ఇంత వరకూ ఏ ప్రభుత్వమైనా ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రకటించిందంటే, అమలు చేస్తోందంటే అది కేవలం దాని దోపిడీని నిరాఘాటంగా పొడిగించుకోవడానికే అన్నది తేట తెల్లంగా అర్థమవుతున్న విషయమే.

అధికారంలోకి వచ్చిన నాలుగేళ్ల నుండీ పేదల మీద లేని ప్రేమ ఇప్పుడు ఎందుకు హఠాత్తుగా పుట్టినట్టు? అంటే సంవత్సరంలో ఎన్నికలు రాబోతుండడమే కారణం. ఈ నాలుగు సంవత్సరాల్లో తన ప్రభుత్వం మూటగట్టుకున్న ప్రజా వ్యతిరేకత రాజశేఖర్ రెడ్డికి తెల్సు. ఉచిత విద్యుత్ ఇవ్వడంలో విఫలమయిన వైనం, శాంతి చర్చలను రక్తసిక్తం చేసిన వైనం, ప్రత్యేక తెలంగాణా నినాదాన్ని ఎగతాళి చేసిన వైనం, ఉద్యమించిన ప్రజలపై ఉక్కుపాదాన్ని మోపిన వైనం ప్రజలు మర్చిపోరని రాజశేఖర్ రెడ్డికి తెల్సు. దీనికి తోడు విచ్చలవిడిగా పెరుగుతున్న ధరలను అరికట్టడంలో వైఫల్యం, పలు ప్రాజెక్టుల్లో బయటపడిన అవినీతి, చిరంజీవి రాజకీయ రంగప్రవేశ వార్తలు పార్టీలో కుమ్ములాటలు తిరిగి తాను అధికారంలోకి రావడానికి ఆటంకాలని రాజశేఖర్ రెడ్డికి అర్థమైంది. అందుకే రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని అరువు తెచ్చుకున్నాడు.

పథకం ప్రారంభం రోజున జరిగిన ప్రచారార్భాటాన్ని చూస్తే, ఈ పథకంపై కాంగ్రెస్ పార్టీ ఎన్ని ఆశల మేడలు కట్టుకుంటోందో అర్థమవుతుంది.

ఓట్ల గాలమే అని ఒక్క మాటలో చెప్పుకోగల్గినప్పటికీ ఈ పథకం గురించి మరికొంచెం చెప్పుకుందాం.

ఈ పథకాన్ని మొదట ప్రవేశపెట్టింది ఎన్.టి. రామారావు. ఎన్.టి. రామారావు తర్వాత అధికారంలోకి వచ్చిన చెన్నారెడ్డి దీన్ని కొనసాగించినప్పటికీ జనార్ధన్ రెడ్డి కాలంలో ఈ పథకం భారమైనది అనే అభిప్రాయం పాలకవర్గం నుండి బయల్దేరింది. ఆనాడు ఆర్థిక మంత్రిగా ఉన్న రోశయ్యే దీన్ని రద్దు చేయాలనే అభిప్రాయాన్ని బహిరంగంగానే ప్రకటించాడు. ఆ తర్వాత అధికారంలోకొచ్చిన చంద్రబాబు ప్రపంచ బ్యాంకు షరతులకు లోబడి 1996లో ఎత్తివేసిన ముఖ్యమైన సంక్షేమ పథకాల్లో రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ఒకటి. ఈ పథకాల ఎత్తివేతను వ్యతిరేకిస్తూ ఆనాడు రాష్ట్రవ్యాప్తంగా ప్రజానీకం పెద్దఎత్తున ఉద్యమించారు. అయినప్పటికీ చంద్రబాబు మొండి వైఖరి సడలలేదు. ఫలితంగా అప్పటి నుండి రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం తెర మీది నుంచి తొలగిపోయింది. ఈ పథకం ఆచరణ సాధ్యం కాదు అనే ఉద్దేశంతోనే 2004 ఎన్నికల్లో కూడా ఏ పార్టీ ఎన్నికల ప్రణాళికలో చోటు చేసుకోలేదు. ఎన్.టి.ఆర్ ఈ పథకాన్ని అమలు చేసినప్పుడు బహిరంగ విపణిలో కిలో బియ్యం ధర మూడు రూపాయలు ఉందనీ, కిలో బియ్యం 16–18 రూపాయలు ఉన్న సమయంలో ఈ పథకాన్ని అమలు చేస్తున్న ఘనత తమకే దక్కుతుందని రాజశేఖర్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నాడు. అంతేకాదు ఎన్.టి.ఆర్ 30 శాతం జనాభాకే ఈ పథకం ద్వారా బియ్యం అందిస్తే, తాము 85 శాతం జనాభాకు బియ్యం అందజేస్తామని కూడా చెప్పుకున్నాడు. మరి ఆనాడే భారమైన పథకం ఈనాడు ఎందుకు కాదో మాత్రం చెప్పలేదు.

ఒకనాడు ఈ పథకం భారమైనది అన్న నోటితోనే రోశయ్య నిత్యావసరాలన్నింటి ధరలు పెరిగాయి కాబట్టి, ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నాం అన్నాడు. మరి నిత్యావసరాల ధరలు పెరగడం వల్ల పేద ప్రజలపై పడిన భారాన్ని ఈ పథకం తొలగిస్తుందా? నిత్యావసరాల ధరల పెరుగుదలకు విరుగుడుగా ఈ ఒక్క పథకాన్ని అమలు చేస్తే ప్రభుత్వ బాధ్యత తీరినట్టేనా?

గత నాలుగేళ్లలో అంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ధరలు మూడు వందల శాతం పెరిగాయని ఒక అంచనా. ఇంతగా పెరిగిన ధరల దెబ్బల నుండి పేద ప్రజలకు ఈ పథకం ఎంత ఉపశమనాన్ని ఇవ్వగలదు? నిత్యావసరాల్లో కెల్లా అత్యంత అవసరమైనది బియ్యం కనుక బియ్యం చౌకగా దొరికితే, పేద ప్రజలకు

సగం బాధ తీరినట్టే అని అనిపించవచ్చు. కానీ సర్కార్ ఇస్తున్న బియ్యం గరిష్టంగా 20 కిలోలు. బియ్యం గరిష్ట పరిమాణం 35 కిలోలు ఉండాలని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) తెల్పింది. కానీ ప్రభుత్వం అదేమి పట్టించుకోకుండా గరిష్టంగా 20 కిలోలు, కనిష్టంగా అయిదు కిలోలు ఇస్తోంది. గరిష్టంగా ఇరవై కిలోలు పొందే కుటుంబాలు ఈ పథకం ద్వారా ఎంత లబ్దిని పొందగలవో చూద్దాం. ప్రస్తుతం చౌక దుకాణాల్లో ఇస్తున్న బియ్యం ధర రూ. 5. 25లు ఇప్పుడు రెండు రూపాయలకు 20 కిలోలు కొంటే ఆ కుటుంబానికి నెలకు 65 రూపాయలు ఆదా అవుతాయి. మరి విచ్చలవిడిగా పెరిగిన ధరల మూలంగా పేదకుటుంబాలపైన వెయ్యి నుండి రెండు వేల రూపాయల భారం పెరిగింది. ఈ భారాన్ని తగ్గించే చర్యలేం తీసుకోకుండా రెండు రూపాయలకు కిలో బియ్యం పథకాన్ని తీసుకురావడం ఉత్త మోసపూరితం.

ఇక్కడ బియ్యంపై ప్రభుత్వం విధిస్తోన్న పన్నుల గురించి కూడా చెప్పుకోవాలి. వరి ధాన్యంపై అయిదు శాతం పన్నును విధిస్తోన్న ప్రభుత్వం, మిల్లర్లు కొంటున్న బియ్యంపై నాలుగు శాతం వ్యాట్‌ను వసూలు చేస్తోంది. ఇలా బియ్యంపై వ్యాట్ విధిస్తోన్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశే. ఏ పన్నులైనా అయిదు శాతానికి మించకూడదని కాగ్ అభిప్రాయం. కానీ ధాన్యంపై విధిస్తున్న అయిదు శాతానికి బియ్యంపై విధిస్తోన్న వ్యాట్ తోడయితే మొత్తం తొమ్మిది శాతం పన్నుల భారం బియ్యంపై పడుతున్నట్టు. బియ్యంపై రాష్ట్ర ప్రభుత్వం విధిస్తోన్న పన్నుల తీరును కాగ్ తప్పుపట్టింది. తాము చెల్లిస్తోన్న వ్యాట్ భారాన్ని మిల్లర్లు వినియోగదారులపై వేస్తూ ధరలు పెంచుతున్నారు. వ్యాట్ తగ్గిస్తే బియ్యం ధర తగ్గిస్తామని మిల్లర్లు ప్రభుత్వానికి చెప్పారు. కానీ ప్రభుత్వం మాత్రం అటువంటి చర్యలు తీసుకోవడం లేదు. చౌక దుకాణాల్లో ప్రభుత్వం ఇస్తున్న బియ్యం ఎలాగూ సరిపోవు కనుక ప్రతి కుటుంబం దాదాపు అంతే పరిణామంలో బియ్యం కొనాల్సిందే. అంటే ఒకవైపు ప్రభుత్వపు 'దయాదాక్షిణ్యాల' వల్ల ఒక చేత్తో చౌక ధరకు బియ్యం కొంటున్న ప్రజలు, మరో చేత్తో ప్రభుత్వ పన్నుల విధానం వల్ల అధిక ధరలకూ కొనాల్సి వస్తోంది. దీనివల్ల చౌక దుకాణాల్లో మిగిలిన డబ్బులు బహిరంగ విపణిలో 'హుష్‌కాకి' అవుతూ ఈ పథకం నిష్ప్రయోజనంగా తేలిపోతుంది.

ఇక ఈ పథకం అమలు చేయడానికి అయ్యే ఖర్చుకు సంబంధించి చూస్తే, ప్రస్తుతం రూ. 5.25 లకు కిలో బియ్యం ఇవ్వడానికి అవుతున్న ఖర్చు 872 కోట్ల రూపాయలు. కానీ గతేడాది (2007–2008) బియ్యం కోసం ప్రభుత్వం బడ్జెట్లో కేటాయించింది 720 కోట్ల రూపాయలు. మరి మిగితా 152 కోట్ల రూపాయలను ఎలా కేటాయిస్తుందో ప్రభుత్వం చెప్పలేదు. అది కేటాయించిన 720 కోట్ల రూపాయలనైనా బియ్యాన్ని సరఫరా చేసే పౌర సరఫరాల సంస్థకు సరిగా చెల్లించలేదు.

ఇప్పుడు కిలో బియ్యం రెండు రూపాయలకు ఇవ్వాలంటే దాదాపు వెయ్యి కోట్ల రూపాయలు అదనంగా ఖర్చు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఇందుకు గాను ఒక్కపైసా కూడా చెల్లించనని చెప్పింది. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వం దీనికి అవసరమైన నిధులు కేటాయించినప్పటికీ, కేటాయించిన నిధులను విడుదల చేస్తుందని నమ్మాల్సిన అవసరం లేదు. ఫలితంగా ఇప్పటికే పౌర సరఫరాల సంస్థకు ప్రభుత్వం పడిన 500 కోట్ల రూపాయల బకాయికి మరికొన్ని వందల కోట్లు జత కూడుతాయి. పౌర సరఫరాల సంస్థ మాత్రం ఎక్కడి నుండి తెస్తుంది? ఇప్పటికే అది రిజర్వ్ బ్యాంకు దగ్గర అప్పుచేసి వడ్డీలు చెల్లిస్తోంది. ఈ అప్పులూ, వడ్డీలు అంతిమంగా ప్రజలనెత్తి మీదనే రుద్దుతారనేది తెల్సిన విషయమే.

ఎక్సయిజ్ ఆదాయం ద్వారా సమకూరే నిధులను ఈ పథకానికి కేటాయిస్తారనే వార్తలు కూడా వస్తున్నాయి. అధికారంలోకి రాకముందు రాజశేఖర్ రెడ్డి బెల్టు షాపులను తీవ్రంగా విమర్శించాడు. మద్య నిషేధాన్ని తీసుకొస్తానన్నాడు. కానీ అధికారంలోకి వచ్చాక మద్య నిషేధం ఊసే లేకపోగా చీప్‌లిక్కర్ ధరలు రోజు రోజుకు పెంచుతూ ఆదాయాన్ని పెంచుకుంటున్నాడు. ఇలా ఒకవైపు పేదల ఆదాయాన్ని దోచుకుంటూ, అలా దోచుకున్న డబ్బుతో మరోవైపు చౌక బియ్యం ఇస్తామంటున్నాడు. ఇంతకంటే దగుల్బాజీతనం మరొకటి ఉండదు.

పోనీ ఇంతా చేస్తే ఈ పథకం అర్హులైన పేదలకు చేరుతుందా? రాష్ట్రంలో రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి రాకముందు, దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలకు ఇచ్చే తెల్ల రేషన్ కార్డులు కోటీ 2 లక్షలు వుండేవి. ప్రస్తుతం వీటి సంఖ్య కోటీ 86 లక్షలు. అయితే పెరిగిన పేదరికం వల్ల కార్డులు పెరిగాయని అనుకోవడానికి లేదనీ కాంగ్రెస్ ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలను లబ్దిదారుల జాబితాలో చేర్చడం వల్ల కార్డుల సంఖ్య పెరిగిందని ప్రతిపక్షాల ఆరోపణ. మరి కార్డుల సంఖ్య పెరిగింది కానీ ఆమేరకు

బడ్జెట్ అయితే పెరగలేదు. దీనివల్ల నిజమైన లబ్దిదారులకు ఇంత వరకూ దక్కిన నామమాత్రపు సబ్సిడీ అయినా ఇక మీదట తగ్గిపోతుంది. ఇప్పుడీ బియ్యం పథకం అయినా పేదల పేరు చాటున ఎంతమంది కాంగ్రెస్ కార్యకర్తలకు వరంగా మారుతుందో!

ఒక నల్ల బజారు సంగతి చెప్పుకొనే అవసరం లేదు. పథకం ప్రారంభమయిన మొదటి రోజునే నల్లబజారులోకి బియ్యం వచ్చేశాయి.

మొత్తంగా ఈ పథకం వల్ల పేద ప్రజలకు ఉపయోగం లేకపోగా కాంగ్రెస్ నాయకులకూ, నల్ల బజారు వ్యాపారులకు మాత్రం కాసుల వర్షం కురుస్తుంది. కానీ కాంగ్రెస్‌కు ఓట్ల వర్షం కురుస్తుందని మాత్రం చెప్పలేం.

కాంగ్రెస్ ప్రభుత్వం రెండు రూపాయలకు కిలో బియ్యం ఇస్తాం అనే ప్రచారం మొదలుపెట్టినప్పటి నుండే చంద్రబాబుకు భయం పట్టుకుంది. వెంటనే 'నేనూ ఇస్తాను రెండ్రూపాయలకు కిలో బియ్యం' అని చెప్పేశాడు. బహిరంగ మార్కెట్లో మూడు రూపాయలకు కిలో బియ్యం ఉన్ననాడే, ఈ పథకం ఎంతో భారమనీ, ఇటువంటి పథకాల వల్లనే ఖజానా ఖాళీ అవుతోందనీ, ఇటువంటి పథకాలన్నీ విజన్ 2020 అనే తన కలకు అడ్డుగోడలని ప్రచారం చేసి సంక్షేమ పథకాలన్నింటికీ తూట్లు పొడిచిన చంద్రబాబు మళ్లీ నేడు ఏ విజన్‌తో రెండ్రూపాయలకు కిలో బియ్యం అంటున్నాడో అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు. తిరిగి అధికారంలోకి రావాలనే చంద్రబాబు కల అంత తేలిగ్గా ఫలించేలా లేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వస్తోన్న వ్యతిరేకత తనకు అనుకూలంగా మారే పరిస్థితి లేదు. ఎందుకంటే చంద్రబాబు ఏడేళ్ల పాలన తాలూకు ప్రజల చేదు అనుభవాలు ఇంకా మాసిపోలేదు. దానికి తోడు తెలంగాణ సమస్య, చిరంజీవి రాజకీయ రంగ ప్రవేశ వార్తలూ, తన పార్టీలోని అంతర్గత వైరుధ్యాలు ఈసారి అధికారంలోకి రావడానికి చంద్రబాబుకు ఉన్న గట్టి అననుకూల అంశాలు. కాబట్టి తాను తూట్లు పొడిచిన పథకాలకే మాట్లువేసే ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఇకపోతే స్వాతంత్ర్యం వచ్చి 60 యేళ్లు దాటిపోయిందని చెప్పుకుంటున్న ఒక దేశంలో కుటుంబానికి 20 కిలోలు దాటని చౌక ధర బియ్యం అనేది ముఖ్యమైన ఎన్నికల గాలం అవుతోందంటే ప్రజలు ఎంత దుస్థితిలో ఉన్నట్టు? ఇంతకూ ఈ పాలక, ప్రతిపక్షాలు ఈయిన్ని బియ్యమైనా ఇస్తామని ఆశపెడుతున్నది ఎవరికి? మనది వ్యవసాయ ప్రధాన దేశం. ఆంధ్రప్రదేశ్ కూడా వ్యవసాయ ప్రధాన రాష్ట్రం. అందులోనూ వరిని ప్రధాన పంటగా పండించే రాష్ట్రం. కాబట్టి ఈ చౌక బియ్యం లబ్దిదారుల్లో పేద రైతులూ, రైతు కూలీలే ఎక్కువగా వుంటారు. వరిని పండించే రైతు, కూలీలకు, తమ చెమటను చిందించి ప్రజలందరికీ అన్నం పెడుతున్న రైతు, కూలీలకు 20 కిలోలు దాటని చౌక బియ్యాన్ని ఆశ పెడుతున్నారంటే రాష్ట్ర రైతు, కూలీల ఆర్థిక పరిస్థితి ఎంత అధమంగా వున్నట్టు! అంటే పాలకులు రైతు, కూలీలను ఎంత దుస్థితిలో ఉంచుతున్నట్టు? ఈ రైతు, కూలీలకు బియ్యం ఎందుకు? భూమి లేని వారికి భూములు పంచి, నీటి వసతిని కల్పించి, అవసరమైనంత కరెంటునిచ్చి, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తే సబ్సిడీ బియ్యం అవసరం వీరికెందుకు? ఆ సబ్సిడీలేవో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు, కరెంటుకిస్తే సరిపోతుంది.

కాబట్టి ప్రజలూ, రైతాంగమూ రెండు రూపాయలకు కిలో బియ్యం పథకంలోని మోసాన్ని అర్థం చేసుకోవాలి. చౌక బియ్యం పథకం స్వావలంబనను ఇవ్వదు, ఆత్మగౌరవాన్నీ ఇవ్వదు, కనీసం కడుపూ నింపదు, భూమిపై, సంపదపై హక్కు సాధించడం ద్వారానే వీటన్నింటినీ సాధించగలం అని గుర్తించాలి. ఎవరి 'దయా దాక్షిణ్యాలూ' తమకు అవసరం లేదనీ, దేశసంపదపై తమకు హక్కుందని ప్రకటించాలి. సమ సమాజ స్థాపన మాత్రమే అటువంటి హక్కును ప్రజలకు గ్యారంటీ చేస్తుందని, ప్రజా రాజ్యాధికారం మాత్రమే ప్రజలకు నిజమైన సంక్షేమం కల్పిస్తుందని గుర్తించాలి. అందుకే ఎన్నికల రాజకీయాలనూ, అందులో భాగమైన బూటకపు సంక్షేమ పథకాలనూ తిప్పికొట్టాలి. నిజమైన సంక్షేమ రాజ్యం కొరకు సమరశీల పోరాటాల్లో సాయుధం కావాలి. ★

**పత్రికపై మీ విమర్శలూ, అభిప్రాయాలూ, సలహాలూ, సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయండి. అది పత్రిక అభివృద్ధికి దోహదపడుతుందని గుర్తించండి!**

# కంచాల్ కోవర్టు హత్యాకాండకు ప్రజలూ, పి.ఎల్.జి.ఎ. తప్పక బదులు తీర్చుకుంటారు!

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి దాడిని ప్రజాయుద్ధం ద్వారా తిప్పికొడతారు!!

ఈ మధ్య కాలంలో మావోయిస్టు పార్టీపై శత్రువు సాగిస్తున్న భౌతిక దాడుల్లో కంచాల్ ఘటనను తను సాధించిన గొప్ప విజయంగా, వేరే రాష్ట్రంలోకి వెళ్ళి కూడా మావోయిస్టులపై దాడులు చేస్తున్న ఆంధ్ర గ్రేహౌండ్స్ విజయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేసుకున్నది. ఈ సంఘటన నుండి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర స్థాయిలో అత్యధిక ప్రయోజనం పొందటం, దేశమంతటికీ మావోయిస్టులను అణచగలిగిన నమూనాగా ఎ.పిని చూపటం, గ్రేహౌండ్స్ బలగాల సామర్థ్యాన్ని విస్తృతంగా ప్రచారం చేయటం, డి.కెలో పోలీసు బలగాలలో పడిపోయిన స్థైర్యాన్ని పెంచటం అనే ప్రయోజనాలను నెరవేర్చుకొనేందుకు తీవ్రంగా ప్రయత్నించింది. మరోవైపు ఈ ఘటనతో ప్రాప్తించే పేరు ప్రతిష్టలను దక్కించుకొనేందుకు ఖమ్మం జిల్లా ఎస్.పి డి.ఎస్ చౌహాన్ లాంటి అధికారుల ప్రాకులాట కూడా ఇందులో మనకు కన్పిస్తుంది. వాస్తవంగా ఇది విప్లవద్రోహులనూ, కోవర్టులనూ వుపయోగించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎస్.ఐ.బి, గ్రేహౌండ్స్ పోలీసులూ కలిసి అత్యంత మోసపూరితంగా జరపిన దుర్మార్గమైన, క్రూరమైన హత్యాకాండ.

మార్చి 18న జరిగిన ఈ హత్యాకాండ పూర్వాపరాలను పరిశీలిద్దాం. ఆంధ్ర ఎస్.ఐ.బి నేతృత్వంలో ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దున శత్రువు పటిష్టమైన ఇన్‌ఫార్మర్ యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ యంత్రాంగం అందించిన సమాచారం మేరకు డి.కెలోని దక్షిణ బస్తర్ జిల్లాలోని పామేడ్ ఏ.సి పరిధిలో గల కంచాల్ గ్రామ సమీపంలో ఆంధ్ర గ్రేహౌండ్స్ పోలీసులు మార్చి 18న పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్‌పై ఈ హత్యాకాండ సాగించారు. ఆ సమయంలో ఖమ్మం డి.సి, మరికొంతమంది కామ్రేడ్స్‌తో కలిసి కొన్ని పనుల రీత్యా కంచాల్ గ్రామ పరిసరాల్లో వుంటున్నారు. అయితే అంతకంటే ముందే కంచాల్ ఆర్.పి.సీ, సంఘనాయకులూ గ్రామంలో వుంటూనే శత్రువు చేతిలో కోవర్టులుగా పని చేస్తున్నారు. ఇది గుర్తించని పి.ఎల్.జి.ఎ కామ్రేడ్స్ వారిపై ఆధారపడి పనులు కొనసాగించుకుంటున్నారు. ఈ కోవర్టుల ద్వారా ప్రతిరోజు ఖచ్చితమైన సమాచారం సేకరించుకుంటూ ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దున ఏర్పాటు చేసుకున్న ఇన్‌ఫార్మర్ యంత్రాంగాన్ని అంతటినీ ఖమ్మం ఎస్.పి మరియు అధికారులు ఘటనకు మూడురోజుల ముందు మణుగూరు గెస్ట్‌హౌస్‌లో సమావేశపరిచి దాడికి పథకం రూపొందించారు. మార్చి 17వ తేదీ రాత్రి వరకు ఎవరికీ అర్థం కాకుండా కంచాల్‌కు చేరుకుని 18న తెల్లవారుతూనే దాడి చేయాలని నిర్ణయించుకున్నారు.

సంఘటనకు ముందురోజు పరిసర గ్రామాల్లో గ్రేహౌండ్స్ పోలీసుల కదలికల గురించి తెలిసిన పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ ప్రతిఘటనకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కంచాల్ కోవర్టుల నమ్మకద్రోహంతో శత్రువు పన్నిన కౌంటర్ ఆంబుష్‌లో చిక్కుకుని వీరోచితంగా పోరాడుతూ కొంతమంది కామ్రేడ్స్ అమరులయ్యారు. అక్కడి నుండి రిట్రీట్ అయి వెళుతున్న క్రమంలో మరొక గ్రేహౌండ్స్ బ్యాచ్ విచ్చల విడిగా జరిపిన కాల్పుల్లో ఇంకా ఎక్కువ మంది కామ్రేడ్స్ అమరులయ్యారు. పచ్చి రక్తం రుచి మరిగిన గ్రేహౌండ్స్ బలగాలు అంతటితో ఆగకుండా ఘటనా స్థలం వద్ద గడ్డి కోసుకుంటున్న 60 సంవత్సరాల వృద్ధ మహిళ వెంటా, ఆమె కోడలు వెంటా పడ్డారు. కోడలు పరుగెత్తి ఏదో విధంగా తప్పించుకోగా ఆ వృద్ధురాలిని పట్టుకుని అమరులైన కామ్రేడ్స్ కిట్‌బ్యాగుల్లో దొరికిన యూనిఫారం డ్రెస్ తొడిగి నిర్దాక్షిణ్యంగా కాల్చిచంపి "నక్సలైట్" అని ప్రచారం చేశారు.

ఆ తర్వాత మరొక గ్రేహౌండ్స్ బ్యాచ్ కంచాల్ గ్రామాన్ని చుట్టుముట్టి సివిల్ దుస్తుల్లో నిరాయుధంగా వున్న మహిళా కామ్రేడ్స్ పూనెం జోగి(21)నీ, పామేడ్ ఎల్.ఓ.ఎస్. సభ్యురాలు విమలనూ, గ్రామస్తులు మాడవి మాడాల్(35), మాడవి అద్మాల్(34)లను పట్టుకుని తీవ్రంగా చిత్రహింసలు పెట్టి, ప్రజలంతా చూస్తుండగానే యూనిఫారాలు తొడిగించి,

కిట్‌బ్యాగులు వేయించి పరుగెత్తమని వెనుకనుంచి కాల్చి చంపారు.

జరిగిన వాస్తవాలు ఇవికాగా, ఖమ్మం ఎస్.పి దేవేంద్ర సింగ్ చౌహాన్ వాస్తవాలను మసిపూసి మారేడుకాయ చేస్తూ మావోయిస్టులు గ్రేహౌండ్స్ బలగాలపై దాడి చేశారనీ, ఆత్మరక్షణ కోసం గ్రేహౌండ్స్ జరిపిన కాల్పుల్లో 17మంది నక్సలైట్లు మరణించారని ఎప్పుడూ వినిపించే రెడీమేడ్ కట్టుకథను మీడియాలో ప్రచారం చేశాడు. వాస్తవాలు బయట పడతాయనే పిరికితనంతో సంఘటనా స్థలానికి మీడియా వారినెవ్వరినీ రానివ్వలేదు. ఆదరాబాదరగా మృతదేహాలను కొంటకు తరలించి అక్కడ కూడా మీడియా వారిని ఫోటోలు తీసుకోనివ్వలేదు. కేవలం అరగంటలోనే ముగ్గురు డాక్టర్లతో 17మంది కామ్రేడ్ల మృతదేహాలకు పోస్టుమార్టం ముగించామని చెప్పి, హడావుడిగా మృతదేహాలకు అంత్యక్రియలు జరిపారు. ప్రజల్లో గందరగోళం సృష్టించే ఉద్దేశంతో మృతదేహాలను గుర్తించేందుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదు. ప్రజాసంఘాలు హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్‌కు సమాధానంగా "ఒకవేళ మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మావోయిస్టులుంటే పోలీసులు చట్ట ప్రకారం వ్యవహరిస్తారు" అనే హైకోర్టు దివాళాకోరు తీర్పును కూడా ఖమ్మం జిల్లా ఎస్.పి అమలు జరిపేందుకుగానీ, చట్ట ప్రకారం వ్యవహరించేందుకు గానీ ప్రయత్నించలేదు. ఇది అడుగడుగునా కంచాల్ కోవర్టులు అందించిన పక్కా సమాచారంతో, రెండు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో తయారు చేసుకున్న ఇన్‌ఫార్మర్ యంత్రాంగం సహాయంతో మోసపూరితంగా జరిపిన దుర్మార్గమైన, క్రూరమైన 'హత్యాకాండ'. కాగా, ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టులు ప్లీనం జరిపినట్లు, జరగని ప్లీనంను ఎస్.పి డి.ఎస్ చౌహాన్ హెలికాప్టర్‌పై నుంచి జల్లెడపట్టి పసిగట్టి గ్రేహౌండ్స్ బలగాలతో ఆ ప్లీనంను చుట్టుముట్టి దాడి చేశామని మరొక భిన్నమైన ప్రకటన చేశాడు. తమకు లేని గొప్పతనాన్ని ఆపాదించుకుంటూ ప్రచారం కోసం చేసిన ఈ ప్రకటన ఖమ్మం ఎస్.పి, ఆంధ్ర ఎస్.ఐ.బి, గ్రేహౌండ్స్ బలగాల దివాళాకోరుతనానికి నిదర్శనం.

సంఘటన జరిగిన తర్వాత 20వ తేదీన సి.సి పేర పత్రికల్లో ఒక ప్రకటన విడుదలైంది. అందులో రాయేరు, యాంపురం గ్రామాల మధ్య ప్లీనం జరుపుకుంటున్నామని, కొద్దిమంది కామ్రేడ్స్‌కు వివాహం జరిపించామనీ, కొండపల్లి గ్రామ సంతలోని ఒక వ్యాపారి ద్వారా సంతలో కొనుగోలు చేసిన నిత్యావసర సరుకుల్లో విషం కలిపి పంపించి పోలీసులు విషప్రయోగం జరిపి కామ్రేడ్స్‌ను చంపారనీ, ఆ వ్యాపారస్తుణ్ణి తర్వాత పట్టుకుని కాల్చి చంపామనీ ఈ సంఘటనకు నిరసనగా మార్చి 26న ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్‌లలో బంద్ పాటించాలనీ పిలుపునిస్తూ పత్రికల్లో "అది విషకౌంటర్" అనే ప్రకటన వచ్చింది. ఇది "లో ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్(ఎల్.ఐ.సి–తక్కువ స్థాయి యుద్ధం)" లోని "డిస్ ఇన్ఫర్మేషన్ క్యాంపెయిన్" లో భాగమే. ఈ సంఘటన తర్వాత జరిగిన దాన్ని వివరిస్తూ పార్టీ ప్రకటనా, బంద్ పిలుపునిస్తే దానికి ఎలాంటి ప్రాధాన్యత లేకుండా చేయడం, ప్రజలనూ, ప్రజాస్వామికవాదులను గందరగోళ పరచడం లక్ష్యంగా అది పత్రికల్లో వచ్చిన 'పోలీసు' ప్రకటన తప్ప మరొకటి కాదు. ప్లీనం జరగటం, వివాహమూ, విషాహారమూ, అది తిని పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ చనిపోవటం, అనంతరం విషాహారానికి కారకుడైన వ్యాపారిని కాల్చి చంపడం అంతా పోలీసు సృష్టే. ఈ కంచాల హత్యాకాండ గురించి మీడియా అనేక వాస్తవాలను బహిర్గతం చేసి పోలీసుల నిజస్వరూపాన్ని బయటపెట్టింది కూడా.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు "యూనిఫైడ్" ఆపరేషన్ నిర్వహించేందుకు ఈ సంవత్సరం ప్రారంభంలోనే పెద్దయెత్తున కుట్రను రచించాయి. అందులో భాగంగానే ఫిబ్రవరిలో దంతెవాడ జిల్లా గొల్లపల్లి సమీపంలో వీరాపురం వద్ద ముగ్గురు గ్రామస్తులను గ్రేహౌండ్స్ బలగాలు పట్టుకుని కాల్చి చంపాయి. అదే నెలలో బీజాపూర్ జిల్లా మిర్తూరు సమీపంలో పుల్లుం గ్రామంపై ఛత్తీస్‌గఢ్ సాయుధ పోలీసులు దాడిచేసి, గ్రామస్తులపై విచ్చలవిడిగా చేసిన కాల్పుల్లో ఎనిమిది మంది గ్రామస్తులు చనిపోయారు. దీని కొనసాగింపే కంచాల హత్యాకాండ.

ఈ క్రమాన్నంతటినీ విచారించి, కంచాల కోవర్టు ఆపరేషన్‌కు కారకులైన ఇన్‌ఫార్మర్లనూ, కోవర్టులనూ పి.ఎల్.జి.ఎ మట్టుపెట్టగా, పోలీసులు దీన్ని ఆసరా చేసుకుని ఆదివాసుల ప్రయోజనాల కోసమే పోరాడుతున్నామంటూ మావోయిస్టులు నిర్దోషులైన ఆదివాసులను చంపుతున్నారని పత్రికాప్రకటనలూ, కరపత్రం ద్వారా పార్టీపై దుష్ప్రచారానికి పూనుకున్నారు. ఎన్‌కౌంటర్ల సందర్భంగా మావోయిస్టుల వెంట ప్రజలుంటే ప్రజలు చనిపోకూడదనే ఉద్దేశంతో మావోయిస్టులపై కాల్పులు జరపకుండా తాము ఎన్నోచోట్ల

వదిలేశామనీ, మావోయిస్టులు అమాయక ఆదివాసులను ఊచకోత కోస్తున్నారని దుష్ప్రచార దుమారాన్ని కొనసాగించారు.

వాస్తవానికి కంచాల కోవర్టు ఆపరేషన్‌కు కారకులైన ద్రోహులను వందలాది ప్రజల సమక్షంలో విచారించి, ప్రజాతీర్పు మేరకు తిప్పాపురం పాండును, బత్తినపాడుకు చెందిన సున్నం రామారావును, యాంపురంకు చెందిన నలుగురిని, కంచాలకు చెందిన కోవర్టులు ఐదుగురిని పి.ఎల్.జి.ఎ హతమార్చింది. ఈ విచారణ కోసం అరెస్టు చేసిన వారిలో నిర్దోషులను వదిలేయటం జరిగింది. పోలీసులతో సంబంధాలున్న ఇతరులను తప్పు సరిదిద్దుకోమని హెచ్చరించి వదిలేయటం జరిగింది. తిప్పాపురంకు చెందిన శ్రీను, కుర్నపల్లి, బత్తినపాడు గ్రామాలకు చెందిన కణితి నర్సయ్య, సున్నం వెంకటరావు, ఎర్రబోరుకు చెందిన కనకయ్యలను చంపకుండా వదిలేయటం జరిగింది.

కాగా, దొంగే, దొంగా... దొంగా... అని అరిచినట్లు దుష్ప్రచారం చేస్తున్న పోలీసులు మావోయిస్టుల వెంట ఆదివాసులుంటే కాల్పులు జరపకుండా వదిలేశామనటం, ఆదివాసులను పోలీసులు ఎక్కడా చంపలేదనటం పచ్చి అబద్ధాలు. కంచాల హత్యాకాండలో కోవర్టులు బహిర్గతం కాకూడదని అక్కడే గడ్డి కోసుకుంటున్న 60 ఏళ్ళ ఆదివాసీ మహిళను వృద్ధురాలని కూడా చూడకుండా కాల్చి చంపారు. కంచాల గ్రామానికే చెందిన అమాయక ఆదివాసీ రైతులు మాడవి మాడాల్, మాడవి అడ్మాల్‌లను నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపి నక్సలైట్లని బొంకారు. 6 సంవత్సరాల క్రితం బస్తర్ సరిహద్దులోని సంతలను ఖమ్మం పోలీసులు బంద్ చేస్తే వాటిని తిరిగి నడపాలనే డిమాండ్‌తో బండిరేవుల గ్రామంలో బస్తర్ ఆదివాసులు ర్యాలీ చేస్తే దానిపై కాల్పులు జరిపి కద్తి సోమే అనే మహిళను చంపివేశారు. నక్సలైట్ల సానుభూతిపరుడనే ముద్రవేసి నల్లదండు ముఠాతో చంపించిన నల్లమలలోని చిన్న ఆరుట్లపెంటకు చెందిన చెంచు నాగన్న, లొంగిపోయి తన బ్రతుకు తాను బ్రతుకుతుండగా అర్ధరాత్రి పట్టుకుపోయి నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపిన అమ్రాబాద్ మంటలం ఉడిమిళ్ళ గ్రామానికి చెందిన చెంచు హనుమయ్య, అదే మండలం లక్ష్మాపూర్‌కు చెందిన చీన్యానాయక్, కద్తిమాను పెంటకు చెందిన 14 సంవత్సరాల బాలుడు మొదలైన వారంతా ఆదివాసులే. ఇక కూంబింగ్‌ల సందర్భంగా పోలీసులు పొట్టన బెట్టుకున్న ఆదివాసులు ఎందరో లెక్కలేదు. ఆదివాసులను ఎక్కడా చంపలేదని పోలీసులు బుకాయించినంత మాత్రాన ఇంద్రవెల్లిలో అమాయక ఆదివాసులపై కాల్పులు జరిపి పదమూడు మందిని బలిగొన్న పోలీసుల హత్యాకాండను ఆంధ్రప్రదేశ్ ఆదివాసులు ఎన్నటికీ మరువరు. బాక్సైట్ గనులకు తమ బ్రతుకులు బలికానివ్వమని పోరాటానికి సిద్ధమైన ఆదివాసులను అణచటానికి వాకపల్లి ఆదివాసీ మహిళలపై ఆంధ్ర గ్రేహౌండ్స్ పోలీసులు జరిపిన అత్యాచార దుర్మార్గాన్నీ, అసలు అత్యాచారమే జరగలేదంటూ అపర కీచకులను కాపాడుతూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పునూ మన్యం ఆదివాసులు ఎన్నటికీ మరిచిపోరు.

మరోపక్క మావోయిస్టు ఉద్యమాన్ని అణచటంలో భాగంగా నిరుద్యోగులను, జులాయిగా తిరిగే లంపెన్ యువకులనూ, గ్రామాల్లో ఉద్యమ వ్యతిరేకులుగా మారిన వారిని డబ్బు, సౌకర్యాల ఆశచూపి రకరకాల పద్ధతుల్లో లొంగదీసుకుని ఇన్‌ఫార్మర్లుగా తయారు చేస్తున్నారు. ఈ విధంగా మారిన కోవర్టులతోనే కంచాల గ్రామంలో దొంగదెబ్బ తీశారు. ఇన్‌ఫార్మర్లుగా మార్చి పోలీసులే అమాయక ఆదివాసులను బలిపశువులను చేస్తున్నారు. ఈ కారణంగానే కంచాల కోవర్టు ద్రోహానికి పాల్పడిన వాళ్ళు ప్రాణాలు కోల్పోయారు.

దోపిడికి వ్యతిరేకంగా పోరాడే ప్రజలపై పాలక వర్గాలు ఎల్లప్పుడూ అణచివేతనే ప్రయోగించాయి. నేడు దండకారణ్యంలోని విలువైన ఖనిజ, అటవీ సంపదలను సామ్రాజ్యవాదులకూ, దళారీ నిరంకుశ బూర్జువాలకూ కట్టబెట్టటానికి పాలక బి.జె.పి. ప్రభుత్వం, ప్రతిపక్ష కాంగ్రెస్ రెండూ కలిసి ఆదివాసులను వారి బ్రతుకుదెరువుకు దూరం చేసి, దండకారణ్యాన్ని వట్టిపోయిన మట్టికుప్పగా మార్చటానికి సిద్ధమయ్యాయి. దీనికి వ్యతిరేకంగా దండకారణ్య ప్రజానీకం మావోయిస్టు పార్టీ నాయకత్వంలో పోరాడుతూ వారి మౌలిక సమస్యలను వారే పరిష్కరించుకుని సమైక్యంగా ముందుకు సాగుతున్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పోరాటాలు చేపట్టి వర్గపోరాట చైతన్యంతో అభివృద్ధి సాధిస్తూ తమ కాళ్ళపై తాము నిలబడి జీవించే దిశలో వున్నారు. ప్రజాయుద్ధం ద్వారా దోపిడీవర్గాల రాజ్యాధికారాన్ని ధ్వంసం చేస్తూ, ప్రజారాజ్యాధికారాన్ని నిర్మించుకుంటున్నారు. ఇది సహించలేని దోపిడిపాలకవర్గాలు మావోయిస్టు పార్టీనీ, పోరాడే ప్రజలను అణచివేసేందుకు కంకణం కట్టుకున్నాయి.

# అమరుల జీవిత చరిత్రలు

## కంచాల్లో ఒరిగిన వీరయోధులకు అరుణారుణ జోహార్లు!

*ఆంధ్రప్రదేశ్ పోలీసులు కోవర్టు కుట్ర పన్ని దండకారణ్య ఉద్యమ ప్రాంతంలోని కంచాల్ గ్రామం వద్ద మార్చి 18వ తేదీన జరిగిన దాడిలో కామ్రేడ్స్ సాగర్, రఘు, భాస్కర్, చూటే, సుదర్శన్,ఇడుమాల్ మడకం బాయక్క,కారం ఉంగాల్,పూనెం జోగి, మడకం బుద్రి, రామ్మూ,ముసాకి ముకాల్, రవ్వా సన్ని, మాడివి లింగాల్, విమల, మాడివి మాడాల్, మాడివి అడమాల్, వీదాల్ తల్లి అమరులయ్యారు. వీరిలో కామ్రేడ్స్ సాగర్, రఘు, భాస్కర్,ఇడుమాల్, సుదర్శన్‌లు ఉత్తర తెలంగాణా ఉద్యమానికి చెందినవారు కాగా, మిగతా కామ్రేడ్లంతా దండకారణ్య ముద్దు బిడ్డలు. వీరి అమరత్వం ఉత్తర తెలంగాణా, దండకారణ్య వుద్యమాలకు తీవ్రమైన నష్టం. ఈ కామ్రేడ్లందరికీ వినమ్రంగా జోహార్లర్పిద్దాం. వారి విప్లవ దీక్షనూ, ఆదర్శాలను స్మరించుకుందాం, స్వీకరిద్దాం. వారి అసంపూర్తి కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి మరింత దృఢంగా ముందుకు సాగుదాం.*

---

దండకారణ్య ప్రజానీకంపై సల్వాజుడుం దమనకాండను కొనసాగిస్తూ గత 3 సంవత్సరాలుగా వందలాది అమాయక ఆదివాసులను చంపేశారు. వందలాది ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు సాగించి, హత్యలు గావించారు. పిల్లలనూ, వృద్ధులనూ కూడా ఊచకోత కోశారు. ఈ సల్వాజుడుం తమనకాండ 50వేల మంది బస్తర్ ప్రజలను వారి బ్రతుకుదెరువుకు దూరం చేసింది. ఇంతమందిని నిర్వాసితుల్ని చేసి, ఇప్పుడు ఆదివాసుల భూములకు పట్టాలిస్తామంటున్నారు.

మరొకవైపు దేశవ్యాప్తంగా పెంపొందుతున్న విప్లవోద్యమాన్ని నిర్మూలించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూనిఫైడ్ కమాండ్ ఏర్పాటు చేసి దాడిని తీవ్రం చేశాయి. మరీ ముఖ్యంగా భారతదేశానికి ప్రధానముప్పు నక్సలిజం నుండే అని ప్రధానమంత్రి ప్రకటించి దాడిని తీవ్రం చేయమని సంకేతాలు పంపాడు. బెటాలియన్ల కొద్దీ కేంద్ర రిజర్వు, పారా మిలిటరీ బలగాలను పంపుతూ, అడిగినంత ఆర్థిక సహాయం, ఆధునిక ఆయుధాలు అందిస్తూ, ఆంధ్రప్రదేశ్‌ను నమూనాగా తీసుకుని దండకారణ్యంలో, యితర రాష్ట్రాలలో మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించాలని పథకరచన చేస్తున్నారు.

పీడిత ప్రజల విముక్తి కోసం అంకితమైన మావోయిస్టు పార్టీ నేతృత్వంలో దండకారణ్య ప్రజానీకం దృఢంగా పోరాడుతూ పాలకవర్గాలు తలపెట్టిన అనేక దాడులను ఓడించారు. అదే మార్గంలో సల్వాజుడుంనూ ఓడించారు. నాగా, మిజో తరహా రకరకాల కేంద్ర బలగాలను ఎదుర్కొన్నారు. ఇప్పుడు దండకారణ్య విప్లవోద్యమ నిర్మూలనకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన దాడిలో భాగంగా తయారుచేస్తున్న ఇన్‌ఫార్మర్ యంత్రాంగాన్ని కూడా ప్రజలు చైతన్యవంతమైన నిఘాతో దెబ్బ తీస్తారు. కోవర్టు ద్రోహులను ప్రజాకోర్టులలో తప్పక శిక్షిస్తారు. ఆంధ్ర ఎస్.ఐ.బి., గ్రేహౌండ్స్ పోలీసులు మోసపూరితంగా జరిపిన కంచాల హత్యాకాండకు ప్రజలూ, ప్రజావిముక్తి గెరిల్లాసైన్యం తప్పక బదులు తీర్చుకుంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన దాడిని ప్రజాయుద్ధం ద్వారానే ఓడించి, ప్రజల రాజ్యాధికారాన్ని నిలబెట్టుకుంటారు. ★

> **సామ్రాజ్యవాదం నిర్మూలింపబడినపుడు మాత్రమే శాంతి వర్ధిల్లగల్గుతుంది. కాగితపు పులులు తుడిచిపెట్టేయబడే రోజు వస్తుంది. కానీ అవి స్వేయేచ్ఛతోనే అంతరించిపోవు. గాలి, వర్షాల తాకిడికి అవి గురికావాల్సి వుంటుంది.**
>
> **– మావో**

# ఉత్తర తెలంగాణా 'సాగరంలో' పోటెత్తిన అల కామ్రేడ్ యాదగిరి!

కంచాల్ హత్యాకాండలో అమరులైన విలువైన కామ్రేడ్స్‌లో కామ్రేడ్ సాగర్ ముఖ్యుడు. ఈయన ఉత్తర తెలంగాణా ఉద్యమంలో ఒక ముఖ్యమైన పాత్రను పోషించాడు. అమరత్వం చెందేనాటికి ఖమ్మం జిల్లా డివిజనల్ కమిటీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు.

కామ్రేడ్ సాగర్ ఉత్తర తెలంగాణాలోని వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం ధర్మరావుపేటలో దాదాపు 44 సంవత్సరాల క్రితం పుట్టాడు. మధ్యతరగతికి చెందిన బాలనర్సమ్మ, సిద్ధయ్య దంపతుల ప్రధమ సంతానం ఆయన. ఆయనకు తల్లిదండ్రులు పెట్టుకున్నపేరు యాదగిరి. ఆయనకు తోడుగా ఒక చెల్లి ఉంది. కామ్రేడ్ సాగర్ పాఠశాల విద్య బుధరావుపేట, ఖానాపూర్‌లలో సాగింది. ఉన్నత పాఠశాల విద్యార్థిగా వున్నప్పుడే అతనికి విప్లవ రాజకీయాలు పరిచయం అయ్యాయి. ఆ విప్లవ రాజకీయాలను పరిచయం చేసినది– అమరుడు కామ్రేడ్ శ్రీమన్నారాయణ. కామ్రేడ్ సాగర్‌కు కామ్రేడ్ శ్రీమన్నారాయణ సన్నిహిత బంధువు. ఇద్దరి మధ్య మంచి అనుబంధం వుండేది. ఆ అనుబంధం ఇద్దర్నీ రాజకీయ సహచరులుగా మార్చింది. కామ్రేడ్ శ్రీమన్నారాయణ ప్రేరణతో ఉన్నత పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే కామ్రేడ్ సాగర్ రాడికల్ విద్యార్థి అయ్యాడు. అయితే కొడుకు విప్లవ కార్యాచరణ తల్లిదండ్రులకు ఆందోళన కల్గించింది. కొడుకు తమకు దక్కడేమోననే భయంతో అతనికి పదవ తరగతిలోనే పెళ్లి చేశారు.



కానీ పెళ్లి అతని విప్లవ కార్యాచరణను ఆపలేక పోయింది. తన సహచరికి కూడా చైతన్య భావాలను పంచుతూ తన కార్యాచరణను కొనసాగించాడు. పదవ తరగతి పూర్తయిన తర్వాత నర్సంపేటలో ఇంటర్ చదివాడు. ఇంటర్ తర్వాత హన్మకొండలోని కుమార్‌పల్లిలో ఒక ప్రయివేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశాడు. మరోవైపు ట్యూషన్లు కూడా చెప్పేవాడు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే తన విప్లవ ప్రవృత్తిని చురుగ్గా కొనసాగించాడు. ఈ కాలంలో రాడికల్ యువజన సంఘంలో చురుగ్గా పని చేశాడు. ఫలితంగా 1986లో ఆయనను పోలీసులు అరెస్టు చేసి తీవ్రమైన చిత్రహింసలు పెట్టి జైల్లో పెట్టారు.

అతను అరెస్టు అయ్యేనాటికి వారికి సంవత్సరం వయసున్న చిన్న పాప వుండింది. చిన్న పాపతో అతని సహచరి రమాతార ఎన్నో ఇబ్బందులు పడింది. ఆమె సోదరులు ఆమెకు మళ్లీ పెళ్లి చేస్తామన్నారు. కానీ ఆమె తన సోదరుల ఆలోచనను వ్యతిరేకించి తన సహచరుడికి మద్దతుగా దృఢంగా నిలబడింది.

రెండేళ్ల తర్వాత కామ్రేడ్ సాగర్ విడుదలయ్యాడు. జైలు జీవితం, తను జైల్లో ఉన్నప్పుడు తన సహచరీ, కూతురు ఎదుర్కొన్న ఇబ్బందులు ఇవేవీ అతనిలోని విప్లవ కాంక్షను తగ్గించలేకపోయాయి. విడుదలయిన తర్వాత ధర్మారావు పేటలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అతన్ని పోలీసులు తీవ్రంగా వేధించేవారు. చీటికి మాటికి పోలీస్ స్టేషన్‌కు తీస్కెళ్లి హింసించేవారు. అయినప్పటికీ వీటన్నింటినీ ఎదుర్కుంటూనే కామ్రేడ్ సాగర్ తన కార్యాచరణను కొనసాగించాడు.

'లీగల్ పీరియడ్' ముగిసిన తర్వాత 1991లో అతని మీద నిర్బంధం తీవ్రస్థాయిలో పెరిగింది. ఇంట్లో పడుకోలేని పరిస్థితి ఏర్పడింది. వూళ్లో క్యాంపువేసి పోలీసులు రాత్రుళ్లు ఇంటి మీద దాడి చేసేవారు. ఇంట్లో సామాన్లన్నీ ధ్వంసం చేయడం, బియ్యంలో ఇసుక కలపడం, లేకుంటే బావిలో పోయడం, బట్టల్ని కాలబెట్టడం వంటి పోలీసు సహజమైన చర్యలన్నీ చేసేవారు.

దానితో రమాతార కూడా ఇంట్లో పడుకోలేని పరిస్థితి ఏర్పడింది. అప్పటికి వారికి మరోపాప పుట్టింది. ఇద్దరు చిన్న పిల్లలను తీసుకొని రాత్రుళ్లు ఇతరుల ఇంటికి వెళ్లి పడుకునేది.

దాదాపు సంవత్సరంపైగా ఇటువంటి నిర్బంధ జీవితం గడిపిన తర్వాత కామ్రేడ్ సాగర్ మళ్లీ అరెస్టయ్యాడు. మళ్లీ తీవ్ర చిత్రహింసలు. మళ్లీ రెండేళ్ల జైలు జీవితం. విడుదలయి వచ్చిన తర్వాత రమాతార తల్లిదండ్రుల ఊరు ముప్పారం వెళ్లి రెండేళ్లు కుటుంబసమేతంగా అక్కడే వున్నాడు. కామ్రేడ్ సాగర్ ఆ సమయంలో రమాతార సోదరుడి రేషన్

దుకాణాన్ని నడిపాడు. ఈ కాలంలో అతన్ని పోలీసు కేసులు తీవ్రంగా వేధించాయి. చాలా తరచుగా కోర్టు వాయిదాలకు వెళ్లవల్సి వచ్చేది.

మరోసారి కూడా అతన్ని అరెస్టు చేశారు. అయితే వాళ్ల వూరి ప్రజలందరూ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విడిపించుకున్నారు.

1996 నాటికి ఇక ఈ పోలీసు వేధింపుల కారణంగా బయట వుండి పని చేయడం సాధ్యం కాదని భావించాడు. అదే సంవత్సరం ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ, జోనల్ రాజకీయ పత్రికగా 'ప్రజావిముక్తి'ని తీసుకురావాలని నిర్ణయించింది. పత్రిక సంపాదకవర్గంలో పనిచేసే సమర్థతలు కామ్రేడ్ సాగర్‌కు ఉన్నాయని ఎస్.జడ్.సి భావించింది. కమిటీ ఆలోచనను కామ్రేడ్ సాగర్ ముందు పెట్టగానే అతను ఏమాత్రం శషభిషలకు గురికాకుండా 1996లో తన కుటుంబాన్ని వదిలి వృత్తి విప్లవకారుడిగా, 'ప్రజావిముక్తి' సంపాదకవర్గ సభ్యుడిగా శ్రీమన్ (తనకు ప్రేరణగా నిల్చిన శ్రీమన్నారాయణ స్మృతిలో) పేరుతో అజ్ఞాత జీవితంలోకి వచ్చేశాడు. అమరుడు కామ్రేడ్ శ్రీనుతో కల్సి 1999 వరకూ ఆ బాధ్యతను నిర్వర్తించాడు. ఆ కాలంలో చంద్రబాబు అమలుపరుస్తున్న ప్రపంచ బ్యాంకు విధానాలనూ, ఎల్.ఐ.సి. పథకాలను ఎండగడుతూ, ఆ విధానాలకు వ్యతిరేకంగా చెలరేగుతున్న ప్రజాపోరాటాలను ఎత్తిపడుతూ పలు వ్యాసాలు రాశాడు. కామ్రేడ్ సాగర్‌కు ఉద్యమ అభివృద్ధి గురించి స్పష్టమైన అంచనాలు ఉండేవి. గొప్ప ఆశావహ దృక్పథాన్ని కల్గివుండేవాడు. ఉద్యమం సాధించిన విజయం, సమీకరణ, నిర్మాణం అవి ఎంత చిన్నవైనప్పటికీ వాటి ప్రాధాన్యతను తన మాటల్లో రచనల్లో ఎత్తిపట్టేవాడు. ఓటమిలో కూడా గెలుపును సాధించగలమనే ఆత్మవిశ్వాసాన్ని కల్గిస్తూ రాసేవాడు. తను సంపాదకవర్గంలో ఉన్నప్పుడు జరిగిన మంచి కృషి 90 నుండి 2004 మధ్యకాలంలో అమరులైన కామ్రేడ్స్ చరిత్రను పుస్తకాలుగా వెలువరించడం. ఈ అమరుల చరిత్రలను మూడు సంపుటాలుగా వెలువరించడంలో తన కృషి ఎంతో వుంది.

ఆర్గనైజేషన్‌కు వెళ్లాలనే కామ్రేడ్ సాగర్ ప్రతిపాదనను పార్టీ ఆమోదించి 1999లో అతన్ని వరంగల్ జిల్లా కమిటీకి బదిలీ చేసింది. అప్పటికి అక్కడి ఉద్యమం కొన్ని సమస్యలను ఎదుర్కుంటున్న పరిస్థితి. కామ్రేడ్ సాగర్ త్వరగానే ఆ ఉద్యమ పరిస్థితిని ఆకళింపు చేసుకొని, ఉద్యమాభివృద్ధిలో తగిన పాత్ర పోషించాడు. పత్రికా రంగంలో పని చేసినప్పుడు ఏర్పడిన ఆర్గనైజేషన్ అనుభవ వెలితిని తొందరగా పూడ్చుకున్నాడు. 2001 చివర్లో పార్టీ ప్రతిపాదనను ఆమోదించి తిరిగి 'ప్రజావిముక్తి' సంపాదకవర్గంలో చేరాడు. రెండున్నరేళ్లు పని చేసిన తర్వాత తిరిగి ఆర్గనైజేషన్‌కు వెళ్తానని ప్రతిపాదించాడు. ఫలితంగా పార్టీ అతన్ని నిజామాబాద్ జిల్లా కమిటీ సభ్యుడిగా బదిలీ చేసింది. ఆ తర్వాత ఏర్పడిన ఆదిలాబాద్-నిజామాబాద్ ఉమ్మడి జిల్లా కమిటీ కార్యదర్శి బాధ్యతలను స్వీకరించాడు.

జోనల్ మహాసభ ముగిసిన తర్వాత 2007 చివర్లో ఉద్యమావసరాలరీత్యా అతను ఖమ్మం జిల్లా కార్యదర్శి బాధ్యతలను స్వీకరించాడు. మహాసభ నిర్దేశించిన కర్తవ్యాల వెలుగులో ఖమ్మం జిల్లా ఉద్యమాన్ని అభివృద్ధి చేయడానికి తీవ్రంగా కృషి చేశాడు. అందులో భాగంగా శబరి, కుకునూర్ ప్రాంతాల్లో విస్తృతంగా తిరిగి అధ్యయనం చేశాడు. కొండరెడ్ల నివసించే ప్రాంతాన్ని కూడా అధ్యయనం చేశాడు. ఖమ్మం జిల్లాలో ఉన్న న్యూడెమోక్రసీ పార్టీ గురించి సహితం అధ్యయనం చేసి ఆ పార్టీ ఉద్యమానికి ఎలా ఆటంకంగా వుందో పరిశీలించాడు.

కామ్రేడ్ సాగర్‌కు ఉద్యమం పట్ల లోతైన అధ్యయనం, మంచి పరిశీలనా దృష్టి వుండేది. ఆటులో వున్న ఉద్యమాన్ని అభివృద్ధి చేసే విషయంలో తను కొన్ని ఆలోచనలను కల్గివుండేవాడు. అలా అభివృద్ధి చేయడానికి తీవ్రంగా తపించేవాడు. మొత్తంగా ఉత్తర తెలంగాణా ఉద్యమంలోని ఎగుడు దిగుడులను సరిగ్గా అర్థం చేసుకొని, ఆ ఉద్యమంలో దృఢంగా నిలబడి, నాయకత్వం వహించి కామ్రేడ్ సాగర్ ఉత్తర తెలంగాణా ఉద్యమ నాయకుడిగా చరిత్రలో సుస్థిర స్థానం పొందాడు.

కామ్రేడ్ సాగర్ క్యాడర్ పట్ల ఆత్మీయతను కనబరిచేవాడు. వాళ్ల సమస్యలను పట్టించుకునేవాడు. వారికి అవసరమైన సహాయాన్ని అందించడానికి ఆరాటపడేవాడు. రాజకీయంగా వారిని ఎదిగించడానికి కృషి చేసేవాడు. మొత్తంగా కామ్రేడ్ ఉన్నచోట ఒక విప్లవ వాతావరణం ఉండేది. అలాగే కార్యకలాపాలు ప్రణాళికా బద్ధంగా నడిచేవి.

ఆయన రచనా సామర్థ్యం గురించి మరికొంచెం చెప్పుకోవాలి. 'ప్రజావిముక్తి'లో పని చేసినపుడు ఆ పత్రికకు అవసరమైన రచనలు చేయడమేకాక, తాను పత్రికా రంగంలో పని చేయని కాలంలో కూడా తాను అధ్యయనం చేసిన, పరిశీలించిన విషయాలను విశ్లేషణాత్మకంగా నివేదికలు రాసి పార్టీ పత్రికలకు పంపేవాడు.

తాను ఆదిలాబాద్ – నిజామాబాద్ కమిటీ కార్యదర్శిగా వున్నప్పుడూ, ఖమ్మం జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడూ ఆయా ఉద్యమాలపై ప్రభుత్వం అమలుచేస్తోన్న బహుముఖ దాడి గురించి వివరమైన నివేదికలు రాసి 'క్రాంతి'కి పంపాడు. అవి ప్రచురితమయ్యాయి కూడా. అలాగే కొండరెడ్ల జీవన విధానం, వారు గురైతున్న దోపిడీ, ఆ ప్రాంతంలో ఉద్యమ అవకాశాల గురించి ఒక వివరమైన వ్యాసం రాశాడు. 2007 నవంబర్–డిసెంబర్ సంచికలో ఇది ప్రచురితమైంది. ఖమ్మం జల్లాలోని నిర్బంధంపై తను రాసిన నివేదిక కూడా ఇదే సంచికలో ప్రచురితమైంది. అంతేకాదు 'నెలవంక' అనే కలం పేరుతో తను కవితలు కూడా రాసేవాడు.

ఆర్గనైజేషన్‌లోనూ, రచనా రంగంలోనూ సమర్థతలు కల్గి వున్న ఈ కామ్రేడ్ మిలటరీ రంగంలోనూ తగిన సమర్థతలు కల్గి వుండేవాడు. వరంగల్ జిల్లాలో పనిచేసినపుడు నర్సంపేటలో, మహదేవ్‌పూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లలో శత్రువును ధీటుగా ఎదుర్కున్నాడు. ఆదిలాబాద్‌లో పని చేస్తున్నపుడు 2007లో తానున్న క్యాంపుపై అతి దగ్గరి నుండి గ్రేహౌండ్స్ దాడి జరిగింది. తన మీద కేంద్రీకరించి కాల్పులు జరుగుతున్నప్పుడు ఎటూ కదలలేని స్థితిలో దాదాపు గంటసేపు పడుకునే వుండి ప్రతిఘటించాడు. ఆ ప్రతిఘటనలో ఇద్దరు గ్రేహౌండ్స్ పోలీసులు చనిపోయారు. తాను అమరుడయిన సందర్భంలో కూడా గ్రేహౌండ్స్ బలగాలు దాడికి వస్తున్నాయని తెల్సి కేవలం ఆత్మరక్షణ గురించి మాత్రమే ఆలోచించకుండా, ప్రతిఘటనలోనే నిజమైన ఆత్మరక్షణ ఉంటుందనే మిలటరీ సూత్రాన్ని ఆచరణలో పెట్టడం కోసం ఎదురు దాడికి గెరిల్లా బలగాలను సిద్ధం చేశాడు. ఆ బలగాలకు స్వయంగా తానే నేతృత్వం వహించాడు.

కామ్రేడ్ సాగర్ మంచి ఉపాధ్యాయుడు కూడా. క్యాడర్‌కు పలు సందర్భాల్లో పలు అంశాలపై రాజకీయ తరగతులు బోధించి మన్ననలు పొందాడు.

ఇన్ని బాధ్యతలను నెరవేర్చిన కామ్రేడ్ సాగర్ అనారోగ్యంతో చాలా బాధ పడేవాడు. పోలీసుల చేత పలుసార్లు చిత్రహింసలకు గురికావడమూ, రెండుసార్లు జైలు శిక్ష అనుభవించడం వల్ల అతని ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. కిడ్నీలు దెబ్బతిన్నాయి. తరచూ తీవ్రమైన జ్వరం వేధించేది. మోకాళ్ల నొప్పులు కూడా తీవ్రంగా ఉండేవి. చాలా సందర్భాల్లో కర్ర పట్టుకునే నడవాల్సి వచ్చేది. అయినప్పటికీ బాధ్యతలను నెరవేర్చడానికి పట్టుదలను ప్రదర్శించేవాడు. కంచాల ఘటన సమయంలో కూడా అతను తీవ్రమైన జ్వరం నుంచి అప్పుడప్పుడే కోలుకుంటున్నాడు. తనలోని రాజకీయ దృఢత్వం, మానసిక స్థైర్యం, అంకిత భావం తనను మంచి కమ్యూనిస్టుగా నిలబెట్టాయి.

కామ్రేడ్ సాగర్ తన కుటుంబంపై వేసిన ప్రభావాన్ని కూడా తప్పక చెప్పుకొని తీరాలి. అతనికి పదవ తరగతిలోనే పెళ్లయిందని చెప్పుకున్నాం. అప్పటికి రామతార 7వ తరగతి చదువుతుండేది. ఇంటిపనులేం చేతనయ్యేవి కావామెకు. ఆ సమయంలో కామ్రేడ్ సాగర్ తల్లిదండ్రులు కూడా ఈ నూతన దంపతులతో ఉండేవారు కాదు. దానితో కామ్రేడ్ సాగర్ తన సహచరికి ఎంతో ఓపిగ్గా అన్ని పనులూ నేర్పాడు. ఆ తర్వాత కూడా అన్ని రకాల ఇంటి పనుల్లో అతను శాయశక్తులా భాగం పంచుకునేవాడు. అంతేకాదు ఆమెను రాజకీయంగా చైతన్య పరచడానికి ఎంతో కృషి చేసేవాడు. రాజకీయ తరగతుల్లో ఆమె పాల్గొనేలా కృషి చేసాడు. అతను ఆమెకు పంచిన ప్రేమ, చైతన్యం వల్లనే ఎంతో కష్టకాలంలో సహితం ఆమె దృఢంగా నిలబడింది. చిన్న వయసులో, ఇద్దరు చిన్న పిల్లలతో వంటరిగా పోలీసు నిర్బంధాన్ని దృఢంగా ఎదుర్కుంది. వంటరి స్త్రీలు ఎదుర్కునే సామాజిక ఇబ్బందులనూ నిబ్బరంగా తట్టుకుంది. ఆమె ఇద్దరు ఆడపిల్లల తల్లి. వంటరి స్త్రీలకు పిల్లల్ని పెంచడమే కష్టం అంటే , ఆడపిల్లల్ని పెంచడం మరీ కష్టం. ఇటువంటి కుటుంబాలను పితృస్వామిక సమాజం ఎప్పుడూ భూతద్దంలో పరిశీలిస్తుంటుంది. తేలిగ్గా అభాండాలు వేయడానికి కాచుకొని కూర్చుంటుంది. కామ్రేడ్ సాగర్ అందించిన పితృస్వామ్య వ్యతిరేక చైతన్యం, మానసిక స్థైర్యం ఆమెకు సమాజానికి ఎదురీదుతూ తన పిల్లలను వ్యక్తిత్వం ఉన్నవారిలా పెంచే ధైర్యాన్ని ఇచ్చింది. ఫలితంగా తన సహచరుడు జైల్లో వున్నా, అజ్ఞాత జీవితంలో ఉన్నా అతనిపై కుటుంబ వత్తిడులేం పడకుండా, కుటుంబం మూలంగా అతని ఉద్యమ జీవితానికి ఎటువంటి ఆటంకాలూ రాకుండా అతనికీ, ఉద్యమానికీ తన దృఢమైన సంఘీభావాన్ని ప్రకటించింది. కామ్రేడ్ సాగర్ తన సహచరిని కూడా వృత్తి విప్లవకారిణి కావాలని కోరుకున్నాడు. కానీ ఆమె అనారోగ్యం అందుకు ఆటంకంగా ఉండడం వల్ల ఆమె ఇంటి దగ్గరే ఉండిపోవాల్సి వచ్చింది.

సహచరి అనారోగ్యం మూలంగా ఆమెను పూర్తికాలం కార్యకర్తగా తీసుకురాలేకపోయిన కా. సాగర్ తమ ఇద్దరి బిడ్డలూ ఉద్యమంలోకి రావాలని కోరుకున్నాడు. పెద్ద

కూతురు పదవతరగతి చదువుతున్నప్పటి నుండే అరుదుగానే అయినా ఆమెను కలుస్తూ రాజకీయ బోధనలు ప్రారంభించాడు. ఆ బోధనలు ఫలించి డిగ్రీ చదువును రెండవ సంవత్సరంలో వదిలేసి ఆమె ఉద్యమంలోకి వచ్చింది. మధ్యతరగతి విద్యార్థి జీవితం నుంచి వచ్చిన కూతురుకు కఠోరమైన అటవీ జీవితంలో నిలదొక్కుకోవడం కోసం చేయూతనందించాడు. ఆమెకు ప్రేమతోపాటు రాజకీయాలనూ రంగరించి అందించేవాడు. క్రమశిక్షణాయుతమైన దళ జీవితానికి ఆమె అలవాటు పడేలా కృషి చేశాడు.

చిన్న కూతురికి కూడా తన బోధనలు ప్రారంభించాడు. ఆమె కూడా ఉద్యమంలోకి రావాలనే కామ్రేడ్ సాగర్ కోరిక కార్యరూపం దాల్చకముందే అతను అమరత్వం చెందాడు.


ఇలా కామ్రేడ్ సాగర్ జీవితాన్ని ఏమాత్రం తడిమినా ఎంత కష్ట కాలంలోనైనా ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించిన తీరూ, కుటుంబ సంబంధాలను రాజకీయ సంబంధాలుగా మల్చుకున్న తీరు స్పష్టంగా కనబడుతుంది.

ఉత్తర తెలంగాణ ఎదుర్కుంటున్న నేటి ఆటు స్థితిలో, కామ్రేడ్ సాగర్ వంటి సుదీర్ఘ పోరాట అనుభవమున్న, పలు రంగాల్లో సమర్థతలు కల్గిన నాయకుడిని కోల్పోవడం తీవ్రమైన నష్టం. ఆ నష్టాన్ని పూరించడానికి కామ్రేడ్ సాగర్‌లోని రాజకీయ దృఢత్వాన్ని, కష్టాలకు ఎదురీదే మనో నిబ్బరాన్నీ, ఏ క్షణంలోనైనా శత్రువుపై పోరాడే సాహసాన్ని, కుటుంబ సంబంధాలను రాజకీయ సంబంధాలుగా మార్చుకునే చైతన్యాన్ని అలవర్చుకుందాం. ఏ కర్తవ్య సాధనకు అతడు తన ప్రాణాన్ని ఫణంగా పెట్టాడో ఆ కర్తవ్యాన్ని పరిపూర్తి చేయడానికి దృఢంగా సంకల్పిద్దాం. ఇదే కామ్రేడ్ సాగర్‌కు మనం ఇచ్చే నివాళి.

## కామ్రేడ్ భాస్కర్

కామ్రేడ్ భాస్కర్‌ది వరంగల్ జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామం. నిరుపేద ఆదివాసీ కుటుంబంలో పుట్టాడు.

కామ్రేడ్ భాస్కర్ పుట్టడంతోనే తల్లిదండ్రుల ఆలనాపాలనా నోచుకోక ఇరుగుపొరుగు వారి సహాయంతో మేకపాలతో బతికాడు. కొంచెం పెద్దయ్యాక వాళ్ల సమీప గ్రామంలో వున్న ఆశ్రమ పాఠశాలలో ప్రాథమిక విద్య చదువుతూ, తర్వాత కొత్తగూడలో తన చిన్నమ్మ దగ్గర వుంటూ 10వ తరగతివరకూ చదువుకున్నాడు. చదవుకుంటున్న సమయంలోనే తన గ్రామం పార్టీకి ఒక



విప్లవ కేంద్రం కావడం వల్ల, మొదటి నుండి కూడా తనపైన విప్లవ బీజాలు పడ్డాయి. అట్లా చిన్న వయసులోనే పార్టీలో పని చేయడానికి సిద్ధమయ్యాడు. అయితే పార్టీ తన వయసును దృష్టిలో పెట్టుకొని పూర్తికాలం కార్యకర్తగా తీసుకోకుండా కొంతకాలం గ్రామంలోనే వుండి పని చేయమని చెప్పింది. దాంతో కొన్నాళ్లు కామ్రేడ్ భాస్కర్ వూళ్లోనే ఉండి పని చేశాడు. ఆ సమయంలోనే జిల్లా కమిటీ కొరియర్‌గా పని చేశాడు. కొంత కాలం పనిచేశాక శత్రువుకు బహిర్గతం అయ్యాడు. దాంతో పార్టీ పూర్తికాలం కార్యకర్తగా రావాలని పిలుపు ఇస్తే తన బక్కచిక్కిన శరీరాన్ని లెక్క చేయకుండా శషభిషలు లేకుండా సిద్ధమైనాడు. 2000 సంవత్సరంలో వుమ్మడి కరీంనగర్, ఖమ్మం డివిజన్ కమిటీ కామ్రేడ్ భాస్కర్‌ను మణుగూర్ ఎసిలోకి, మంగపేట దళం డిప్యూటీ కమాండర్‌గా బదిలీ చేసింది. అప్పటి నుండి తన గెరిల్లా జీవితం మొదలైంది.మంగపేట దళంలో కొంతకాలం పని చేసిన తర్వాత మరి కొంతకాలం గార్డుగా పని చేశాడు.ఆ తర్వాత ఖమ్మం, కరీంనగర్ డివిజన్ కమిటీ పరిధిలోని వెంకటాపూర్ దళంలో ఒక సంవత్సరంపాటు పని చేశాడు. ఖమ్మంలో కొత్త ప్రాంతానికి విస్తరించాలనే నిర్ణయంలో భాగంగా జిల్లా కమిటీ కామ్రేడ్ భాస్కర్‌ను అశ్వరావుపేట ప్రాంతానికి పంపింది. ఆ ప్రాంతంలో అనేక రివిజనిస్టు పార్టీల మధ్య, ఆంధ్ర వలస భూస్వాములను ఎదుర్కొంటూ తన శక్తి కొద్దీ పని చేశాడు. అనారోగ్య సమస్యలు ఎదురయినా లెక్కచేయకుండా అధిగమించుతూ నిత్యం ప్రజల సమస్యలను పరిష్కరించుతూ, ప్రజలను నిర్మాణంలోకి తీసుకురావడం కోసం తీవ్రమైన కృషి చేశాడు. పోలవరం సమస్యపై ప్రజలను కూడగడుతూ, ధర్నాలు, రాస్తారోకోలు చేయించాడు.గ్రామ స్థాయి నిర్వాసితుల కమిటీలను ఏర్పాటు చేసి ప్రజల్ని పోరాటాల్లోకి కదిలించాడు. ఆ ప్రాంతంలో కుకునూర్ మండలం బండోర గ్రామంలో కరడుగట్టిన భూస్వామి, కాంగ్రెస్ నాయకుడిని చంపడంలో కీలకపాత్ర పోషించాడు. పోలవరం ప్రాజెక్టును

అడ్డుకోవడం కోసం నిర్వాసితుల పేరుతోని కడుతున్న కాలనీలను పేల్చివేసి ప్రభుత్వానికి సవాల్‌గా నిలిచాడు. అట్లా ఈ ప్రాంతంలో జరుగుతున్న ఉద్యమంలో కీలకపాత్ర పోషించాడు.

కామ్రేడ్ భాస్కర్ నిరంతరం శత్రువును ఎలా దెబ్బతీయాలి? ఎలా ప్రజల ఆత్మస్థైర్యాన్ని నిలబెట్టాలి అని చర్చించేవాడు. 2007 నవంబర్ నుండి శత్రువు అణచివేత నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఏరియాలో తీవ్రంగా కూంబింగ్ జరిపినా వాటి మధ్యనే దళాన్ని తిప్పుతూ, కూంబింగ్‌లను ఛేధించుతూ, శత్రువు కండ్లు కప్పి నిరంతరం కదలికల్లో వుంటూ, తనకు అప్పగించిన బాధ్యతలను మనస్ఫూర్తిగా నెరవేర్చాడు. కామ్రేడ్ భాస్కర్ శత్రువు పైన దాడి చేయడానికి నిరంతరం ఉత్సాహం చూపేవాడు. అందుకే కంచాలకు పోలీసులు వచ్చారని తెలియగానే దాడి చేయడం కోసం 13 మంది బ్యాచ్‌ను సెలక్ట్ చేస్తే, అందులో తన పేరు కూడా వున్నదని తెలియగానే చాలా సంతోషంతో శత్రువుపై కసితో దాడికి వెళ్లాడు. కామ్రేడ్ భాస్కర్ నిత్యం చిరునవ్వుతో తన సభ్యులనూ, ప్రజలనూ పలకరించేవాడు. ఎన్నడూ కూడా కోపాన్ని ఎరుగనోడు. అందరితోటి ఆప్యాయంగా మెలిగేవాడు. సమిష్టి పనుల్లో, పార్టీ కార్యక్రమంలో ముందుండడం కోసం తీవ్రమైన ప్రయత్నం చేసేవాడు. అట్లా తన 8 సంవత్సరాల ఆచరణలో ఎంతో మంది కామ్రేడ్స్ అమరులైనా,శత్రువుముందు మోకరిల్లినా ఎన్నడూ వూగిసలాట లేకుండా తన విప్లవ జీవితాన్ని తుది శ్వాసవరకు ప్రజల కోసం అంకితమిచ్చి, ఆదర్శవంతం చేసుకున్నాడు. కామ్రేడ్ భాస్కర్ జీవితం నుండి మనం ఎన్నో నేర్చుకోవాలి.

## కామ్రేడ్ గిరిబాబు (రఘు)



వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం ఏరియా బంట్వారంగూడెం గ్రామంలో కామ్రేడ్ రఘు (గిరిబాబు) నిరుపేద కుటుంబంలో పుట్టి పెరిగాడు. అదే గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకూ చదివి కుటుంబ ఇబ్బందుల వల్ల ఆ తర్వాత చదువు కొనసాగించలేక పోయాడు. కుటుంబమంతా కూలీ పనులకు పోతేనే పొట్ట గడిచే పరిస్థితి. అలా చిన్న వయసులోనే కష్టాలను ఎదుర్కుంటూ పార్టీ పరిచయాల్లోకి వచ్చాడు.

బాలల సంఘంలో నాయకుడిగా పని చేస్తూ దళంకు శత్రువు పరిస్థితిని చెప్పేవాడు. కొంత కాలానికి రైతు కూలీ సంఘంలో పని చేశాడు. దళం తమ గ్రామానికి వచ్చినపుడు అన్ని విధాలా సహకరించడంతో పాటు దళానికి కొరియర్‌గా కూడా పని చేశాడు. పార్టీ అవసరాలరీత్యా 2001లో పూర్తికాలం కార్యకర్తగా వచ్చాడు. చిన్న వయసులోనే పెండ్లి చేసుకొని కుటుంబ వ్యవహారాలు నడుపుతూ, పూర్తికాలం కార్యకర్తగా తిరుగుతూ తన సహచరిని దళంలోకి తీసుకువచ్చాడు. కొంత కాలానికే ఎన్‌కౌంటర్‌లో సహచరి అమరురాలైంది. అయినప్పటికీ తను పట్టు వదలకుండా, శత్రువుపై కసిపెంచుకొని ఏటూరునాగారం దళ సభ్యునిగా చేరాడు. కొంతకాలం తర్వాత ఎస్.జడ్.సి.సభ్యుడికి గార్డుగా వున్నాడు. రెండు సంవత్సరాలు తన బాధ్యతను శ్రద్ధగా నెరవేర్చాడు. ఎ.పి. ప్రభుత్వంతో జరిగిన చర్చల కాలంలో, చర్చలకు వెళ్లిన నాయకత్వానికి రక్షణ రీత్యా సెక్యూరిటీ గార్డుగా తన బాధ్యతలను నెరవేర్చాడు. ఆ తర్వాత ఖమ్మం జిల్లాకు వెళ్లాడు. కొత్త ప్రాంత విస్తరణలో భాగంగా 2005లో శబరి ప్రాంతానికి వెళ్లాడు. శబరి ఏరియాలో భద్రాచలం ఎల్.ఒ.ఎస్‌లో డిప్యూటీ కమాండర్‌గా పని చేస్తూ అక్కడి ప్రజలలో కలిసిపోయి వాళ్ల యాసా భాషా నేర్చుకుని వాళ్ల తల్లో నాలుకగా మెదులుతూ వారి అభిమానాన్ని చూరగొన్నాడు.

శబరి ఏరియా పరిధిలో రివిజనిస్టు పార్టీలైన సి.పి.ఎం, సి.పి.ఐ, న్యూడెమోక్రసీ పార్టీలు బలంగా వున్నాయి. ఇవి మావోయిస్టు పార్టీని అణచడంలోభాగంగా దళాల కదలికలను పసికడుతూ ఎప్పటికప్పుడు శత్రువుకు సమాచారం చేరవేస్తున్నాయి. ఈ పరిస్థితిలో శత్రువు కండ్లు కప్పి తిరుగుతూ రివిజనిస్టు కంచు కోటల్లో పార్టీ బీజాలు వేశాడు కామ్రేడ్ రఘు. కోస్తా ఆంధ్ర నుండి వలస వచ్చిన భూస్వాములు ఇక్కడి ఆదివాసులను ఎట్ల దోపిడీ చేస్తున్నారో ప్రజలకు వివరంగా చెప్పడంలో కృషి చేశాడు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పోలవరం ప్రాజెక్టు మూలంగా శబరి ప్రాంతంలో నాలుగు మండలాలు ముంపుకు గురి అవుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజలను కూడగడుతూ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీలు పెడుతూ ప్రజలను

కదిలించడంలో కృషి చేసాడు.

దళంను నిరంతరం అప్రమత్తంగా వుంచుతూ దళ సభ్యులకు రాజకీయాలు చెపుతూ చదువు రానివారికి చదువు నేర్పడంలో కృషి చేశాడు. తనకు తెలియని విషయాలను తెలుసుకుంటూ, నేర్చుకుంటూ ఎక్కువ ఉత్సాహాన్ని చూపేవాడు. ఒకసారి మిలిటరీ క్యాంపులో పాలొని చురుగ్గా నేర్చుకున్నాడు.

కంచాల్ వద్ద శత్రువుపై దాడి చేయడానికి సాహసంతో వెళ్లిన కామ్రేడ్ రఘు, అంతే సాహసంగా పోరాడుతూ అమరుడయ్యాడు. కామ్రేడ్ రఘు ఆశయాన్ని కొనసాగిద్దాం.

## కామ్రేడ్ ఇడుమాల్ (జైరామ్)

కామ్రేడ్ ఇడుమాల్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా కుంట బ్లాక్ కిష్టారం ఏరియా తుమ్మల గ్రామంలో ఆదివాసీ కుటుంబంలో పుట్టి పెరిగి, బతుకుదెరువు కోసం ఖమ్మం జిల్లాకు వలస వచ్చాడు.

ఖమ్మం జిల్లా భద్రాచలం డివిజన్ చింతూరు మండలం ఎర్రబోరు గ్రామంలో జీవిస్తుండేవాడు. ఆ క్రమంలో పార్టీ పరిచయంలోకి వచ్చాడు. సంఘంలో ఆరు నెలలు పని చేసి 2005 మే నెలలో దళ సభ్యుడైనాడు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పని చేస్తూ బాధ్యతలను శ్రద్ధగా నెరవేర్చాడు. ఎన్ని కష్టాలు ఎదురైనా పార్టీ పనిని ప్రాణంతో సమానంగా భావించి ప్రజల కోసం పని చేసాడు. దళానికి గుండెకాయలా పైలెట్‌గా ముందు నడుస్తూ దళాన్ని శత్రువు కంట్లో పడకుండా తిప్పేవాడు.

శబరి ప్రాంతంలో అడవిపైనా దారులపైనా అటు తూర్పుగోదావరి, ఇటు ఖమ్మం ప్రాంతంలో పట్టు సంపాదించాడు. శత్రువు చేసిన దాడుల్లో ధైర్యంగా ముందుండి ఫైరింగ్ చేసేవాడు. పార్టీలోకి వచ్చిన తరువాత చదువు నేర్చుకున్నాడు. సమిష్టి పనులు చేస్తూ దొరికిన కొద్ది సమయంలో చదువుకోసం వెచ్చించేవాడు. మిలిటరీ విషయాలు నేర్చుకుంటూ రోజువారిగా మిలిటరీ ప్రాక్టీస్ చేసేవాడు. దళంలో అందరితో కలిసిపోయేవాడు. కంచాల్‌లో జరిగిన దాడిలో వీరోచితంగా పోరాడుతూ అమరుడైనాడు.కామ్రేడ్ ఇడుమాల్ అమరత్వాన్ని ఎత్తిపడుదాం.

## కామ్రేడ్ ముసకి సన్నాల్ (సుదర్శన్)



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా పామేడ్ రేంజ్ తుమ్మిడేం గ్రామంలో కడునిరుపేద ఆదివాసీ కుటుంబంలో 18 ఏండ్ల క్రితం కామ్రేడ్ ముసకి సన్నాల్ పుట్టాడు.

పుట్టి పెరిగింది ఉద్యమ ప్రాంతంలో కాబట్టి ఆ ప్రభావం తనపైన కూడా పడింది. చిన్నతనం నుండే పార్టీ పరిచయం అయింది. పెద్దయ్యాక 2005 నుండి గ్రామ మిలీషియాలో వుంటూ ఏరియాలో శత్రువుపై చికాకుపర్చే చర్యల్లో చురుగ్గా పాల్గొన్నాడు. అలాగే కాంకేర్ గ్రామంలో శత్రువును చికాకుపర్చే చర్యలో పాలుపంచుకున్నాడు. మిలీషియాలో పని చేస్తూనే వెంకటాపూర్ ఏరియాలో 2007 జూలైలో దళంలోకి భర్తీ అయ్యాడు.


దళ జీవితాన్ని గడుపుతూ క్రమశిక్షణతో మెదిలేవాడు. తనకు అప్పగించిన పనిని బాధ్యతగా చేసేవాడు. సమిష్టి పనులల్లో చురుగ్గా పాల్గొంటూ కామ్రేడ్సందరితో కలుపుగోలుగా వుండేవాడు. అమరత్వానికి కొద్ది రోజుల ముందే ఖమ్మం జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సాగర్‌కు గార్డుగా బాధ్యతలు స్వీకరించాడు. ఆ బాధ్యతలను నెరవేర్చుతూనే కామ్రేడ్ సాగర్‌తో పాటే అమరుడయ్యాడు.చిన్నవయసులోనే జీవితాన్ని ఆదర్శవంతం చేసుకున్న కామ్రేడ్ సన్నాల్ ఆచరణ అందరికీ అనుసరణీయం.

**పత్రికకు మీ ప్రాంతంలోని పోరాట, ప్రతిఘటన, నిర్బంధ, సభలూ - సమావేశాల నివేదికలు, అమరుల చరిత్రలను ఎప్పటికప్పుడు పంపుతూ వుండండి.**

**మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం వర్థిల్లాలి!**

# శ్రీకాకుళ పోరాట వారసత్వాన్ని ఎ.ఒ.బి ప్రాంత జిల్లాలకు గొప్ప ఉత్సాహంతో అందించిన పోరు గురువు కామ్రేడ్ గంగారాం

ఎవరూ నమ్మని కట్టుకథల్ని నిస్సిగ్గుగా ప్రచారం చేసే ఆంధ్రప్రదేశ్ పోలీసులు తాజాగా మరో కట్టుకథను అల్లారు. ఈ సంవత్సరం మార్చి 11న విజయనగరం జిల్లా కేదారి పురం వద్ద జరిగిన ఎదురుకాల్పుల్లో కామ్రేడ్ గంగారాం (కొమ్ము) మరో కామ్రేడ్‌తో సహా ప్రాణాలు కోల్పోయాడన్నది- ఆ కట్టుకథ. కామ్రేడ్ గంగారాంను, గణపత అనే సానుభూతిపరుడితో సహా ఎ.పి.ఎస్.ఐ.బి. పోలీసులు ఒరిస్సాలో అరెస్ట్ చేసి, చిత్రహింసలు పెట్టి హత్యచేసి ఎన్‌కౌంటర్ అన్నారు. ఈ ఇద్దరి కామ్రేడ్స్‌కు వినమ్రంగా జోహార్లర్పిద్దాం.



అనుభవజ్ఞుడూ, అనేక నైపుణ్యాల మేళవింపూ అయిన కామ్రేడ్ కొమ్మ అమరత్వం ఎ.ఒ.బి. ఉద్యమానికి తీవ్రమైన నష్టం.

కామ్రేడ్ చౌక్కోరి గంగారాం శ్రీకాకుళం పోరాట వారసుడు. 1968-70ల మధ్య మహత్తర సాయుధ రైతాంగ పోరాటం నడిచిన ఉద్యమ ప్రాంతమైన-శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పలాసపుర గ్రామంలో ఒక పేద గీత కార్మిక కుటుంబంలో పుట్టాడు. కుటుంబ సభ్యుల పట్టుదలతో తన తెలివితేటలకు పదును పెడుతూ కాలేజీ చదువుల కెళ్లాడు. ఆంధ్రప్రదేశ్‌లో నక్సల్‌బరీ శ్రీకాకుళ పోరాటాలతో కొత్త తరాన్ని ఉత్తేజపరుస్తూ రాడికల్ (విప్లవ) విద్యార్థి ఉద్యమం రాష్ట్ర నలుమూలలకూ విస్తరించింది. అవి శ్రీకాకుళాన్ని మరల పునరుజ్జీవింప చేస్తూ 80వ దశకాన్ని నూతనంగా ఆవిష్కరించాయి. అలా ఎగిరిన రాడికల్ జెండాను భుజాన నిలుపుకుని అవిశ్రాంతంగా ఆ ఆశయసాధనకు అంకితమై విప్లవ యోధుడుగా, ఆదర్శ గెరిల్లాగా తన ఉద్యమ ప్రస్థానాన్ని సాగించాడు కామ్రేడ్ గంగారం.

. చిన్నతనం నుండి కొత్త విషయాల్ని అన్వేషించడం, వాటిని గొప్పగా చెప్పి ఇతరులను ఆకట్టుకోవడం అలవాటైన గంగారం చుట్టూ ఒక మిత్ర బృందం వుండేది. ఆట, పాట, కథలు అన్నింటిలోనూ చురుగ్గా వుంటూ గ్రామంలోనే తెలివైనవాడిగా, చురుకైన వాడిగా పేరు తెచ్చుకున్న ఈ విద్యార్థి రాడికల్ విద్యార్థి కావడం, నక్సలైట్ పార్టీ నాయకుడు కావడం, ఆంధ్ర-ఒరిస్సా స్పెషల్ జోనల్ కమిటీకి 2006 రాష్ట్ర మహాసభల్లో ప్రత్యామ్నాయ సభ్యుడిగా ఎన్నికకావడం ఎవరినీ ఆశ్చర్యపరచలేదు. ఈ క్రమమంతా చాలా సాధారణంగానే జరిగిపోయింది. నూనూగు ప్రాయంలో విప్లవ భావాలతో అల్లూరి, భగత్‌సింగ్‌ల చరిత్ర, శ్రీకాకుళ నేపథ్యం ఇచ్చిన స్ఫూర్తితో తోటి విద్యార్థులకు, మార్గదర్శకంగా నిలిచి అనేక విద్యార్థి పోరాటాలను నడిపాడు. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలను చర్చించాడు. రైతాంగంతోపాటు అన్ని సెక్షన్ల సమస్యలను, జాతుల సమస్యలను అనేక వేదికల మీద మాట్లాడాడు. తను కరపత్రమై, పోస్టరై, వాల్‌రైటింగై, వూరేగింపై ఒక శక్తిగా ఎదుగుతున్న క్రమంలో పోలీసులు అరెస్టు చేసి తప్పుడు కేసులు పెడితే ఏమాత్రం బెదరకుండా పట్టుదలతో పార్టీ జెండాను భుజానికెత్తుకుని రాడికల్ యువజన సంఘాన్ని ఆర్గనైజ్ చేస్తూ రైతాంగాన్ని సమీకరిస్తూ పూర్తికాలం కార్యకర్తగా అభివృద్ధి చెందాడు. నిర్బంధం ప్రతిఘటనను పెంచింది. అణచివేత చైతన్యాన్ని పదునెక్కించి వర్గతత్వాన్ని దృఢపరిచింది. జిల్లా ఉద్యమం తీరప్రాంత పల్లెకారుల్ని ఆర్గనైజ్ చేయమని పంపినపుడు జిల్లా నాయకత్వంతో కలిసి తీరప్రాంత ప్రజల్ని ఆర్గనైజ్ చేసాడు. ముఖ్యంగా ఉద్దానంలో దళం నిర్మాణంలో, విడి ఆర్గనైజర్‌గా, జిల్లా పార్టీ నాయకుడిగా పని చేసి, ఆ ప్రాంత ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించాడు. 1990 నుండి శ్రీకాకుళం జిల్లాలో పాత పోరాట ప్రాంతాలలో, తిరిగి దళాలు పని చేయాలని నిర్ణయించుకున్నప్పుడు పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, కొండబారిడి, గుమ్మలక్ష్మీపురం, నీలకంఠాపురం ప్రాంతాలన్నీ తిరిగి సవరలను, జాతాబులను కలిసి పాత చరిత్రను తవ్వితీస్తూ, ఆ అగ్నిని మరల రగిలిస్తూ ఆ ప్రజల విశ్వాసాన్ని సంపాదించాడు. అప్పుడు ప్రజలు కామ్రేడ్ గంగారంను ఎర్రన్న అనేవారు. ఎర్రన్న కబుర్లు, ఎర్రన్న కలుపుగోలుతనం శ్రీకాకుళం, విజయనగరం ప్రజలకు బాగా తెలుసు. ఎంత క్లిష్టమైన విషయమైనా, అంతుబట్టని సమస్య అయినా ఎర్రన్న దగ్గర అరటిపండు ఒలిచిన విధంగా స్పష్టమయిపోయేది. కామ్రేడ్ గంగారాంకు వీరగాథలను, ప్రజల

కష్టాలను కళ్లకు కట్టినట్లు చెప్పడంలో గొప్ప నేర్పు వుండేది. అమరుల గురించి రాయడంలో తనకు గొప్ప సంతృప్తి వుంటుందని, తను ఒక బాధ్యతగానే దానిని చేస్తానని చెప్పేవాడు. కోపర్‌డంగ్ అమరుల గురించి రాసినా, కొఠియా అమరుల గురించి, అమిడేలు అమరుల గురించి రాసినా, తన పరిచయంలోని ప్రతి అంశాన్నీ విప్లవీకరించి చెప్పడానికి చాలా చిత్తశుద్ధితోనూ, వినయంగాను ప్రయత్నించేవాడు.

కామ్రేడ్ గంగారాం ప్రజల ఎడల గొప్ప ప్రేమగా ఉండేవాడు. శ్రీకాకుళం జిల్లాలో అమాయక ఆదివాసీ ప్రజల్ని చిత్రహింసల్లో చంపి బూటకపు ఎదురుకాల్పుల్లో చనిపోయినట్లు ప్రకటించిన సందర్భాల్లో బాగా స్పందించేవాడు. అలా చనిపోయిన పాలక కొమ్మా పేరును తను పెట్టుకుని తన త్యాగాన్ని నిరంతరం చెబుతుండేవాడు. 1990 నుండి 2000 వరకు అటవీ ఉద్యమంలో మహేంద్ర దళంలో డిప్యూటీగా, పాలకొండ దళంలో కమాండర్‌గా, తర్వాత దేవగిరి, కొండబారిడి దళాల్లో...ఇలా పది సంవత్సరాలపాటు దళ బాధ్యతలు చూస్తూ శ్రీకాకుళం జిల్లాలో అన్ని ప్రాంతాలలోనూ తిరిగిన కామ్రేడ్ గంగారాం అన్ని దళాల్లోను వివిధ స్థాయిలో బాధ్యతలు నిర్వహించాడు. ఆ జిల్లాలో అన్ని వయస్సుల ప్రజలూ, విప్లవ శ్రేణుల్లోని సహచర కామ్రేడ్స్ అందరూ కూడా ఆ కామ్రేడ్ సహచర్యంతో ఎదిగినవారే. అనేక పోరాటాలను నడిపాడు. ప్రజల సమస్యలను పరిష్కరించాడు. అనేక మిలిటెంట్ చర్యల్లో పాల్గొన్నాడు. 1998 నుండి జిల్లా కమిటీ సభ్యుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వివిధ రకాల బాధ్యతల్లోకి మారాడు.

తమ గ్రామంలోను, కుటుంబంలోనూ కామ్రేడ్ గంగారంకున్న గుర్తింపూ, మంచితనం చూసిన మేనకోడలు అతనిని వెతుక్కుంటూ దళాల దగ్గరకు వచ్చి అతనితోనే వుండిపోయింది. మామయ్యను ప్రేమించడమే కాకుండా అతని ఆశయాన్ని ప్రేమించి, ఆచరణలోను సహచరిగా చేదోడుగా నిలిచి ఉద్యమ కార్యకర్తగా, నాయకురాలిగా ఎదిగింది. ఆమె విప్లవకారిణిగా ఎదగడంలో కామ్రేడ్ గంగారాం ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఎంతో సహకరించాడు.

2006లో ఉద్దానం ఉద్యమ బాధ్యతలను చూస్తున్నపుడు, జీడిపిక్కల సీజన్‌లో ఉద్దానం రైతాంగాన్ని గిట్టుబాటు ధరల కోసం పోరాటాల్లోకి నడిపించాడు. ఈ సందర్భంగా విస్తృతంగా రైతాంగ ప్రదర్శనలను నిర్వహించడంతో పాటు షావుకార్లను ప్రజల సమక్షంలో విచారించి 80 కిలోల బస్తాను 4 వేల 200 రూపాయల ధరను ఇచ్చేలా వారిని ఒప్పించాడు. ఆ పోరాట చైతన్యం ఉద్దానం రైతుల్లో నేటికీ కొనసాగుతోంది.

కామ్రేడ్ గంగారాంకు కొత్త విషయాలను అన్వేషించడంలో ఉన్న ఆసక్తి, రిపేరింగ్, కమ్యూనికేషన్స్, బూబీట్రాప్స్, టీచింగ్ ఇలా అన్ని ప్రక్రియల్లోను వ్యక్తమయ్యేది. ఆ జిజ్ఞాస ఇతరులను బాగా ఉత్తేజపరిచేది. తనలో చాలా నైపుణ్యాలుండేవి. మంచిగా రాసేవాడు.ఆ సామర్థ్యం వలన రెండు సంవత్సరాలుఎ.ఒ.బి. పార్టీ పత్రిక 'విముక్తి పథం' సంపాదక వర్గంలో పని చేశాడు. కామ్రేడ్ గంగారాం మంచి కవి కూడా, అమరులపై అతను రాసిన పలు కవితలు పాఠకుల ప్రశంసలు పొందాయి. కొన్ని కవితలకు శ్రీకాకుళ యాసను జోడించి తన సృజనాత్మకతను చాటుకున్నాడు. ఆయనలోని బోధనా సామర్థ్యం వలన మోపాస్‌లో అయిదు సంత్సరాలు (2002–06 వరకు) పని చేసి మంచి ఉపాధ్యాయుడిగా మెప్పించాడు. సిద్ధాంతం, రాజకీయాలూ, మిలిటరీ చర్యలూ ఏది చెప్పినా విద్యార్థులకు అర్థం అయ్యే విధంగా ఆసక్తికరంగా, సాధారణ భాషలో వారి నుడికారాలతో పోలికలతో చెప్పేవాడు. బోడపాడు జంట రెయిడ్స్, కోరాపుట్ మల్టీ రెయిడ్, అనకాపల్లి–చోడవరం, ఆర్. ఉదయగిరి...ఇలా అనేక దాడుల్లో ఏర్పాట్ల నుండి దాడికి నాయత్వాన్ని అందించడం వరకు అనేక కీలకమైన పనులు చేసాడు. తర్వాత ఆ దాడుల గురించి పూసగుచ్చినట్లు వివరంగా అందరికీ చెప్పేవాడు. ఇలా విశాఖ, విజయనగరం, శ్రీకాకుళ జిల్లాల కార్యకలాపాల్లో కీలక పాత్ర నిర్వహించాడు.

2003, అక్టోబర్‌లో కామ్రేడ్స్ కౌముది, లత, రమణల బూటకపు ఎన్‌కౌంటర్‌కు కారుకుడైన ద్రోహి దుర్గారావును ఖతం చేసిన యాక్షన్ టీంకు కామ్రేడ్ కొమ్మ నాయకత్వం వహించాడు.

కామ్రేడ్ గంగారాం మంచి డాక్టర్. సేవాదృక్పథం, సహకార గుణం ప్రస్ఫుటంగా ఆ పనిలో వ్యక్తమయ్యేది. ఎంత క్లిష్టమయిన కేసయినా ఓపికగా వైద్యం చేసేవాడు. గాయాల్ని శుభ్రం చేసేటప్పుడు గానీ, పశువులకు కూడా గాయాలు కడిగేటపుడుగానీ ఎప్పుడూ కూడా శ్రద్ధగా బాధ్యతగా చేసేవాడు. రోగికి మంచిమాట, మంచి వైద్యం సకాలంలో సక్రమంగా అందించేవాడు.

2006లో ఉద్దానం ప్రాంతంలో ఒక రోడ్డు కాంట్రాక్టర్ పోలీసులతో కుట్ర పన్ని, తనను పట్టించాలని ప్రయత్నించినపుడు

పరిస్థితిని అంచనా వేసుకొని చొరవతో కదిలి చురుగ్గా ప్రతిచర్య చూపించి కాల్పులు చేస్తూ తప్పుకున్నాడు. తర్వాత ఆ కాంట్రాక్టర్ సరెండరయ్యి తప్పు ఒప్పుకుని క్షమాపణ కోరాడు.

2007 నుండి ఎస్.ఎం.సి నిర్ణయించిన పనుల్లో భాగంగా టెక్నికల్ పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో పనుల సమన్వయానికి లోపలికీ బయటకూ తిరుగుతున్నాడు. రాష్ట్ర కమిటీ ఇచ్చిన ముఖ్యమైన పనిలో భాగంగా మార్చి 8న బయటికి వెళ్లాడు. ఒరిస్సాలో ఒక టౌన్‌లో సానుభూతిపరుల కుటుంబానికి చెందిన గణపతితో పాటు కామ్రేడ్ గంగారాంను పట్టుకుని చిత్రహింసలు పెట్టి, రహస్యాలను రాబట్టలేక ఇద్దరినీ హత్యచేసి ఎన్‌కౌంటర్ కట్టుకథనల్లి విజయనగరం జిల్లా, గుమ్మ లక్ష్మీపురం మండలం, కేదారిపురం అడవుల్లో చనిపోయినట్లు మార్చి 11న ఎస్‌పి ప్రకటించాడు. మోటారుసైకిల్, రివాల్వర్‌లు మృతదేహాల వద్ద పెట్టారు పోలీసులు. శత్రు చేతికి చిక్కికూడా ఓటమిని అంగీకరించని వీరయోధుడు మన గంగారాం.

2007లో శ్రీకాకుళం పోలీసులు ఎస్‌పి సమక్షంలో కుటుంబ సభ్యులతో కౌన్సిలింగ్ నిర్వహిస్తే గంగారాం అన్న "మా తమ్ముడు ఇంటికి వస్తే మంచిదే" అని మాట్లాడినట్లు పేపరులో చూసిన గంగారాం, వెంటనే వాళ్లన్నకు బహిరంగ లేఖ రాసాడు. అది పత్రికల్లో వచ్చింది. ఉద్దానం ప్రజలు దానిని పోస్టర్లుగా వేసి బాగా ప్రచారం చేసారు. "నేను విప్లవకారున్ని, విప్లవ ప్రజానీకంతోనే నా జీవితం ముడిపడి వుంది. నా కుటుంబాన్ని కూడా ప్రజల్లో భాగంగానే చూస్తాను' మీరు నన్ను అలాగే చూడండి. ఈ దోపిడీ ప్రభుత్వాన్ని కూలదోసి సమసమాజాన్ని నిర్మించే వరకు అవిశ్రాంతంగా పోరాడుతాను" అని రాసాడు. ఆ ఆదర్శానికి ప్రాణాన్నిచ్చి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాడు.

కష్టకాలంలో కా. గంగారాం మరణం ఎ.ఒ.బి ఉద్యమానికి కోలుకోలేని దెబ్బ. డాక్టర్, టీచర్, నైపుణ్యంగల వ్యక్తి, మంచి ఆర్గనైజర్, మిలిటెంట్ యోధుడు...ఇలా అనేక పాత్రలు వహించి విప్లవోద్యమానికి తోడ్పడిన కామ్రేడ్ గంగారాంను కోల్పోవడం భారత విప్లవోద్యమానికి తీవ్ర నష్టం. అమరుల ఆశయసాధనకు పునరంకితమవుతామని ప్రతిజ్ఞ చేద్దాం.

★

---

*(39వ పేజీ తరువాయి......)*

విప్లవ వ్యతిరేక బూర్జువా, సోషల్ డెమొక్రటిక్ మహిళా ఉద్యమాల నుండి దూరం చేసి తనవైపు ఆకట్టుకోవాలి. సంఖ్యాపరంగా ఆ ఉద్యమాలు తమ బలం గురించి గొప్పలు చెప్పుకున్నంత మాత్రాన అవి సామాజిక విప్లవ శక్తుల విముక్తి సాధన శక్తులూ అయిపోవు. ఆ లక్ష్యాన్ని సాధించాలంటే సామాజికాభివృద్ధి సరిగా అంచనా వేయటం, అవసరమైన రిజర్వులను సమీకరించుకుని తగిన చర్యలను చేపట్టడం చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యతగల విషయం. ఈ కొలబద్దలతో చూస్తే, ఈ రెండు విప్లవ వ్యతిరేక ఉద్యమాలతో పోలిస్తే, బూర్జువా సమాజపు అన్ని శక్తులతో పోల్చినా కమ్యూనిస్టు మహిళా ఉద్యమం అత్యున్నత శక్తిగా తేలుతుంది. ఈ అవగాహనకు ఆచరణాత్మక కార్యకలాపాలు కలిస్తే, కార్మికవర్గ స్త్రీలు ఎర్రజెండా కింద సమీకృతులయ్యే విధంగా వారిని చైతన్యపరిచి, సమైక్య పరచవచ్చు. యావత్తు మహిళా లోకానికి విముక్తిని చేకూర్చే విప్లవ విజయసాధనలో కమ్యూనిస్టు మహిళా ఉద్యమం పాత్ర కూడా గణనీయంగా వుండి తీరుతుంది. ★

***ఆచరణ ద్వారా సత్యాన్ని కనుగొను, తిరిగి ఆచరణ ద్వారా సత్యాన్ని నిర్ధారించుకొని, అభివృద్ధి చేయి. అనుభూతి జ్ఞానం నుండి బయలుదేరు, దాన్ని క్రియాశీలంగా హేతుబద్ధ జ్ఞానంగా అభివృద్ధి చేయి, ఇక అపుడు హేతుబద్ధ జ్ఞానం నుండి బయలుదేరు, స్వీయాత్మకతను, భౌతిక ప్రపంచాన్ని మార్చే విప్లవాచరణకు క్రియాశీలంగా దారి చూపు, ఆచరణ, జ్ఞానం, మళ్లీ ఆచరణ, మళ్లీ జ్ఞానం, ఈ ఆవృత్తి క్రమం అంతు లేకుండా, తిరిగి తిరిగి పునరావృతమవుతూ వుంటుంది. ప్రతి ఆవృతంలోను, ఆచరణ జ్ఞానాల సారాంశం ఇంకా వున్నత స్థాయికి చేరుకుంటుంది. గతితార్కిక భౌతికవాద జ్ఞాన సిద్ధాంతం యావత్తు ఇలాంటిదే. తెలుసుకోవడానికి, చేయడానికి మధ్య ఐక్యతకు సంబంధించిన గతితార్కిక భౌతికవాద సిద్ధాంతం ఇదే.***

**–మావో**

**కరపత్రం** (మార్చి 8 సందర్భంగా ఎన్.టి. ఎస్.జడ్.సి. వేసిన కరపత్రాన్ని ప్రచురిస్తున్నాం... సం.)

మహిళలేని విప్లవం గెలవబోదు గెలవబోదు!

# రాజ్యహింస వ్యతిరేక పోరాట దినంగా అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం(మార్చి8, 2008)ను జరపండి!

## అక్రమంగా అరెస్టు చేసిన కామ్రేడ్స్ శోభాదీ (సిసిఎం), నిర్మల (పశ్చిమ బస్తర్ డిసిఎం), దీప, స్నేహ, సంగీత (టెక్నీషియన్స్), మాలతి, గీత, పద్మ, సుగుణ, స్వరూప, మాధవిలను బేషరతుగా విడుదల చేయాలి!!

## గ్రామ గ్రామాన సభలూ, సమావేశాలు జరపండి!!!

*ప్రియమైన ప్రజలారా!*

ప్రపంచ వ్యాప్తంగా మహిళల పోరాటానికి ప్రతీకగా జరిపే మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినానికి గొప్ప ప్రాముఖ్యత వుంది. వర్గ, పితృస్వామిక దోపిడీ, పీడనలను ఎదుర్కొంటున్న పీడిత, శ్రామిక మహిళల పోరాటాల నుంచి సుమారు 150 సంవత్సరాల క్రితం ఈ దినం పుట్టింది. ఆనాడు అంటే 1857, మార్చి 8న అమెరికాలోని న్యూయార్క్ నగరంలో బట్టల, జౌళీ ఫ్యాక్టరీలకు చెందిన శ్రామిక మహిళలు అత్యంత నికృష్టమైన పని పరిస్థితులూ, తక్కువ వేతనాలకూ వ్యతిరేకంగా నిరసనోద్యమం చేపట్టారు. అలాగే 10 గంటల పని దినాన్ని అమలుపర్చాలనీ, పురుషులతో సమాన హక్కులను డిమాండ్ చేస్తూ శ్రామిక మహిళలు కవాతు నిర్వహించారు. ఈ పోరాటాల స్ఫూర్తితో జర్మనీకి చెందిన కమ్యూనిస్టు నాయకురాలూ, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన క్లారాజెట్కిన్ చొరవతో 1910లో కోపెన్ హేగ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మహాసభ ఈ మహిళా దినాన్ని అంతర్జాతీయంగా పాటించాలని తీర్మానించింది. నాటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా వర్గ చైతన్యం కలిగిన శ్రామికులు ఈ పోరాటిన్ని వారసత్వంగా స్వీకరించి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినం జరుపుకుంటున్నారు. ఒక పోరాట దినంగా పోరాటకారులు, పీడిత, శ్రామిక ప్రజలు జరపాల్సిన మార్చి 8ని నేడు దోపిడీ, పీడనలను అమలు చేసే పాలకవర్గాలు నిస్సిగ్గుగా దీనిని కేవలం ఒక ఉత్సవ దినంగా జరుపుకుంటున్నాయి.

నయావలస తరహా అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ గల మన దేశాన్ని సామ్రాజ్యవాదులు, భూస్వాములు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారులు దోపిడీ పీడనలకు గురిచేస్తున్నారు. ఈ వ్యవస్థను కాపాడుకునేందుకు సమాజంలో సగభాగమైన మహిళలపై పితృస్వామిక అణచివేతను, దోపిడీని అమలు చేస్తున్నారు. ఇలా సమాజంలో సగభాగమైన మహిళలు సామ్రాజ్యవాదుల, భూస్వాముల, దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల దోపిడీ పీడనలతో పాటు అదనంగా పితృస్వామ్యం అనే కాడిని మోస్తున్నారు. అలాగే దోపిడీ వర్గాల అధికారాన్ని, దోపిడీ పీడనలను చెక్కుచెదరకుండా కొనసాగించడానికి రాజ్యం తీవ్ర దమనకాండకు పాల్పడుతున్నది.

ఈ అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను నిలిపి వుంచేందుకు మహిళలపై సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పేరిట దాడులు పెరిగిపోతున్నాయి. భూస్వామ్య సంస్కృతి మహిళలను వంటింటికి బందీని చేయగా, సామ్రాజ్యవాద సంస్కృతి మహిళలను సరుకులుగా మార్చి వేస్తున్నది. టి.వి.లు, సినిమాలు ప్రేమల పేరిట విశృంఖలతను వ్యాపింపజేస్తున్న ఫలితంగానే రోజు రోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాయి. కుటుంబ హింస పెరుగుతున్నది.

నేడు దేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడానికి పురుషులతో పాటు మహిళలు భుజం భుజం కలిపి వీరోచితంగా పోరాడుతున్నారు. ఆకాశంలో సగమైన మేము పోరాటంలో సగం అంటూ సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీలో, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యంలో, విశాల ఐక్య సంఘటనలో, ఇతర ప్రజాసంఘాల్లో, విప్లవ ప్రజా కమిటీల్లో చేరి పోరాడుతున్నారు. తమ పోరాటాల ద్వారా పాత, కుళ్లిన ఈ అర్ధవలస, అర్ధభూస్వామ్య వ్యవస్థను కూల్చుతూ నూతన ప్రజాతంత్ర వ్యవస్థ నిర్మాణానికి కృషి చేస్తున్నారు.

సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ నాయకత్వంలో దండకారణ్యం, బీహార్–ఝార్ఖండ్‌ల్లో వడి వడిగా అడుగులేస్తూ దేశ వ్యాప్తంగా విస్తరిస్తూ ముందుకు సాగుతున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి సామ్రాజ్యవాదుల దన్నుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బహుముఖ దాడిని కొనసాగిస్తున్నాయి. ప్రధానంగా విప్లవోద్యమంలో పాల్గొంటున్న వారిపై, నాయకత్వం వహిస్తున్న వారిపై, సానుభూతిపరులపై క్రూర దమనకాండను అమలు చేస్తున్నాయి. మహిళలు అయినందుకు లైంగిక అత్యాచారాలు జరుపడమనే హింసను పోలీసులు అదనంగా అమలు జరుపుతూ తమ పితృస్వామిక, పురుష అహంకారాన్ని చాటుకుంటున్నారు.

సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యురాలు, నారీముక్తి సంఘ నాయకురాలు, ఆదివాసీ మహిళా యోధ కామ్రేడ్ బుదినీ ముండా (శీలాదీ, శోభాదీ)ను ఒరిస్సా రాష్ట్రంలోని రూర్కెలా పట్టణ సమీపంలోని చిన్న గ్రామంలో 2006, అక్టోబర్‌లో అక్రమంగా అరెస్టు చేసి తప్పుడు కేసులతో జైల్లో బంధించారు. దండకారణ్యంలో (ఛత్తీస్‌గఢ్) క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ (కె.ఎ.ఎం.ఎస్) జోనల్ కార్యదర్శి, పశ్చిమ బస్తర్ డిసిఎం కామ్రేడ్ నిర్మలను రాయపూర్‌లో అరెస్టు చేసి జైల్లో బంధించారు. మధ్యప్రదేశ్‌లో రూర్కెలా నగరంలో సీనియర్ మహిళా కామ్రేడ్స్ సలాకుల సరోజన (దీప), స్నేహ, సంగీతలను అక్రమంగా అరెస్టు చేసారు. బిలాయి పట్టణంలో  మల్కన్‌గిరి డిసిఎం కామ్రేడ్ పద్మను, కేరళ రాష్ట్రం అంగమలిలో కామ్రేడ్ సుగుణను ఆంధ్ర ఎస్.ఐ.బి. పోలీసులు  అరెస్టు చేశారు. రాయపూర్ పట్టణంలో 2008 జనవరిలో కామ్రేడ్స్ మాలతీ, గీతలను అరెస్టు చేసారు. అమరవీరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలు కామ్రేడ్ స్వరూపను అరెస్టు చేసి, అక్రమ కేసులు 3కుపైగా పెట్టి వరంగల్ జైల్లో నిర్బంధించారు. కామ్రేడ్ మాధవి (ఎ.పి)ని అరెస్టు చేసి జైల్లో పెట్టారు. అలాగే దేశ వ్యాప్తంగా పదుల సంఖ్యలో మహిళా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేసి బూటకపు కేసులు బనాయించి జైళ్లల్లో నిర్బంధించారు. అరెస్టు చేసిన ఈ మహిళా కామ్రేడ్స్‌ను తీవ్రమైన చిత్రహింసలకు గురి చేసారు. జైళ్లల్లో కూడా ఈ మహిళా కార్యకర్తలకు అవసరమైన వైద్య చికిత్స, కావాల్సిన పుస్తకాలు ఇవ్వడం లేదు. సకాలంలో కోర్టు వాయిదాలకు తీసుకుపోకుండా వేధింపులకు గురి చేస్తున్నారు.

గ్రేహౌండ్స్ లాంటి లైసెన్స్‌డ్ హంతక స్పెషల్ బలగాలు దళాలపై దాడులు చేస్తూ కిరాతక హత్యలకు పాల్పడుతున్నాయి. ఇప్పటికే ఖమ్మం జిల్లా విప్లవోద్యమంలో శబరి ప్రాంతంలో టైగర్ క్యాంపు వద్ద దళంపై దాడి చేసి దళ సభ్యులు కామ్రేడ్స్ జమున, సంగీతలను హతమార్చారు. దండకారణ్యంలోని దక్షిణ బస్తర్‌లో కామ్రేడ్స్ శ్యామల, బసంతీలను ఎ.ఒ.బిలో కామ్రేడ్స్ విజయ, షకీల, శ్వేతలను, కర్ణాటక రాష్ట్రంలో కామ్రేడ్ కావేరి, మహారాష్ట్రలో కామ్రేడ్స్ వనిత, జనియాలను ఆయా ప్రభుత్వాలు బూటకపు ఎదురు కాల్పుల్లో చంపివేసాయి. సి.ఆర్.బి స్టాఫ్ కామ్రేడ్ సుక్కి అనారోగ్యంతో అమరురాలైంది. అంతేకాకుండా దేశవ్యాప్తంగా దోపిడీదారుల ప్రయోజనాలను ఈడేర్చడానికి పాలకవర్గాలు నెలకొల్పుతున్న ప్రత్యేక ఆర్థిక మండళ్లు (ఎస్.ఇ.జడ్), గనులు, ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులవుతున్న ప్రజలు ఉద్యమించినా రాజ్యం తన విషపు కోరలతో కాటేస్తూ వుంది. బాక్సైట్ గనుల స్థాపన కోసం విశాఖలో వాకపల్లి మహిళల సామూహిక అత్యాచారాలు జగద్వితమే. మరొకవైపు హంతకులకు రాజ్యం అండగుంటున్న వాస్తవానికి ప్రత్యూష నుంచి ఆయేషా కేసుల వరకు సజీవ సాక్ష్యాలు. ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లో గిరిజన పేద బాలికను ఎస్.పి కల్లూరి స్వయంగా అత్యాచారం జరిపి హింసించాడు. ఎర్రజెండా ముసుగులో దోపిడీ వర్గాల పాదసేవలో తన్మయం చెందుతున్న సోషల్ ఫాసిస్టు సి.పి.ఎం కార్యకర్తలు, పశ్చిమ బెంగాల్ సింగూర్‌లో ప్రత్యేక ఆర్థిక మండలిని వ్యతిరేకిస్తూ ఉద్యమించిన యువ మహిళా కార్యకర్త తపసిపై అత్యాచారం జరిపి హత్య చేసారు. నందిగ్రాంలో పోలీసులు పదుల సంఖ్యలో

మహిళలను అరెస్టు చేసి  అత్యాచారం చేసి హతమార్చారు. ఛత్తీస్‌గఢ్‌లో హిందూ ఫాసిస్టు బి.జె.పి ప్రభుత్వం 'సల్వాజుడూం' అభియాన్‌ను కొనసాగించి 50 మంది మహిళలను, బాలికలను అత్యాచారం జరిపి కిరాతకంగా హత్య చేసారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఈ రోజు దేశవ్యాప్తంగా కొనసాగుతున్న విప్లవోద్యమం, జాతుల పోరాటాలు, దళిత పోరాటాలు, మైనారిటీల పోరాటాలను దెబ్బ తీయడానికి రాజ్యం మహిళలపై అత్యాచారం జరపడాన్నీ ఎన్‌కౌంటర్ల పేరిట హత్యలు చేయడాన్ని ఎంచుకొంది.

*ప్రజలారా! ప్రజాస్వామికవాదుల్లారా!*

విప్లవ, ప్రజాస్వామిక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను దెబ్బతీయడానికి ప్రత్యేకంగా మహిళలపై రాజ్యం కొనసాగిస్తున్న దమనకాండ రోజు రోజుకు పెచ్చరిల్లిపోతున్నది. పెరిగిపోతున్న రాజ్యహింసకు నిరసనగా ఒక పోరాట దినంగా మార్చి 8ని (అంతర్జాతీయ మహిళా దినం) జరుపుకుందాం. పోరాట దినమైన మార్చి 8ని కేవలం ఉత్సవ దినంగా జరుపుతున్న పాలకవర్గాలకు, వారి పార్టీలకు  నైతిక హక్కు లేదని చాటుదాం.

మార్చి 8 సందర్భంగా పీడిత, శ్రామిక వర్గ మహిళలు, విద్యార్థి, మేధావి, విప్లవ, ప్రజాస్వామిక మహిళా సంఘాలు సభలూ, సమావేశాలూ, సదస్సులు నిర్వహించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అక్రమంగా నిర్బంధించిన కామ్రేడ్స్ షీలాదీ, నిర్మల, కామ్రేడ్స్ దీప, స్నేహ, సంగీత ,గీత, మాలతి, సుగుణ, మాధవి, అమరవీరుల బంధుమిత్రుల సంఘం నాయకురాలు కామ్రేడ్ స్వరూపలను బేషరతుగా విడుదల చేయాలని గొంతెత్తి నినదించాలి. సి.పి.ఐ (మావోయిస్టు) నాయకత్వంలో సాగుతున్న విప్లవోద్యమంలో వర్గ సహోదరులతో భుజం భుజం కలిపి పోరాడేందుకు ముందుకు రావాల్సిందిగా కోరుతున్నాం. రాజ్య హింసను ప్రతిఘటించడానికి పి.ఎల్.జి.ఎ.లో విస్తృతంగా చేరాల్సిందిగా పిలుపునిస్తున్నాం. అప్పుడే మహిళపై కొనసాగుతున్న దోపిడీ, అణచివేతలు నిర్మూలించబడి నూతన ప్రజాస్వామిక రాజ్యంలో తమ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను మహిళలు సాధించుకుంటారు.

**నినాదాలు**

★ రాజ్యహింసకు, మహిళావిప్లవ కారుల అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా, అంతర్జాతీయ మహిళా దినం మార్చి 8ని జరుపుకుందాం!

★ అంతర్జాతీయ శ్రామిక మహిళా దినాన్ని పోరాట దినంగా గ్రామ గ్రామాన సమరోత్సాహంతో జరుపుకుందాం!

★ రాజ్యం అక్రమంగా నిర్బంధించిన కామ్రేడ్స్ షీలాదీ, నిర్మల, దీప, స్నేహ, సంగీత, మాలతి, సుధ, సుగుణ, స్వరూప, మాధవిలను వెంటనే బేషరతుగా విడుదల చేయాలి!

★ రాజ్యహింసను ప్రతిఘటిద్దాం!

★ సమాజంలో సగం, ఆకాశంలో సగమైన మనం పోరాటంలో సగమవుదాం!

★ మహిళలపై కొనసాగుతున్న రాజ్యహింస నశించాలి!

★ మహిళ లేని విప్లవం గెలువబోదు! గెలువబోదు!

★ ప్రజావిముక్తి గెరిల్లా సైన్యంలో చేరండి!

★ నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!

★ సి.పి.ఐ (మావోయిస్టు) వర్ధిల్లాలి!

విప్లవాభివందనాలతో
ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్ కమిటీ
సి.పి.ఐ (మావోయిస్టు)

సిద్ధాంత వ్యాసం

మార్చి 8 ప్రత్యేకం

# మహిళా

## బూర్జువా మహిళా ఉద్యమం

ఈనాటి యావత్తు ఆధునిక మహిళా ఉద్యమం వలెనే బూర్జువా మహిళా ఉద్యమం పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం నుండే తలెత్తింది. స్త్రీ పురుషుల సంపూర్ణ సామాజిక సమానత్వం కోసం సాగే కృషి వెనుక ప్రధాన చోదక శక్తిగా నిలిచిన పెట్టుబడిదారీ విధానం ఆ కృషికి సంబంధించిన ఆర్థిక ప్రాతిపదికను కూడా సృష్టించింది. బూర్జువా సమాజానికి పునాదయిన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం, స్త్రీలూ పిల్లలూ సాగించే గృహోత్పత్తి కార్యకలాపాలకు సంబంధించిన సామాజిక పరిస్థితుల్ని నాశనం చేసింది. అంతకు ముందు ఉండిన సాంఘిక నిర్మాణాల స్వాభావిక పరిస్థితులు స్త్రీల జీవన పరిస్థితులను నిర్ణయించి, వారిని పురుషాధిక్యతకు తలవొగ్గేలా చేశాయి. అంతకు ముందు స్త్రీలు బహుముఖ గృహోత్పత్తి కార్యకలాపాలు సాగించేవారు.ఆధునిక నగరాల అభివృద్ధి వల్ల కుటుంబంలో వారి పనిస్థానం, వ్యవసాయక ముడిపదార్థాలకు సంబంధించి వారి ఆధారం దెబ్బ తిన్నాయి. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని వినియోగించి ఆర్థిక నైపుణ్యాన్ని, సాంకేతిక పద్ధతులను అభివృద్ధిపరుచుకోవడంలో వేసిన ముందంజ, ఉత్పత్తిలో మెరుగైన విధానాలు, ఇంజన్లు, యంత్ర పరికరాలు, ఇవన్నీ పై విస్తృత పెనుమార్పును తీసుకు రావడంలో సాధనాలయ్యాయి. బూర్జువా సమాజంలోని ఇటువంటి మార్పులు ఆధునిక మహిళా ఉద్యమానికి ముందు షరతుగా పని చేశాయి. ఈ సామాజిక మార్పులతోపాటు ఒక పథకం ప్రకారం, సంఘటిత పద్ధతిలో, చట్టపరమైన సామాజికపరమైన పురుషాధిక్యత నుండి విముక్తి సాధించడానికీ, స్త్రీ పురుషుల మధ్య సామాజికపరమైన, మానవ సంబంధమైన సమానత్వాన్ని సాధించడానికీ కృషిచేసే స్త్రీ జనావళి సంఖ్య క్రమ క్రమంగా పెరుగుతూ వచ్చింది.



చట్టపరంగానూ సామాజికంగానూ కూడా పురుషులతో సమానమైన స్థానాన్నీ హోదాను తమకు కల్పించాలనే మౌలిక డిమాండ్ బూర్జువా మహిళా ఉద్యమం లేవనెత్తింది. ఈ డిమాండ్ గనుక సాధించబడితే, ఎట్టి మినహాయింపులూ లేకుండా మొత్తం స్త్రీలందరూ విముక్తి చెందినట్టేనని ఆ ఉద్యమ నాయకులు ఉద్ఘాటించారు. ఇది నిజంకాదు. సఫ్రగెట్స్ (అప్పట్లో స్త్రీలకు ఓటు హక్కు లేదు, దాన్ని సాధించడం ధ్యేయంగా ఫెమినిస్టు ఉద్యమాలు తలెత్తాయి. అందుకే వారిని – ఓటు హక్కు లేదా సఫ్రేజిని సాధించేవారిని– సఫ్రగెట్స్ అన్నారు – అను॥) ఒక విషయాన్ని చూడలేకపోయారు, లేదా చూడనిరాకరించారు. అదేమంటే, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం పునాదిగా ఏర్పడి, బూర్జువాజీకి కార్మిక వర్గానికీ మధ్య పూడ్చలేని వర్గ వైరుధ్యంపై ఏర్పడిన బూర్జువా సమాజం, ఒకపక్క దోపిడీదారులు పాలకులుగా, మరోవైపు దోపిడీకి గురయ్యేవాళ్లు పాలితులుగా విభజింపబడి వుంది. కాబట్టి సంపూర్ణమైన సామాజిక లేదా మానవ స్వేచ్ఛకు గానీ, బానిసత్వానికిగాని ఇదే నిర్ణయాత్మకం కాగలదు. నిజానికి స్త్రీల జీవిత విధానాన్నీ వారి పరిస్థితినీ నిర్ణయించేది వారు ఈ రెండు వర్గాల్లో దేనికి చెందుతారనే విషయమే తప్ప, వారు స్త్రీ జాతికి చెందడం కాదు. స్త్రీలుగా వారికి దాదాపు ఏ హక్కులూ లేవు, ప్రత్యేక హక్కులు కలిగి అధికారం చెలాయించే పురుషుల స్థానానికి అనుకూలంగా వారు అణచివేతకు గురయ్యారు. కాబట్టి శాసనాల్లో పొందుపరచబడిన లాంఛనప్రాయమైన స్త్రీ పురుష సమాన హోదావల్ల దోపిడి చేయబడుతున్న, అణచివేయబడుతున్న వర్గానికి చెందిన స్త్రీలు తమ వర్గానికి చెందిన పురుషుల వలెనే నామమాత్రమైన సామాజిక మానవ స్వేచ్ఛను, సమానత్వాన్ని మాత్రమే పొందారు. ఆ వర్గానికి చెందిన

# ఉద్యమాలు

-క్లారా జెట్కిన్

పురుషులు, వారు బూర్జువాజీ పురుషుల వలెనే పురుష జాతికి చెంది వున్నప్పటికీ కూడా, ఈ నామమాత్రమైన స్వేచ్ఛా సమానత్వాలనే పొందారు.

బూర్జువా సమాజానికి సంబంధించిన విశిష్టమైన మౌలికమైన వర్గ వైరుధ్యమే స్త్రీల ఈ పరిస్థితికి కారణం. మానవ అస్తిత్వానికీ, సాంస్కృతిక పురోగతిని సాధించడానికీ అవసరమైన సరుకులను ఉత్పత్తి చేసే సాధనాలపై వ్యక్తిగత యాజమాన్యం వుండటమనేదే ఆ వైరుధ్యం. సంఖ్య రీత్యా జనాభాలో అత్యధికంగా వుండి, దోపిడీ చేయబడుతున్న వర్గానికి చెందిన స్త్రీలతోపాటు వర్గ బానిసత్వంతో సన్నిహితంగా ముడిపడిన ఇతర పీడిత వర్గాలు, వాస్తవంలో సంపూర్ణమైన విముక్తినీ, సమానత్వాన్నీ పొందాలంటే వర్గ బానిసత్వం ఏర్పడటంలోని ఈ మౌలిక కారణాల్ని నిర్మూలించాలి. వ్యక్తుల, చిన్న చిన్న గ్రూపుల వ్యక్తిగత ఆస్తిగా వున్న ఆధునిక ఉత్పత్తి సాధనాలు వాటి సామాజిక స్వభావానికి అనుగుణంగా సామాజిక ఆస్తి అయిననాడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. సరుకుల ఉత్పత్తినీ, భౌతిక సాంస్కృతిక ఫలసంపద పంపకాన్నీ సమాజమే నిర్దేశించగలిగిన నాడు ఇది సాధ్యమవుతుంది. అలా విప్లవీకరించబడిన ఆర్థిక విధానం పునాది మీదనే నూతనమైన ఉన్నతమైన సామాజిక రూపాలు అభివృద్ధి చెందగలవు. ఆ నిర్మాణాలు మాత్రమే సంపూర్ణమైన మానవత్వాన్ని సాధించే దిశలో కార్యశీలతకూ అభివృద్ధికీ కావలసిన నిజమైన స్వేచ్ఛను యావత్తు స్త్రీ జాతికి గ్యారంటీ చేయగలవు. స్త్రీ పురుష బేధం లేకుండా, దోపిడీ చేయబడుతున్న ప్రజలందరూ కలిసి సాగించే సంఘటితమైన విప్లవకర వర్గ పోరాటం మాత్రమే మనల్ని ఈ గమ్యానికి చేర్చగలదు. వర్గ విభేదాన్ని దృష్టిలోకి తీసుకోకుండా పురుషాధిక్యతకు వ్యతిరేకంగా సాగే మహిళల పోరాటం ఈ గమ్యాన్ని చేరలేదు.

వాస్తవాల ఆధారంగా, అనుభవం ఆధారంగా గ్రహించబడిన ఈ శాస్త్రీయ అవగాహనలకు వ్యతిరేకంగా, బూర్జువా మహిళా ఉద్యమంలో మహిళల విముక్తికి కుటుంబంలో, రాజ్యాంగంలో, సమాజంలో పురుషుల ప్రత్యేక హక్కులకూ అధికారానికీ వ్యతిరేకంగా చేసే పోరాటంగా పరిమితం చేసింది. ఈ పరిమితి బూర్జువా మహిళా ఉద్యమంలో విశ్వవ్యాపిత లక్షణమయింది. సఫ్రగెట్స్ స్త్రీ విముక్తి అనే విస్తృతమైన క్లిష్టమైన సమస్యను దాని సంక్లిష్ట సామాజిక నేపథ్యంలో చూడకుండా బూర్జువా సమాజ ప్రయోజనాల సంకుచిత దృష్టితోనే దాన్ని చూసారని ఇది తెలియజేస్తుంది. వారి అవగాహనలు, కార్యకలాపాలు సమాజానికి ఎడంగానే వుండిపోయాయి. ఎందుకంటే స్త్రీల లైంగిక బానిసత్వం వ్యక్తిగత ఆస్తి పునాదిపై, దానితో ముడిపడే అభివృద్ధి చెందిందని చరిత్ర మనకు బోధిస్తోంది.

పురుషులు స్త్రీలపై చేస్తున్న పెత్తనాన్నీ, అధికారాన్నీ నాశనం చేయడం లక్ష్యంగా బూర్జువా మహిళా ఉద్యమం ముందుకు తెచ్చిన ప్రధానమైన డిమాండ్లు ఇవి: వివాహాన్ని నిశ్చయించుకోవడంలో, వివాహం చేసుకోవడంలో, ఆ సంబంధాన్ని తెంపుకోవడంలో సమాన హక్కులు; పిల్లలపై స్త్రీ పురుషులకు సమాన హక్కులు; ఉమ్మడి లైంగిక నైతిక నియమావళి; స్త్రీ తన ఆస్తినీ, ఆదాయాన్నీ, సంపాదననూ వినియోగించుకునే హక్కు; వృత్తిపరమైన శిక్షణ, కార్యకలాపాల స్వేచ్ఛకు హామీ ఇవ్వడం; సామాజిక జీవితంలోని అన్ని రంగాల్లో, కార్యకలాపాల్లో స్త్రీ పురుషులిద్దరికీ సమాన హక్కు; ప్రభుత్వ యంత్రాంగంలో, దాని అంగాల్లో సంపూర్ణమైన రాజకీయ సమానత్వం, వగైరా. సఫ్రగెట్స్ ముందుకు తెచ్చిన ఈ డిమాండ్లు కార్మిక వర్గానికీ, కార్మిక స్త్రీలకూ విలువైనవి. ఇందులో వివాదాస్పదమైనదేమీ లేదు. ముఖ్యంగా స్త్రీలకు పురుషులతో సమానమైన విలువ, హక్కులు వుంటాయనే మౌలికమైన గుర్తింపు ప్రత్యేక ప్రాముఖ్యత కలిగిన విషయం. అయినాగానీ, స్త్రీ లైంగిక బానిసత్వాన్ని తగ్గించడానికీ, నిర్మూలించడానికీ ఉద్దేశించిన సంస్కరణల ప్రాముఖ్యత విలువ పరిమితమైనదే. నిజానికి బూర్జువా సమాజంలోని

అత్యధిక స్త్రీలకు దాని ప్రాముఖ్యత విలువ శూన్యం. ఎందుకంటే, దోపిడీకి గురయ్యేవారి శరీరాలకూ, మనసులకూ సంకెళ్లు వేసే వర్గ దాస్యం కొనసాగుతూనే వుంది. నిజానికి బూర్జువా మహిళా ఉద్యమం విజయం సాధించడం అనేది ఆస్తిపరులైన, పాలితులైన, దోపిడీ వర్గానికి చెందిన, ఆర్థిక స్వాతంత్ర్యం కలిగిన స్త్రీలకే ప్రధానంగా ఉపయోగపడింది.

వర్గ బానిసత్వం అనేది లైంగిక బానిసత్వాన్ని నిలబెట్టి, దాన్ని పెంచి పోషించినా గానీ అత్యధిక స్త్రీలు ఎదుర్కొంటున్న వర్గ బానిసత్వానికి వ్యతిరేకంగా సఫ్రగెట్స్ పోరాటం సాగించలేదు. పైగా, తమ యజమానులకు వ్యతిరేకంగా తమను హింసించే వారికి వ్యతిరేకంగా అణచబడినవారు సాగించవలసిన వర్గపోరాటాన్ని వారు మౌలికంగానే తిరస్కరించారు. బూర్జువా మహిళా ఉద్యమం బూర్జువా సమాజంలో స్థిరంగా పాదుకుని వుంది. పురోగమిస్తున్న కార్మికవర్గానికి వ్యతిరేకంగా అది బూర్జువా సమాజాన్ని కాపాడింది. పురుషులకు అనుకూలంగా స్త్రీలను బానిసలను చేసిన చట్టపరమైన సామాజిక పరమైన సంకెళ్లను వదులు చేయడం ద్వారా బూర్జువా సమాజాన్ని సంస్కరించడానికి మాత్రమే అది ప్రయత్నించింది. కార్మికవర్గం అధికారాన్ని హస్తగతం చేసుకోవడం ద్వారా స్త్రీ విముక్తి లక్ష్యాన్ని సాధించే విప్లవాన్ని తర్వాత కాలంలో సఫ్రగెట్స్‌లో అత్యధికులు వ్యతిరేకించారు. ఆ ఉద్యమం ఆరంభంలో వారు కనబరచిన కొంత తటస్థత అనే ముసుగు కూడా లేకుండా వారు విప్లవాన్ని నగ్నంగా, తీవ్రమైన శత్రు భావంతో వ్యతిరేకించారు. కాబట్టి, బూర్జువా మహిళా ఉద్యమం అనేది స్త్రీ విముక్తికి అగ్రగామి కానేకాదు. అందువల్ల స్వేచ్ఛ కోసం ఆరాటపడే స్త్రీలందరి ప్రయోజనాలకూ అది ప్రాతినిధ్యం వహించలేకపోయింది. అది కేవలం బూర్జువా వర్గ ఉద్యమం; బూర్జువా వర్గ ఉద్యమంగానే అది మిగిలిపోయింది. అప్పటి వరకు ఆధిపత్యం వహిస్తున్న భూస్వామ్య సమాజ పాలిత వర్గాలను పడగొట్టి బలమైన రాజకీయ శక్తిగా తలెత్తిన బూర్జువాజీ, స్వేచ్ఛ కోసం సాగించిన పోరాటంలో ఈ బూర్జువా మహిళా ఉద్యమం ఆఖరి ఘట్టం. భూస్వామ్య సర్వోన్నత అధికారం కింద తొక్కివేయబడి దోచుకోబడిన వారందరినీ తాను ముందుకు తెచ్చిన సూత్రాలను చట్టపరంగా సాధించటమనే పేరుతో పోరాటంలోకి నడిపించడం బూర్జువాజీ లక్ష్యం. దానికోసమే అది ఆ పోరాటాన్ని సాగించింది. ఇవి లాంఛన ప్రాయమైన, బూర్జువా ప్రజాస్వామ్య సూత్రాలు. సార్వజనిక మానవ హక్కుల వ్యక్తీకరణగా బూర్జువా సమాజంలోని సభ్యులందరి సమానత్వాన్నీ, సమాన హక్కుల్నీ శాసనపరంగా గుర్తించడానికి సంబంధించిన సూత్రాలు ఇవి.

పదిహేడవ శతాబ్దపు ఇంగ్లండ్‌కు చెందిన బూర్జువా అధికార అగ్రగాములయిన వారి పూర్తి మతపూరితమైన భావజాలంలో ఈ సార్వజనిక మానవ హక్కులనేవి దేవుడి వరం. తర్వాత ఒక శతాబ్దం అనంతరం, భౌతికవాద ప్రాపంచిక దృక్పథంగల తత్వవేత్తల బోధనలు ఫ్రాన్స్‌లో భూస్వామ్య శక్తికి వ్యతిరేకంగా అధికారం కోసం పోరాడుతున్న బూర్జువా పోరాట నాయకులను ఉ త్తేజపరిచాయి. ఈ తత్వవేత్తల దృష్టిలో ఈ సార్వజనిక మానవ హక్కులనేవి పుట్టుకతో సంబంధం లేకుండా సమాజంలో ప్రతి ఒక్కరికీ చెందే సహజమైన హక్కులు. ఈ రెండు అభిప్రాయాల ఆధారంగా, అంతర్జాతీయ బూర్జువా మహిళా ఉద్యమం స్త్రీల సమానత్వాన్ని "సార్వజనిక మానవ హక్కు"గా, దేముడి వరంగా, బలహీనులైన స్త్రీలనించి బలవంతులైన పురుషులు గుంజుకున్న సహజమైన హక్కుగా గుర్తించాలని డిమాండ్ చేసింది. ఈనాటికీ అది ఈ డిమాండ్‌ను కొనసాగిస్తున్నది. సోషలిస్టు బోధనలు, సోషలిస్టు విమర్శల ప్రభావంతో మాత్రమే అది క్రమంగానూ అసంపూర్తిగానూ, మారిన స్త్రీల జీవన పరిస్థితుల ఆధారంగా తన డిమాండ్లను సమర్థించుకోజూసింది. బూర్జువా సమాజంలో ప్రకటించిన 'ప్రజాస్వామిక సూత్రాలు' నిజానికి బూర్జువా నియంతృత్వంగానూ, 'సార్వజనిక మానవ హక్కులు' ఆస్తిపరుల ప్రత్యేక హక్కుగానూ మాత్రమే వుండగలవనే వాస్తవాన్ని అది విస్మరించింది.

బూర్జువా మహిళా ఉద్యమం తన పుట్టు పూర్వోత్తరాలకు మూలం పద్దెనిమిదవ శతాబ్దం చివరలో జరిగిన ఫ్రెంచి విప్లవంలో చూపుతోంది. ఆ శక్తివంతమైన సంఘటనల వెల్లువలో సంఘటితమై పోరాడిన స్త్రీలు–కుటుంబంలో, సమాజంలో, రాజ్యాంగ యంత్రంలో స్త్రీలకు సంపూర్ణమైన సమానత్వం వుండాలని డిమాండ్ చేశారు. అది సార్వజనిక మానవహక్కుల పర్యవసానమేనని చెప్పిన ఒలింప్ డి గూజె (ఈమె 1748–1793 కాలంనాటి ఫ్రెంచి సఫ్రగెట్. స్త్రీల సంపూర్ణమైన రాజకీయ ఆర్థిక చట్టపరమైన సమానత్వానికై ఆమె నిలబడింది. 'మహిళల, మహిళాపౌరుల హక్కుల ప్రకటన' అనే పుస్తకం రచయిత కూడా) ప్రసిద్ధికెక్కిన మాటలు ఇవి: స్త్రీకి గిలెటిన్ (ఫ్రాన్స్‌లో నిందితుల తలలు నరికే పదునైన యంత్రం–అను) ఎక్కే హక్కు వున్నప్పుడు,

ఆమెకు వేదికలెక్కే హక్కు కూడా వుండాలి. విప్లవాన్ని సమర్థిస్తూ దాని విజయం కోసం అనేక మంది స్త్రీలు త్యాగాలు చేసి విజయాలు సాధించినాగానీ మానవ హక్కులు స్త్రీ హక్కులుగా మారలేదు. శైశవ దశలో వున్న పెట్టుబడిదారీ విధానం ఈ ముందడుగుకు తగినంత లోతుగా బూర్జువా సమాజాన్ని విప్లవీకరించలేదు. పైగా, అప్పటికి బూర్జువాజీకీ కార్మికవర్గానికి మధ్య వర్గ వైరుధ్యం పరిపక్వమూ కాలేదు. దాని తీవ్రతా పెరగలేదు. అదే జరిగివుంటే, స్త్రీల హక్కులు సార్వజనిక మానవహక్కులుగా వ్యక్తీకరించబడటంలో వున్న లాంఛనప్రాయ స్వభావపు అసమగ్రత స్పష్టంగా వెల్లడై వుండేది. అలానే వారు వాంఛించనిదాన్ని వాంఛిస్తున్నట్టు నటించనూ లేకపోయారు. స్త్రీల సంపూర్ణమైన విముక్తిని వారు వాంఛించలేదు.

పందొమ్మిదవ శతాబ్దపు పూర్వార్ధ కాలంలో ఫ్రాన్స్‌లో, జర్మనీలో జరిగిన విప్లవాలు, ఇంగ్లండ్‌లో జరిగిన రాజకీయ సామాజిక పోరాటాలు ప్రత్యేకించి బానిసత్వ నిర్మూలనకై అంతిమంగా అమెరికాలో భూస్వామ్య దక్షిణాదికీ పారిశ్రామిక ఉత్తరాదికీ మధ్య జరిగిన మహత్తరమైన సాయుధ ఘర్షణ – ఈ పోరాటాలు జరిగిన కాలంలోనే స్త్రీ సమానత్వాన్ని ప్రబోధించే సిద్ధాంతకర్తలు బయల్దేరారు; ఈ డిమాండ్‌ని లేవనెత్తుతూ, ఒకదానితో ఒకటి బలహీనమైన సంబంధాలు కలిగివున్న స్త్రీల గ్రూపులు బయల్దేరాయి. ఫ్రాన్స్‌లో, జర్మనీలో అగ్రగాములుగా నిలిచిన వారిలో కొందరు స్త్రీ విముక్తినేకాక, స్త్రీ కార్మికుల జీవన పరిస్థితుల మెరుగుదలని కూడా డిమాండ్ చేశారు. అయితే ఇది కార్మికవర్గ దృక్పథాన్ని స్వీకరించినందువల్ల జరిగింది కాదు. తద్విరుద్ధంగా అది భావావేశపు మానవత్వం నించి జరిగింది. 'నిరుపేద సోదరీమణు'లకు పైనించి సహాయపడటమే వారి ధ్యేయం తప్ప కిందినించి తమంత తాముగా పోరాడాల్సిందిగా వారికి పిలుపునివ్వటానికి సిద్ధపడలేదు. ఫ్రాన్స్ జర్మనీల విప్లవాల్లో (1848 జూన్‌లో పారిస్ ఘర్షణ) కార్మికులు సమైక్య సమరశీల వర్గంగా ముందుకు రావడం గౌరవనీయులైన బూర్జువాజీని కలవర పెట్టింది. పెట్టుబడిదారీ విధానం విజయవంతంగా పురోగమిస్తున్న అన్ని దేశాల్లోనూ దోపిడీ చేస్తున్న వారికీ, దోపిడీకి గురవుతున్న వారికీ మధ్య వర్గ వైరుధ్యం తీవ్రతరమయింది. కార్మికవర్గం చురుకైనటువంటీ, సంఘాల్లో సమీకృతమైనటువంటీ, రాజకీయంగా సంఘటితమైనటువంటీ విప్లవ శక్తిగా రంగం మీదకొచ్చింది. బూర్జువాజీ మొదటగా ఈ శక్తిని తప్పుదారి పట్టించాలని చూసింది, తర్వాత దాన్ని విచ్ఛిన్నం చేయాలని చూసింది. అలా అది విప్లవాత్మక వర్గం నించి అభివృద్ధి నిరోధకమైన వర్గంగా మారి, చివరికి ఖచ్చితమైన విప్లవ ప్రతీఘాతుక వర్గంగా దిగజారింది.

ఈ పరిణామంలో బూర్జువా మహిళా ఉద్యమం చురుకైన పాత్ర వహించింది. పాత పదజాలం ముసుగు తొలగి దాని వర్గస్వభావం రోజు రోజుకూ స్పష్టం కాసాగింది. స్త్రీ కార్మికులకు చట్టపరమైన రక్షణ, స్త్రీల ఓటు హక్కుపట్ల అనుసరించిన వైఖరిలో ఈ స్వభావం మరింత స్పష్టంగా వెల్లడయింది. ఎందుకంటే, స్త్రీల ఓటు హక్కు 'పై వర్గాల స్త్రీల ఓటు హక్కు'గా మారిపోయింది. అయితే బడా పెట్టుబడి అధికారాన్ని తీవ్రంగా చవిచూసిన మేధావి వర్గానికీ, మధ్యతరగతి వర్గానికీ చెందిన స్త్రీ జనావళి అవసరాలూ, డిమాండ్లతో బలాన్ని పుంజుకున్న 'రాడికల్' సఫ్రగెట్స్ దృఢంగా ముందుకు సాగారు. అయినా గానీ, బూర్జువా మహిళోద్యమం 'మరింత ఉదారం'గానూ 'మరింత హేతుబద్ధం'గానూ తయారయింది. పాత దురభిప్రాయాలతో రాజీపడి అది స్త్రీల సమానత్వం కంటే బూర్జువా వర్గ ప్రయోజనానికే పెద్దపీట వేసింది. స్త్రీల ఓటు హక్కుకై జరిగిన పోరాటంలో అమెరికాలో, ఇంగ్లండ్‌లో అరాచక ఆత్మత్యాగ సఫ్రగెట్‌ల టెర్రరిస్టు ఎత్తుగడలు ఓటు హక్కు ఉద్యమ వర్గస్వభావాన్ని నొక్కి చెప్పాయే తప్ప దాన్ని మార్చడంలో విఫలమయ్యాయి. అంతర్జాతీయ సహోదరత్వంపై, గాఢమైన స్వేచ్ఛా ప్రియత్వంపై ఎన్ని పాటలు పాడినా, అన్ని దేశాల్లో బూర్జువా మహిళా సంస్థలు చాలా వరకు 'దేశభక్తియుత రక్షణ' పేరుతో జాతీయోన్మాదులుగా, నాలుగు సంవత్సరాలుగా పైబడి సాగిన సామ్రాజ్యవాద హత్యాకాండకు హంతక దేశ భక్తియుత మద్దతుదార్లుగా వ్యవహరించారు.

1917లో జరిగిన అక్టోబర్ విప్లవం ప్రభావంతో, రష్యా కార్మికవర్గం ప్రపంచ కార్మికవర్గ విప్లవ విజయఢంకా మోగించినపుడు పెట్టుబడిదారీ దేశాల్లోనీ, వలస, అర్ధవలస దేశాల్లోనీ పీడిత వర్గాలూ, అణచివేయబడిన వర్గాలూ, పోరాడటానికీ, తమ సంకెళ్లను తెంపుకోవడానికీ ముందుకువచ్చారు. 1917 తర్వాత, బూర్జువా మహిళా ఉద్యమానికి బూర్జువా సామాజిక వ్యవస్థను పరిరక్షించి సంరక్షించడమే అతి ముఖ్యమైన లక్ష్యమయింది. ఆ వ్యవస్థ పరిధిలో స్త్రీలు తమ వర్గ దాస్యాన్ని గానీ లైంగిక దాస్యాన్ని గానీ వదిలించుకోలేరు. కార్మికవర్గ విప్లవం ఉన్నత ఆర్థిక సాంఘిక నిర్మాణాలను సృష్టిస్తోందని, అక్కడి స్త్రీల

సంపూర్ణమైన సామాజిక, మానవ సమానత్వం కేవలం కాగితాలకే పరిమితం కాబోదని, అది వాస్తవంగా రూపొందుతోందనీ రష్యా రాజ్యాంగం, దాని సోషలిస్టు అభివృద్ధి విధానం ధృవీకరించినా గానీ బూర్జువా మహిళా ఉద్యమం పై కార్యకలాపాలను కొనసాగించింది. బూర్జువా మహిళా ఉద్యమం యొక్క విప్లవ ప్రతీఘాతుక కార్యకలాపాలకు ఏకైక మినహాయింపు – 'ఇంటర్నేషనల్ వుమెన్స్ లీగ్ ఫర్ ఫ్రీడమ్ అండ్ పీస్' (స్వేచ్ఛా శాంతులకై అంతర్జాతీయ మహిళా సమితి). విప్లవకరమైన పోరాడుతున్న కార్మికవర్గం, ఆ కార్మికవర్గ నియంతృత్వం, బూర్జువా సామాజిక వ్యవస్థను పడగొట్టబోతోందని విని ఈ సంస్థ అగ్రనాయకులు వణికిపోలేదు. వారు ఈ విధంగా స్పందించడానికి కారణం నిజాయితీతో కూడిన వారి సాత్విక వాదం, శాంతికై గాఢమైన ప్రేమ, రష్యన్ విప్లవంలో స్త్రీ విముక్తి సాధించిన విజయాలను చిత్తశుద్ధితో ఆమోదించడం. అయితే, బూర్జువా మహిళా ఉద్యమంలో ఈ లీగ్ అతి చిన్న భాగం మాత్రమే.

సంఘటితమైన ఫెమినిజానికి చెందిన విప్లవ ప్రతీఘాతుక దళం కేవలం బూర్జువా స్త్రీలను సమీకరించడం పైనే ఆధారపడలేదు. అనేక మంది శ్రామిక స్త్రీలను మోసపుచ్చి శక్తిహీనులను చేసే తన ప్రభావంపై అది ఆధారపడింది. బూర్జువా సమాజాన్ని సంస్కరించడం కోసం ఈ మహిళల ఆకాంక్షలు, కార్యకలాపాలు స్త్రీ పురుషుల మధ్య జరిగే పోరాటంపై కేంద్రీకరించాయే తప్ప విప్లవం లక్ష్యంగా వర్గ సంఘర్షణపై కేంద్రీకరించలేదు. బూర్జువా మహిళా ఉద్యమం ఈ ప్రజారాసుల్ని విప్లవ ప్రతీఘాతుక దళాలుగా దిగజార్చివేసింది. అది దాని చర్యల ద్వారా సంస్కరణవాదాన్ని బలంగా నొక్కి చెప్పే సోషల్ డెమోక్రటిక్ మహిళోద్యమాన్ని కూడా తన వెంట తీసుకుపోయింది. ఈ పరిణామాలలోని ప్రాముఖ్యతను తక్కువగా అంచనా వేయరాదు. పెట్టుబడిదారీ విధానం విస్తరణతో బూర్జువా మహిళా విముక్తి ఉద్యమం ప్రపంచ వ్యాప్తంగా వ్యాపించింది. ప్రాచ్యదేశాలలో కూడా అనేకమంది మహిళలను ప్రభావితం చేసింది. పీడిత వర్గాలు, దోపిడీ చేయబడుతున్న వర్గాల ప్రజలు సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా తిరగబడిన ప్రతిచోటా అది కార్మిక స్త్రీలకు మోసపూరితమైన భ్రమలను కల్పించి వారు తమ సహోదరుల విప్లవ పోరాటంలో పాలుపంచుకోకుండా ఆపడం ద్వారా పెట్టుబడిదారీ విధానాన్ని కాపాడింది. అది, దాని వెనుక వేలాది మందిని గుంజుకుపోయింది. అందులో, పెట్టుబడిపట్ల లొంగుబాటునూ, పవిత్రమైన విశ్వాసాన్ని ప్రబోధించిన విద్యా సంస్థలు కూడా వున్నాయి. సంస్థలు, కార్మిక సంఘాలు, వృత్తిపరమైన సంఘాల వల్ల స్వల్ప ప్రయోజనాలు కలిగాయి. సంక్షేమ సంస్థలు బూర్జువా వ్యతిరేక భావాలకూ కార్యకలాపాలకూ సంకెళ్లుగా తయారై ఆ భావాలు స్వేచ్ఛగా వ్యాప్తి చెందటాన్ని అడ్డుకున్నాయి. దానికి, స్వయంగా రూపొందించుకున్న ప్రచార ఆందోళన యంత్రాంగం, దాని చేతి కింద వేలాది మందితో కూడిన క్రియాశీలక శక్తులూ వున్నాయి. ప్రభుత్వ, ప్రయివేట్ నిధుల ద్వారా దానికి మంచి భౌతిక సౌకర్యాలు సమకూరాయి. ఇటలీ, పోలండ్, జర్మనీ, అమెరికా తదితర దేశాల్లోని ఫాసిస్టు మహిళా సంఘాలనేవి బూర్జువా ఉద్యమం యొక్క విప్లవ ప్రతీఘాతుక స్వభావానికి చెందిన ప్రామాణికమైన వ్యక్తీకరణలు. ఒక్కమాటలో చెప్పాలంటే, బూర్జువా మహిళా ఉద్యమం ప్రతీఘాతుక విప్లవానికి దోహదపడే ప్రమాదకరమైన శక్తి. దానితో ఏ విధమైన రాజీగానీ సంబంధం గానీ వుండరాదు. దాన్ని ఓడించడం ద్వారా ప్రపంచ కార్మికవర్గ విప్లవానికి విజయాన్ని చేకూర్చాలి. చరిత్రలోని భౌతిక శక్తులు స్వీయమానసిక శక్తులు ఆ విజయాన్ని గ్యారంటీ చేస్తున్నాయి.

## సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం

సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం, దాని చరిత్రలోని ఉన్నత దశలో, బూర్జువా మహిళా ఉద్యమానికి వ్యతిరేకంగా కార్మికవర్గ పోరాటంగా సాగింది. బూర్జువా మహిళా ఉద్యమం ప్రకటించుకున్న లక్ష్యాన్ని సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం సిద్ధాంతంలో, ఆచరణలో సాధించింది. అంటే, స్త్రీ జనావళి సంపూర్ణమైన సామాజిక పరమైన విముక్తికీ, సమానత్వానికీ అది అగ్రగామిగా నిలిచింది. చారిత్రక భౌతికవాదం వెలుగులో అది మహిళా సమస్యను సాధారణ సామాజిక సమస్యల్లో అత్యావసరమైన భాగంగా పరిగణించింది. బూర్జువా సమాజంలో పీడితులు, పీడకులకు మధ్య సాగే వర్గ వైరుధ్యం, వర్గ పోరాటం మహిళల సంపూర్ణ విముక్తికి నిర్ణయాత్మకమని అది విస్పష్టంగా గ్రహించింది. బూర్జువా సమాజాన్ని విప్లవాత్మకంగా కూలదోయడం ద్వారా, విముక్తి కోసం సాగే పోరాటంలో కార్మికవర్గం సోషలిజాన్ని సాధిస్తుంది. తద్వారా మాత్రమే స్త్రీ జనావళి అంతవరకు వున్న లాంఛనప్రాయ శాసన సంబంధింత స్త్రీ పురుష సమానత్వ పరిధిని దాటి సంపూర్ణంగా వికసించగలదు. అప్పుడే తమంత తాముగా

నిలదొక్కుకునే మానవులుగా తమ హక్కులు సాధించుకుంటూ అభివృద్ధి చెందగలరనే అవగాహన సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమానికి వుంది. ఆ అవగాహనే దాని కార్యాచరణకు మార్గదర్శకమయింది.

సమాజాన్ని సంస్కరించడం కోసం సమాజంలోని అన్ని వర్గాల, అంతస్తుల మహిళలు పురుష జాతికి వ్యతిరేకంగా ఉమ్మడిగా పోరాడాలని ఆ విధంగా పురుషుల ప్రత్యేక హక్కులను నిర్మూలించాలనీ బూర్జువా ఫెమినిజం చెప్తుంది. కానీ కార్మికవర్గ మహిళా ఉద్యమం తద్విరుద్ధంగా, మొట్ట మొదటగా కార్మికవర్గ మహిళలను కూడగట్టి, వారిని సంఘటితపరచి, తమ వర్గ సహోదరులతో భుజం భుజం కలిపి పోరాటం నేర్పింది. ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత యాజమాన్యాన్ని నిర్మూలించి బూర్జువా విధానాన్ని కూలదోయడం కోసం సమాజంలోని అన్ని అంతస్తులకు చెందిన పీడిత మహిళలను, అణచివేయబడిన మహిళలను కార్మికవర్గంతో కలిసి వర్గపోరాటాన్ని సాగించవలసిందిగా అది పిలుపునిచ్చింది.

కానీ సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం మాటల్లోనూ చేతల్లోనూ కార్మికవర్గ మహిళా ఉద్యమంగా వుండే ఘనతను కోల్పోయింది. దాని లక్ష్యాన్ని, కార్యకలాపాల సారాంశాన్నీ చూస్తే, అది కేవలం సంస్కరణోద్యమం మాత్రమే అని చెప్పవచ్చు. అది బూర్జువా ఓటు హక్కు కోసం, బూర్జువా ప్రజాస్వామ్యం కోసం సాగిన ఒక ప్రత్యేక తరహా ఉద్యమం మాత్రమే. అది రెండవ ఇంటర్నేషనల్ నించి స్ఫూర్తిని పొందింది. 1914లో సామ్రాజ్యవాద యుద్ధం బద్దలయినపుడు, కార్మివకర్గ ప్రయోజనాలకు సోషల్ డెమోక్రసీ ద్రోహం తలపెట్టినపుడు, అది రెండవ ఇంటర్నేషనల్‌తోపాటు క్రమ క్రమంగా దిగజారిపోయింది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానం ద్వారా కుటుంబంలో మహిళల పాత గృహోత్పత్తి కార్యకలాపాలు నాశనం కావడంలోనే కార్మికవర్గ, బూర్జువా మహిళా విముక్తి ఉద్యమాలు రెండూ తలెత్తటానికి అవసరమైన బీజాలు పడ్డాయి. ఇది రెండింటికీ వర్తించేదే. కానీ ఆ తర్వాత బూర్జువా సమాజంలో మహిళల మధ్యవున్న వర్గ వైరుధ్యం ముందుకు వచ్చింది. శ్రామికవర్గ మహిళలకు స్వంత ఆస్తి లేదనే వాస్తవం వల్లనే కార్మికవర్గ మహిళలకు తమ అస్తిత్వం నిలుపుకోవడం కోసం, తమ కుటుంబం అస్తిత్వాన్ని నిలపడం కోసం ఉత్పత్తిదాయకమైన, వేతన కూలీని సంపాదించి పెట్టేపని అవసరమయింది. ఆధునిక ఉత్పత్తి సాధనాలు, ఉత్పత్తి పరిస్థితులు ఏర్పడటం వల్ల, పారిశ్రామికీకరణతోపాటు జరిగిన ఆర్థిక విప్లవం సమాజంలో అలాంటి పనికి అవసరమైన నూతన అవకాశాలనూ, విస్తృతమైన కార్యరంగాలనూ సృష్టించింది. అదనపు విలువకోసం, లాభం కోసం పడే వాంఛ పెట్టుబడిదారీ విధానానికి గుండెకాయ వంటిది. దాని మూలంగానూ, దిక్కులేని పరిస్థితి కల్పిస్తున్న వత్తిడివల్లనూ కార్మికవర్గ స్త్రీ జనావళి ఫ్యాక్టరీల్లోకి నెట్టబడింది. ఐచ్ఛికంగా ముందుకు వస్తూ, చౌకగా దొరికే మహిళా శ్రామికులు వేతనాల వత్తిడి వల్ల మరింత చౌకగా లభించసాగారు. అది కేవలం పెట్టుబడిదారీ విధానపు విస్తరణకు సంబంధించిన వ్యక్తీకరణ, ఫలితం మాత్రమే కాదు. అది పెట్టుబడిదారీ విధానం వికసించడానికి ఒక ముందు షరతు కూడా అయింది.

సమాజంలో వేతన పని విధానం వల్ల కార్మికవర్గ మహిళ పురుషుడిపై ఆర్థికంగా ఆధారపడటం నించి స్వేచ్ఛ పొందింది. పైగా, సంపాదించే కుటుంబ సభ్యురాలిగా ఆమె అతనితో సమానత్వాన్ని సాధించింది. అయితే, మహిళగా ఆమె అనుభవించే లైంగిక బానిసత్వం వల్ల ఆమె అప్పుడు కూడా చట్టపరంగా, శాసనపరంగా అతనికి కట్టివేయబడే వుంది. అంతేకాక, ఆమె పొందిన ఆర్థిక స్వాతంత్ర్యానికి కార్మికవర్గ బానిసత్వం వల్ల కలిగే క్రూరమైన పరిణామాల రూపంలో ఆమె చాలా పెద్దమూల్యం చెల్లించవలసి వచ్చింది. ఈ దుర్గతి ఆమె ఒక్కదానికే ఏర్పడలేదు. కార్మికవర్గ పురుషుడు కూడా వేతనాల తగ్గింపునూ, ఫ్యాక్టరీ నించి తొలగించడాన్నీ ఎదుర్కోవలసి వచ్చింది. బాగోగులు చూసే వారులేక, సరైన ఆహారం లేక, కార్మికవర్గ పిల్లలు క్షీణించిపోతూ, మరణాన్ని చవిచూడవలసి వచ్చింది. యావత్తు కార్మికవర్గం ఆనాటికానాటికీ కటిక దారిద్ర్యంలోకి నెట్టబడింది. శాస్త్రీయ సోషలిజం బోధనల విజ్ఞానాన్ని పొందని కార్మికులు ఈ పరిస్థితులు తలెత్తడానికి గల కారణాలను సవ్యంగా గ్రహించనందున గందరగోళానికి గురయ్యారు. వారు పెట్టుబడిదారీ విధానపు దోపిడీ అణచివేతలను ఎదుర్కొంటున్న మహిళలు చేస్తున్న పనే తమ తీవ్రస్థాయి దుస్థితికి కారణం అని నమ్మారు. వారు పరిశ్రమల్లో నియమించబడిన మహిళా కార్మికులకు వ్యతిరేకంగా పోరాడి, వారి నియామకాన్ని చట్టపరంగా నిషేధించాలనీ డిమాండ్ చేశారు. ఆ డిమాండ్‌ని ఆమోదించి వుంటే మహిళలు మళ్లీ తర తరాలుగా పురుషులపై ఆధారపడిన స్థితికే దిగజారేవారు. ఆ

డిమాండ్‌పై కార్మికవర్గ స్త్రీ పురుషుల మధ్య కూడా ఘర్షణ సాగింది. లైంగిక బానిసత్వం, వర్గ బానిసత్వం అతి సన్నిహితంగా అల్లుకుపోయి, కార్మికవర్గ మహిళలకు దుర్భరమైన మనుగడను రూపొందించాయి.

ఊహాజనిత సోషలిస్టులైన ఓవెన్, సెయింట్ సైమన్, ఫోరియర్ల, వారి అనుచరుల భావాలు ఈ చిమ్మ చీకటిలో ఆశ అనే చిరుదీపాన్ని వెలిగించాయి. తామూ మానవులమేననే అవగాహనతో చైతన్యవంతులై, స్వేచ్ఛ కోసం తపించిన కార్మికవర్గ మహిళలు సమాజంలోని అన్ని రుగ్మతలనించి విముక్తి పొందడంకోసం – సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాలపై ఆధారపడిన ఆదర్శవంతమైన నూతన సామాజిక వ్యవస్థ కోసం ఎదురుచూశారు. వారు క్రమంగా బూర్జువా మహిళలతో కూడా సమైక్యమయ్యారు. మహిళలను శ్రామికులుగా నియమించడంపై వున్న నిషేధానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. మహిళా శ్రామికుల పని పరిస్థితులను జీవన పరిస్థితులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. వారు తమతో ఏకీభవించే స్త్రీ పురుషులతో సమైక్యమై, భావి సూచకమైన దృశ్యంపై ఆధారపడిన ఊహాజనిత సమాజ నిర్మాణాన్ని ప్రచారం చేస్తూ, అటువంటి సమాజ నిర్మాణం కోసం సమిష్టిగా పాటుపడ్డారు. అయితే మహిళలనూ మానవాళినీ విముక్తం చేసే నూతన సమాజానికి అవసరమైన భౌతికపరమైన ముందు షరతులను పెట్టుబడిదారీ విధానమే కల్పిస్తుందనే అవగాహనకు మాత్రం వారు అప్పటికీ దూరంగానే ఉన్నారు. కార్మికవర్గ స్త్రీ పురుషులు ఉమ్మడిగా సాగించే విప్లవాత్మకమైన వర్గపోరాటం ద్వారా మాత్రమే అలాంటి సమాజం ఏర్పడుతుంది.

కాబట్టి, కార్మికవర్గ మహిళల విముక్తి కోసం జరిగిన తొలి ప్రయత్నాలు మౌలికమైన, స్పష్టమైన సోషలిస్టు, సోషల్ డెమొక్రాటిక్ స్వభావం కలిగిన ప్రయత్నాల కంటే తక్కువేమీ కాదు. అవి ఫెమినిస్టు, ఊహాజనిత, సోషల్ రివల్యూషనరీ, సోషల్ సంస్కరణవాద ధోరణుల, డిమాండ్ల సమ్మేళనానికీ, కలగలపులకూ ప్రాతినిధ్యం వహించాయి. జాతీయంగా, అంతకంటే అంతర్జాతీయ రంగంలోనూ, వాటికి దృఢమైన నిర్మాణరూపం లోపించింది. ఇంగ్లండ్‌లో, ఫ్రాన్సులో, జర్మనీలో, అమెరికాలో, ఇతరచోట్ల ఒకోసారి ఆర్థిక నినాదాలు, మరొకప్పుడు రాజకీయ నినాదాలు చోటు చేసుకున్నాయి. ఈ నినాదాల స్వభావాన్ని సాధారణంగా నిర్ణయించే అంశాలు ఇవి – పెట్టుబడిదారీ విధానం క్రమంగా అభివృద్ధి చెందడం, ప్రత్యేక చారిత్రక పరిస్థితుల్లో వివిధ దేశాల్లో బూర్జువాజీకీ కార్మిక వర్గానికీ మధ్యవుండే వర్గ వైరుధ్యంపై పెట్టుబడిదారీ విధానపు ప్రభావం; బూర్జువా ప్రజాస్వామ్యపు క్షీణతపై దాని ప్రభావం; విజ్ఞానం, నిర్మాణం, పోరాట శక్తిని పుణికి పుచ్చుకునే వైపుగా అభివృద్ధి చెందే విప్లవ వర్గంగా కార్మికవర్గం పురోగమించడంపై దాని ప్రభావం. ఈ చారిత్రక అభివృద్ధి క్రమంలో, అప్పటికి స్వేచ్ఛా సమానత్వాలను కోరుతున్న కార్మికవర్గ స్త్రీల వర్గపోరాట అవసరాలను తీర్చడంలో సఫ్రగెట్‌ల డిమాండ్లు వెనకబడ్డాయి. మహిళలకు పురుషులతో సమానమైన హక్కులు, సమానమైన ప్రతిభ వుండటంవల్ల, విముక్తి కోసం తమ వర్గం సాగిస్తున్న పోరాటంలో తాము చైతన్యయుతంగా ఎంతో దీక్షతో పాల్గొంటే తప్ప తమ వర్గం విజయాన్ని సాధించలేదనే అవగాహనకు రావడం కోసం కార్మికవర్గ స్త్రీలు ఎంతో ఘర్షణ పడవలసి వచ్చింది.

యావత్తు స్త్రీ జనావళి సంపూర్ణంగా విముక్తి చెందడంకోసం సాగిస్తున్న పోరాటంలో కార్మికవర్గానికి మొదటి ఇంటర్నేషనల్ మార్గదర్శకంగా, ఆదర్శంగా నిలిచినది. 1866లో జరిగిన జెనీవా కాంగ్రెస్, పరిశ్రమల్లో శ్రామిక మహిళల నియామకాన్ని చట్టపరంగా నిషేధించే ప్రయత్నాలను తిప్పికొట్టింది. నిషేధం విధించాలనే డిమాండ్‌ని అటు మితవాదులైన ఇంగ్లీషు గిల్డు యూనియనిస్టులు; ఇటు అతివాదులైన అనార్కిస్టులు ప్రౌధనిస్టులు తదితరులు ముందుకు తెచ్చారు. గతితార్కిక భౌతికవాదంపై ఆధారపడి మార్క్స్ పరిశ్రమల్లో శ్రామిక మహిళలను నియమించడంలోని బహుముఖ విస్తృత విప్లవ ప్రాముఖ్యతను వివరిస్తూ జరిపిన విశ్లేషణ వల్లనే ఈ డిమాండ్ నిరాకరించబడింది. కార్మికవర్గ పరిస్థితిని మరింత దిగజార్చివేసే పెట్టుబడిదారీ సమాజం వల్ల కలిగే అభివృద్ధి నిరోధక ఫలితాలకూ, దోపిడికీ, అణచివేతకూ వ్యతిరేకంగా సంపూర్ణమైన చట్టపరమైన రక్షణను కల్పించాలంటూ మొదటి ఇంటర్నేషనల్ డిమాండ్ చేసింది. కార్మిక సంఘాల గురించిన తీర్మానం వలెనే ఇది కూడా పెట్టుబడిదారీ విధానాన్ని కూలదోయడం కోసం కార్మికవర్గ స్త్రీ పురుషులు సమిష్టిగా సాగించవలసిన వర్గపోరాట అవసరాన్ని ఎత్తి చూపింది. మొదటి ఇంటర్నేషనల్ జనరల్ కౌన్సిల్‌కు ఒక మహిళా సభ్యురాలు ఎన్నికయింది. శ్రామిక మహిళల ట్రేడ్ యూనియన్లు మొదటి ఇంటర్నేషనల్‌కు అనుబంధితమయ్యాయి. ఉదాహరణకు, ఇంగ్లండులో బూట్ల తయారీకారుల యూనియన్, లయాన్స్‌లో పట్టు నేతకారుల

యూనియన్, పట్టు నేతకారులు చేసిన సమ్మెకు ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ ఎంతో శక్తివంతంగా మద్దతునిచ్చింది. దాని విజయానికి గమనించదగిన రీతిలో దోహదపడింది. పోరాడుతున్న కార్మికవర్గానికి చెందిన ఈ ప్రపంచ సంస్థ భావాలు కార్మిక వర్గానికీ, పెటీ బూర్జువాజీకీ చెందిన మహిళలను ప్రేరేపించి, వారికి మార్గదర్శకత్వం వహించాయి. పారిస్ కమ్యూన్‌ని సంరక్షించిన వీరవనితలు, అమరులు వారి సమానత్వపు హక్కును, వారి సమాన అభ్యర్థనను పొందుపరిచారు. కార్మికవర్గం అధికారాన్ని హస్తగతం చేసుకున్న ఈ గొప్ప సంఘటన అంతర్జాతీయంగా ఎంతగానో ఉత్సాహాన్ని అందించింది. ఈ పారిస్ కమ్యూన్ సంఘటనకు ముందే జర్మనీలో సోషలిజం బ్యానర్ కింద కార్మికవర్గ స్త్రీ పురుషులు మొట్ట మొదటిసారి సమిష్టిగా సంఘటితంగా ప్రదర్శన జరిపారు. క్రిమ్మిట్స్ చావ్ (శాక్సనీ)లోని తయారీ పరిశ్రమ కార్మికుల, బట్టల మిల్లు కార్మికుల, కూలీనాలి చేసుకునే కార్మికుల వ్యాపార సహకార సంఘాలు ఏర్పడ్డాయి. ఇది బట్టల మిల్లు కార్మికుల సంఘం ఏర్పాటుకు దారి తీసింది. అదే కార్మికసంఘం అటు తర్వాత ఇంటర్నేషల్ వర్కింగ్ మెన్స్ అసోసియేషన్ సూత్రాలను ఆమోదించింది.

ఒక సంస్థగా మొదటి ఇంటర్నేషనల్ విచ్ఛిన్నమైపోయినా గానీ, దాని సుసంపన్నమైన చారిత్రాత్మకమైన అవగాహన, మహిళా సమస్యపట్ల దాని విప్లవాత్మకమైన వైఖరి కార్మికవర్గంలో సదా నిలిచిపోయాయి. ఆ విధంగా ఆనాటికానాటికీ అధికాధికంగా స్త్రీ పురుషులు దాని అనుచరులయ్యారు. 1889లో పారిస్‌లో ఏర్పడిన రెండవ ఇంటర్నేషనల్ తొలి కాంగ్రెస్‌లో ఇది రుజువయింది. జర్మన్ ప్రతినిధివర్గం తరపున హాజరయిన జర్మన్ శ్రామిక మహిళా సంఘాల ఇద్దరు మహిళా ప్రతినిధుల్లో ఒకరు మహిళలను శ్రామికుల నియామకంపై నిషేధాన్ని విమర్శించారు; సఫ్రేజ్ ఉద్యమాన్ని తిరస్కరించారు; కార్మికవర్గ స్త్రీలు పోరాడుతున్న కార్మికవర్గ శ్రేణులతో మమేకం కావాలని డిమాండ్ చేశారు. (ఆ డిమాండ్ ప్రవేశపెట్టిన ప్రతినిధి క్లారాజెట్కిన్. ఆమె అక్కడ 'మహిళల విముక్తి కోసం' అనే పత్రాన్ని చదివి వినిపించింది – అను). ఎంతో ఉత్సాహంగా, హర్షామోదాలు వ్యక్తం చేయటం ద్వారా కాంగ్రెస్ ఈ అభిప్రాయాలపట్ల తన సంఘీభావాన్ని తెలియజేసింది. కానీ తన సభ్య సంఘాలూ, పార్టీలూ కట్టుబడే విధంగా అది ఈ సమస్యలపై నిర్ణయాలు మాత్రం చేయలేదు. అది రెండవ ఇంటర్నేషనల్‌కి సహజసిద్ధమైన లక్షణం. అది చొరవ చూపడంలో, నాయకత్వం వహించటంలో వెనకబడటానికి ఆ వైఖరే కారణమయింది. కార్మికవర్గ స్త్రీలు విముక్తి కోసం చేస్తున్న పోరాటాన్ని సైద్ధాంతికంగానూ, నిర్మాణపరంగానూ కార్మికవర్గం నిర్వహిస్తున్న వర్గపోరాటంతో సమైక్యం చేయవలసిన బాధ్యతను అది తప్పించుకుంది. అది ఆ కర్తవ్యాన్ని నిర్వహించి వుంటే సామాజిక విప్లవానికి అది స్పష్టమైన మద్దతుదారుగానూ చోదక శక్తిగానూ వ్యవహరించగలిగి వుండేది. కానీ సోషలిజం మీద నమ్మకం వున్న మహిళలే ఆ ముఖ్యమైన కర్తవ్యాన్ని నిర్వహించవలసి వచ్చింది.

సమగ్రమైన సిద్ధాంత పరిజ్ఞానం కలిగి వుండి, దృఢదీక్ష, అంకిత భావం గల అలాంటి మహిళలే అన్ని పెట్టుబడిదారీ దేశాల్లోనూ ఫెమినిస్టు భావాలవల్ల, సామాజిక సంస్కరణవాద భావాలవల్ల, సోషలిస్టు భావాలవల్ల కలిగిన గందరగోళాన్ని తొలగించసాగారు; అనేక నిర్మాణ రూపాలుగా విడిపోవడాన్ని అధిగమించసాగారు; అనేక మార్పులకు గురవుతున్న కార్మికవర్గ మహిళా ఉద్యమాన్ని ఆచరణాత్మకంగా బలమైన ఉద్యమంగా, ప్రత్యేకించి సోషలిస్టు మహిళా ఉద్యమంగా రూపొందించసాగారు. ఫెమినిజానికీ బూర్జువా సంస్కరణవాదాలకూ తనకూ మధ్య స్పష్టమైన సైద్ధాంతికమైన, ఆచరణాత్మకమైన విభజన రేఖను గీసుకుంటూ సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం, విముక్తికోసం సాగుతున్న కార్మికవర్గ విప్లవాత్మక పోరాటంలో తన ఘనతను నిరూపించుకుంది. విస్తృతమైన మహిళా సమస్యకు సంబంధించిన సకల అంశాలపై అవసరమైన చర్చ ఆరంభమయింది. సోషలిజానికి బాటలు వేసే కార్మికవర్గ విప్లవం ద్వారా, కార్మికవర్గ నియంతృత్వం మాత్రమే పరిష్కరించగల సామాజిక సమస్యగా మహిళా సమస్యను అర్థం చేసుకోసాగారు. జర్మనీకి చెందిన సోషల్ డెమోక్రటిక్ మహిళలు ఆవిధంగా ఆదర్శప్రాయమైన మార్గ నిర్దేశకులయినారు.

మహిళా కార్మికులను చట్టపరంగా పరిరక్షించడం కోసం అనుసరించవలసిన మౌలికమైన, ఆచరణాత్మకమైన వైఖరిపై వారు ముందుగా కేంద్రీకరించారు. మార్క్సిస్టు అభిప్రాయాలకు అనుగుణంగా, 1893లో జ్యూరిచ్‌లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ అప్పటికి వ్యాప్తిలో వున్న ప్రస్ఫుటమైన ఫెమినిస్టు ధోరణులను వ్యతిరేకించే వైఖరిని అవలంభించింది. మహిళల ఓటు హక్కుపై మౌలికమైన, వ్యూహాత్మక వైఖరిని చేపట్టేందుకు జరిగిన

పోరాటం మరింత మౌలికమైనదిగానూ, బహుముఖ విస్తృత ప్రభావాన్ని నెరిపేదిగానూ నిలిచింది. 'ఉన్నత వర్గాల స్త్రీల ఓటు హక్కు' అమలును అనుమతించాలా? కార్మికవర్గ పోరాటాల్లో సార్వత్రిక మహిళల ఓటుహక్కు డిమాండ్‌ని త్యజించాలా? మహిళల రాజకీయ ఓటుహక్కును, స్త్రీ జాతిపొందే సంపూర్ణమైన సామాజిక విముక్తితో సమానంగా పరిగణించే సఫ్రగెట్స్ అభిప్రాయం ఆమోదయోగ్యమైనదేనా? మొదలైన సమస్యలపై సృష్టీకరణే సంస్కరణ వాదానికీ, అవకాశవాదానికీ వ్యతిరేకంగా ఉద్వేగభరితమైన, విస్తృతమైన పోరాటానికి దారితీసింది. సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమంలోని అత్యంత అభివృద్ధి కాముకులైన ప్రతినిధుల చొరవ, పట్టుదలల వల్ల 1907లో స్టట్‌గార్డ్‌లో జరిగిన రెండవ ఇంటర్నేషనల్ కాంగ్రెస్‌లో విప్లవాత్మకమైన మార్క్సిజం విజయం సాధించింది. అవకాశవాదానికీ, రివిజనిజానికీ వ్యతిరేకంగా సాగిన పోరాటంలో రెండవ ఇంటర్నేషనల్‌కు చెందిన సోషలిస్టు పార్టీల 'వామపక్ష' విభాగం యొక్క ఒక విలువైన శక్తిగా సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం రూపొందింది.

స్త్రీ పురుష విభేదం లేకుండా పీడితులందరికీ సమైక్య నిర్మాణం వుండాలనే విశ్వాసానికి అనుగుణంగా శ్రామిక మహిళలను తమ తమ వృత్తి కార్మిక సంఘాల కామ్రేడ్స్ వైపు, ఆయా దేశాల్లో అన్ని తరగతుల కార్మికవర్గ స్త్రీలను తమ తమ సోషలిస్టు పార్టీలవైపు నడిపించింది. ఆ విధంగా, రెండవ ఇంటర్నేషనల్ పరిధిలోనే, దానితో సన్నిహిత సంబంధం ద్వారానే అంతర్జాతీయ సమైక్యతను సాధించే సమస్యను సోషల్ డెమోక్రటిక్ మహిళా వుద్యమం పరిష్కరించుకుంది. 1907లో సోషలిస్టు మహిళల తొలి అంతర్జాతీయ మహాసభలో జర్మన్ సోషల్ డెమోక్రసీ మహిళా పత్రిక 'డైగ్లెషిట్'ను అంతర్జాతీయ అధికారిక పత్రికగా గుర్తించి, దానికి ఒక అంతర్జాతీయ సెక్రటరీని కూడా నియమించారు. (క్లారాజెట్కిన్ అలా సెక్రటరీగా 1917 వరకు కొనసాగింది – అను) 1910లో కోపెన్‌హేగెన్‌లో జరిగిన సోషలిస్టు మహిళల రెండవ అంతర్జాతీయ మహాసభలో సమైక్య అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా మార్చి 8ని నిర్ణయించారు. కార్మికవర్గ స్త్రీల తక్షణ డిమాండ్ల విషయానికి వస్తే, ఉదాహరణకు మహిళల ఓటుహక్కు తీసుకుంటే, బూర్జువా సమాజానికి వ్యతిరేకంగా కార్మికవర్గ స్త్రీ పురుషులు సాగిస్తున్న విప్లవాత్మకమైన పురోగమనంలో అది కూడా భాగం కావాలన్నదే వారి అవగాహన.

ఆశాజనకమైనదిగా కనిపిస్తున్న సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమంలోకి కూడా సంస్కరణవాదం అనే తొలిచివేసే శక్తి చొచ్చుకుపోయిందని సామ్రాజ్యవాద ఊచకోత సందర్భంగా జరిగిన పరిణామాలు స్పష్టీకరించాయి. అయితే, అది జీవితంలో మరొక శక్తివంతమైన, విప్లవాత్మకమైన వ్యక్తీకరణను తీసుకువచ్చింది. అదే 1915లో బర్న్‌లో జరిగిన సోషలిస్టు మహిళల అంతర్జాతీయ మహాసభ. సోషల్ డెమోక్రటిక్ పార్టీలు, సంఘాలలోని అత్యధిక భాగం కార్మికవర్గ అంతర్జాతీయ సంఘీభావ బాంధవ్యానికి ద్రోహం తల పెట్టినందువల్ల, ఆ ద్రోహానికి వ్యతిరేకంగా కార్మికవర్గ మహిళలు పోరాడాలంటూ ఈ మహాసభ పిలుపునిచ్చింది. బూర్జువా సమాజంలో ఒక్కసారిగా గొప్ప మార్పు తీసుకువచ్చే విధంగా కార్మికవర్గ జనావళి ఉధృతమైన విప్లవాత్మకమైన దాడులు నిర్వహించడం కోసం అవసరమైన షరతుగా అది ప్రజలమధ్య శాంతిని నెలకొల్పేందుకు పోరాడవలసిందిగా పిలుపునిచ్చింది. ఉద్యమంలోని మైనారిటీ విభాగం ఈ మహాసభను నిర్వహించింది. అది తప్పనిసరిగా సంభవించనున్న చీలికకు ఒక సూచిక అయింది. మరోపక్క రెండవ ఇంటర్నేషనల్ నాయకత్వాన, సంఘటితమైన సోషల్ డెమోక్రటిక్ మహిళలోని అత్యధికులు సామ్రాజ్యవాద బూర్జువాజీల జాతీయ 'మాతృ భూముల' పరిరక్షకుల స్థాయికి దిగజారారు. జాతీయ దురహంకార భావాలలో, కార్యకలాపాలల్లో వారు బూర్జువా మహిళలతో పోటీపడ్డారు. అధికారం కోసం సాగుతున్న సామ్రాజ్యవాద పోరాటం యొక్కస్వభావం గురించి, లక్ష్యం గురించి వారు కార్మికవర్గ స్త్రీలను మభ్యపెట్టి మోసపుచ్చారు. అలా వారిని పరిశ్రమల్లోకి, ఇతర సామాజిక జీవన రంగాల్లోకి నెట్టారు. జారిస్టు రష్యాలో కార్మికర్గ విప్లవానికి సంబంధించిన, వెల్లువలా సాగుతున్న హింసాయుతమైన ఉధృతమైన సంఘటనల నేపథ్యంలో కూడా వారు ఏ విషయమూ నేర్చుకోలేదు. విప్లవ ప్రజానీకం సాగిస్తున్న దాడులకు వ్యతిరేకంగా బూర్జువాజీ తమ వర్గాధిపత్యాన్ని కాపాడుకోవడం కోసం చేసే ప్రయత్నాల్లో బూర్జువాజీ పక్షాన నిలవడాన్ని సోషల్ డెమోక్రటిక్ మహిళలు కొనసాగించారు.

సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం ఏ స్థాయికి దిగజారిందో దాని చరిత్రలోని ఎక్కువ భాగం స్పష్టంగా వెల్లడించింది. అది కేవలం సంస్కరణవాద ఉద్యమంగా దిగజారింది. బూర్జువా సమాజాన్ని కూలదోయడానికి సిద్ధపడకపోగా, అది ఆ సమాజాన్ని బలపరచడానికి

సిద్ధపడింది. కార్మికర్గ స్త్రీల వర్గ బానిసత్వాన్ని పరిరక్షించే, పటిష్టపరిచే పాత్రను అది నిర్వహించింది. సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమంలో సోషలిజం గురించి కొందరు ఇప్పటికీ మాట్లాడినా, కార్మికవర్గ స్త్రీలు తమ వర్గం సాగిస్తున్న విప్లవ పోరాటంలో పాలుపంచుకోకుండా నిరుత్సాహపరచడం ఒక్కటే ఆ వుద్యమం లక్ష్యం అయింది. సోషలిజానికీ, ప్రపంచ కమ్యూనిస్టు సమాజానికి దారితీసే ఏకైక మార్గం అయిన విప్లవం వైపు, రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకోవడం వైపు అది కార్మికవర్గ మహిళలను మళ్లించలేదు. సామాజిక సంస్కరణల ద్వారా, బూర్జువా ప్రజాస్వామ్యం ద్వారా 'సోషలిజాన్ని శాంతియుతంగా సాధించవచ్చు'నే స్వప్నంతో వారు పెట్టుబడిదారీ విధానానికి రెండు విధాలుగా బలి పశువులైన కార్మికర్గ మహిళలను నిద్రపుచ్చాలని చూశారు. సంస్కరణలు, ప్రజాస్వామ్యం రంగాలలో కూడా ఆ 'విజయాలు' వర్గ సామరస్య, వర్గ రాజీవిధాన ఫలితాలేనని, కార్మికర్గం ఉధృతంగా, నిరంతరాయంగా పట్టుదలతో సాగించిన వర్గపోరాట ఫలితాలు కాదనీ అంటూ అది కార్మిక స్త్రీలను మోస పుచ్చింది. కార్మికవర్గ విప్లవం అనే మౌలిక లక్ష్యాన్ని విడనాడటం ద్వారా అది కార్మికవర్గ స్త్రీల వర్తమాన డిమాండ్లకు సైతం ప్రాతినిధ్యం వహించే సామర్థ్యాన్ని కోల్పోయింది.

అతుకులబొంత అయిన రెండవ ఇంటర్నేషనల్ ఉదాత్తమైన నేతృత్వం కింద 1925లో మార్సెయిల్స్‌లోనూ, 1926, 1928లలో బ్రసెల్స్‌లోనూ జరిగిన అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ మహిళల మహాసభల్లో ఈ సోషల్ సంస్కరణవాద ధోరణులన్నీ గోచరించాయి. 1919లో జరిగిన వాషింగ్టన్ కాన్ఫరెన్స్ మహిళా కార్మికులకు చట్టపరమైన రక్షణ సమస్యపై, తల్లీ పిల్లలకు, కష్టాల్లో వున్నవారికి రక్షణ, సామాజిక బాగోగులు చూసే సమస్యపై చేసిన అనంతమైన డిమాండ్లకే ఈ మహాసభలు పరిమితమైనాయి. అయితే, పెద్ద పెద్ద పెట్టుబడిదారీ దేశాల మహనీయమైన మిశ్రమ ప్రభుత్వాలూ, ఇంగ్లండ్‌లోని లేబర్ ప్రభుత్వమూ ఈనాటికీ ఆ డిమాండ్లను ధృవీకరించలేదు. ఈ డిమాండ్లను ఒక మౌలికమైన 'మానవ హక్కు'గా సాధించాలంటూ సోషల్ డెమోక్రటిక్ మహిళలు అతి సాత్వికంగా కోరారు. ప్రభుత్వాధికారం విలువ ఏమిటో ఇంగ్లీషు లేబర్ ప్రభుత్వం వర్క్స్ మినిస్టర్ బాండ్ ఫీల్డ్ తెలియజేసింది. నిరుద్యోగ భత్యం నియంత్రణ కోసం ఇచ్చిన సలహాలు, జారీచేసిన బిల్లుల ద్వారా; గనుల్లో పని పరిస్థితుల ద్వారా; వేలాది కార్మిక స్త్రీలను దోచుకుంటూ బానిసలను చేస్తున్న ఉన్ని పరిశ్రమలో జరిగిన మహత్తరమైన పోరాటం పట్ల తీసుకున్న వైఖరి ద్వారా ఆ ప్రభుత్వానికి వున్న పరిమితులు వ్యక్తమయ్యాయి.

సోషల్ డెమోక్రటిక్ మహిళల అంతర్జాతీయ మహాసభలు మహిళల ఓటు హక్కును పూర్తిగా ఫెమినిస్టు పద్ధతిలో విశ్లేషిస్తూ, మహిళల మానవ హక్కుల్ని సంపూర్ణంగా సాధించడంగా ఆ హక్కును పరిగణిస్తూ అంచనా వేశాయి. అలా పరిగణించడంలో కూడా, ఆ మహాసభల ప్రతినిధులు కేవలం "ఉన్నత వర్గాల స్త్రీల ఓటు హక్కుతో"నే సంతృప్తి చెందారు. బెల్జియంలో క్లరికల్స్ మహిళల ఓటు హక్కును ప్రతిపాదించగా, లిబరల్స్‌తో చేయి కలిపిన బెల్జియంలో సంస్కరణవాద కార్మిక పార్టీ ప్రతినిధి క్యాబినేట్‌లో ఆ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఓటు చేసినాగానీ ఆ పార్టీని అభిశంసించకపోవడంలో ఈ సోషల్ డెమోక్రటిక్ మహిళా ప్రతినిధులు పిరికి వైఖరినే అవలంభించారు. రానున్న సామ్రాజ్యవాద యుద్ధ ప్రమాదంపట్ల సోషల్ డెమోక్రటిక్ మహిళలు అతి సిగ్గుమాలిన వైఖరిని అవలంభించారు. ఫ్రెంచి సామ్రాజ్యవాదులు సాగించిన క్రూరమైన మొరాకో యుద్ధాన్ని వారు మార్సెయిల్స్‌లో ఖండించవలసి వుండగా, దాన్ని దాటవేశారు. ఫ్రాన్సులో సంస్కరణవాద సోషలిస్టులు ఆ యుద్ధాన్ని వ్యతిరేకించకపోవడం వల్ల వీరు కూడా దాన్ని ఖండించలేదు. దానికి బదులుగా వారు 'ఎర్రసామ్రాజ్యవాదం'గా భావించిన సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా ఆందోళన జరిపారు; శాంతిస్థాపన కోరుతున్న కార్మికవర్గ స్త్రీలకు 'మహిళా ఓటు హక్కు' ఆశను చూపించారు. లీగ్ ఆఫ్ నేషన్స్ శాంతి స్థాపన ప్రయత్నాలపట్ల, పెట్టుబడిదారీ ప్రభుత్వాలు నిర్వహించే అంతర్జాతీయ నిరాయుధీకరణ మహాసభలపట్ల, ప్రజలను మోసపుచ్చే వుద్దేశంతో ఆ ప్రభుత్వాలు చేపట్టే విధానాలపట్ల భ్రమలకు నిలయంగా సోషల్ డెమోక్రటిక్ మహిళోద్యమం వుండిపోయింది. అలానే, కార్మికవర్గ నియంతృత్వం అమలులోకి వచ్చిన మొట్టమొదటి రాజ్యానికీ, దాని సోషలిస్టు విధానానికీ వ్యతిరేకంగా కూడా అది అబద్ధాల నిలయంగా, వుండి పోయింది. శాంతి స్థాపన కోసం సోవియట్ దేశం అవలంభించిన గట్టి విధానాలపై; సోవియట్ రాజ్యాంగం ద్వారా మహిళా లోకం విముక్తి సాధించడం దిశగా అది చేపట్టిన ఆదర్శవంతమైన కార్యకలాపాలపై; సమానత్వం సూత్రాన్ని వాస్తవంగా అమలు చేయడం కోసం అది అభివృద్ధి పరచిన ఆర్థిక, సామాజిక

రూపాలపై సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం ఏ భాషలోనూ వ్యాఖ్యానించలేదు. మౌనంగా వుండిపోయింది. పైగా, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వలస, అర్థవలస దేశాల ప్రజలు సాగిస్తున్న విముక్తి పోరాటాలకు మద్దతుగా అది అంతర్జాతీయ సంఘీభావాన్ని తెలియజేసే చర్యలను చేపట్టనేలేదు. కార్మిక మహిళలు, రైతు మహిళలు, పెటీ బూర్జువా మహిళలు, మేధావి వర్గానికి చెందిన మహిళలు ఉత్సాహంగా, ప్రముఖంగా పాల్గొన్న పోరాటాలకు మద్దతుగా కూడా అది అంతర్జాతీయంగా సంఘీభావాన్ని కూడగట్టలేదు. సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం బూర్జువా ఉద్యమంగా మారిపోయింది. విశ్వసనీయమైన అనుచరులను సంపాదించుకోవాలని పోటీపడినందున, అది మాటల్లో మాత్రమే ఫెమినిజంతో విభేదించింది. సారాంశంలో అది దానితో విభేదించలేదు. మహిళా సమస్యపై వచ్చే సమస్యలను విపులీకరించడంలోగానీ, ఆచరణాత్మకమైన పోరాటాలను ఆరంభించడంలోనూ, వాటిని విస్తరించడంలోనూగానీ అది తనతో సంబంధం వున్న రాజకీయ పార్టీలకు, సంఘాలకు ఇక నాయకత్వం వహించలేదు. బడా బూర్జువాజీ సేవలో నిమగ్నమైన సంస్థల చేతిలో అది కీలుబొమ్మ అయింది. మిశ్రమ ప్రభుత్వం అవలంభించే ప్రతి కార్మికవర్గ వ్యతిరేక చర్యనూ సహించడం ద్వారా 'ప్రభుత్వ అభిప్రాయం', 'ప్రజా ఆర్థిక విధానం' పేరుతో 'పారిశ్రామిక శాంతి'తో రాజీపడడం ద్వారా కార్మికవర్గ స్త్రీ వర్గచైతన్యాన్ని దెబ్బతీసింది. ఆ విధంగా అది వారి పోరాట శక్తిని నీరుగార్చింది. అయితే, అంతర్గతంగా ఎంత దిగజారినా, సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం బాహ్యంగా బలంగా, పైపైకి ఎదిగింది. 1928లో జరిగిన సోషలిస్టు ఇంటర్నేషనల్ బ్రసెల్స్ మహాసభ నివేదిక ప్రకారం, దానితో సంబంధం వున్న పార్టీల్లో స్త్రీల సంఖ్య 9,15,000. సంస్కరణవాద సంఘాలు తమ సభ్యత్వ సంఖ్య 6,87,000 అని గర్వంగా చెప్పుకునేవి. ఇప్పటికి ఆ సంఖ్య కూడా దాటిపోయింది.

గతంలోవలె కాక, ఇక సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం 'ప్రజాభిప్రాయ' అభిశంసనకిగానీ, అధికారుల నిషేధాజ్ఞలకు గానీ గురికాలేదు. స్థానిక పరిపాలనా స్థాయిలో రాజ్యాంగ యంత్రాంగంలో దానికి వున్న బలమైన స్థానం ద్వారా, కార్మికవర్గ స్త్రీలలో అది జరిపే సాంఘిక, బీమా, సంక్షేమ కార్యకలాపాల ద్వారా అది ఇప్పుడు ప్రజలనించి, అధికారుల నించి గట్టి మద్దతును పొందింది. మిశ్రమ ప్రభుత్వాలు వున్న దేశాల్లో, ప్రత్యేకించి మహిళల ఓటు హక్కు అమల్లోకి వచ్చిన దేశాల్లో అది వేళ్లూనుకుంది. దాని తరపున అనుభవంగల, తెలివిగల మహిళా ప్రచారకులూ, ఆర్గనైజర్లూ పని చేశారు. కార్మిక స్త్రీలను మోసపుచ్చి, వారి ముక్కుకు తాడువేసి తమ దారిలో లాక్కుపోవడం కోసం వారు తమపై వుంచిన నమ్మకాన్ని దుర్వినియోగపరిచారు. పరిస్థితిపై తమకు వున్న సమగ్రమైన జ్ఞానాన్ని కార్మిక స్త్రీల మానసిక స్థితిపట్ల వున్న జ్ఞానాన్నీ కూడా దుర్వినియోగపరిచారు. వారు తమ విప్లవ వ్యతిరేక పిరికితనాన్నీ, విప్లవం అంటే తమకున్న భయాన్నీ నూరిపోశారు. కార్మిక మహిళలు లాభాపేక్షగల గుత్త పెట్టుబడి పాలన కోరల్లో చిక్కుకున్న సమయంలో వారు ఈ విధంగా ప్రవర్తించారు. వారు కార్మికవర్గ విప్లవ ఆగమనాన్నీ అలాగే రష్యాలో సోషలిజాన్ని నిర్మిస్తూ విప్లవయోధులు పోరాటంలో నిర్వహిస్తున్న అజరామరమైన కృషినీ గుర్తించీ ఇలా ప్రవర్తించారు. మహిళల విముక్తిని సాధించే కార్మికవర్గ విప్లవం పెట్టుబడిదారీ విధానాన్ని ధ్వంసం చేయాలంటే, కార్మికవర్గంలో గల సంస్కరణవాదాన్ని నిర్మూలించాలి.

### కమ్యూనిస్టు మహిళా ఉద్యమం

కమ్యూనిస్టు మహిళా ఉద్యమం స్వల్పకాల చరిత్రనే కలిగివున్నాగానీ అది ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. అది దినదిన ప్రవర్ధమానమవుతూ, మానవాళి చరిత్రలోనే ఎంతో ముఖ్యమైన దశలో తనవంతు పాత్రను నిర్వర్తిస్తోంది. అరుణారుణమైన 1917 అక్టోబర్‌తో ఆరంభమయిన ప్రపంచ కార్మికవర్గ విప్లవ దశలో ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత యాజమాన్యం నిర్మూలించబడి, కమ్యూనిజం ఒక సామాజిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటున్న కారణంగా మానవుల మధ్య వున్న అన్ని ఆర్థిక, సామాజిక అడ్డుగోడలు ఛేదించబడి, నూతన సామాజిక జీవన రూపాలు సృష్టించబడుతున్నాయి. స్త్రీ పురుషులకు మధ్య, నూతనమైన, ఉన్నతమైన సంబంధాలు నెలకొని, తద్వారా యావత్తు స్త్రీ లోకం సంపూర్ణమైన స్వేచ్ఛనూ సమానత్వాన్నీ పొందాలంటే, సమాజంలో ఈ హింసాయుతమైన, మహత్తరమైన మార్పు అనేది ఆవశ్యకమైన ముందు షరతు కాగలదు. కమ్యూనిస్టు మహిళా ఉద్యమం ఈ మహత్తరమైన లక్ష్య సాధనకు చైతన్యవంతంగా అంకితం కానున్నది. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం కింద అణచివేయబడుతున్న, దోపిడీకి గురవుతున్న ప్రజలందరూ ఈ లక్ష్య సాధనకై కృషి చేయాలి. వారు వర్గ చైతన్యం గల కార్మికవర్గ నాయకత్వం కింది పనిచేసే సమరశీల

విప్లవకారులుగా ఎదుగుతారు. బడా పెట్టుబడిదారుల వర్గాధిపత్యం కింద నలిగిపోయి, దోపిడీకి గురైన కార్మికవర్గ స్త్రీ జనసామాన్యాన్ని మేల్కొల్పడం వైపుగా కమ్యూనిస్టు మహిళల కార్యాచరణ వుంటుంది. అంతేకాక, పురుషాధిక్యతకు గురైన అన్ని సామాజిక తరగతులకు చెందిన స్త్రీలను మేల్కొల్పడం కూడా దాని లక్ష్యం అవుతుంది. స్త్రీల విముక్తికై సాగించే కార్యాచరణలో వారు చేదోడువాదోడు కాగలరు. ప్రపంచ విప్లవమే స్వేచ్ఛకు ఏకైక మార్గం అనే అవగాహన రెండు విధాలుగా బానిసత్వానికి గురవుతున్న స్త్రీల ఆకాంక్షలకూ, కార్యకలాపాలకూ మార్గదర్శకం కావాలి.

కమ్యూనిస్టు మహిళా ఉద్యమం ఉన్నతస్థాయి చారిత్రక, సైద్ధాంతిక జ్ఞానంతో, కార్యాచరణతో ముందుకు సాగుతుంది. మార్క్సిజం వెలుగులో సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం మొదట్లో ఇదే కర్తవ్యాన్ని ఉద్దేశపూర్వకంగా చేపట్టిందిగానీ తర్వాత అది ద్రోహం తలపెట్టింది. బూర్జువా సమాజపు సామాజిక వ్యవస్థపట్ల, బూర్జువా ఆర్థిక విధానం, రాజ్యాంగ యంత్రాంగాలపట్ల తమ తమ వైఖరుల్లో ఈ రెండు ఉద్యమాలకు మధ్య పూడ్చడానికి వీలులేనంత విరుద్ధభావం చోటుచేసుకుంది. మహిళల సంపూర్ణమైన విముక్తి బూర్జువా సమాజాన్ని సంస్కరించడం ద్వారా సాధ్యపడుతుందా, లేక సమూలాగ్రమైన విప్లవం ద్వారా సాధ్యపడుతుందా అనే ప్రశ్న ఈ రెండు ఉద్యమాలను మౌలికంగానూ, ఎత్తుగడల రీత్యానూ విభజించింది. బూర్జువాజీకి అనుకూలంగా, విప్లవ వ్యతిరేకంగా మారిన సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం 1914 తర్వాత సంభవించిన సంఘటనలు నేర్పిన స్పష్టమైన, నిర్దిష్టమైన గుణపాఠాలను అర్థం చేసుకో నిరాకరించింది. మరోవైపు కమ్యూనిస్టు మహిళా ఉద్యమం సామ్రాజ్యవాద ప్రపంచ యుద్ధం నుండి రష్యన్ విప్లవం నుండి, తర్వాత జరిగిన చారిత్రక ఘటనల నుండి సిద్ధాంతరీత్యానూ, ఆచరణరీత్యానూ విలువైన నిర్ధారణకు రాగలిగింది. విప్లవాత్మకమైన మార్క్సిజానికి సంబంధించిన చారిత్రక అవగాహనకు కచ్చితంగా కట్టుబడి వుండే వైఖరీ, సామాజిక అభివృద్ధి క్రమంలో ఎదురయ్యే సమస్యలకు, కర్తవ్యాలకు నిరంతరాయమైన శక్తివంతమైన లెనినిస్టు అన్వయింపూ దానికి మార్గదర్శకత్వం అయినాయి.

1919 మార్చ్‌లో మాస్కోలో జరిగిన మూడవ ఇంటర్నేషనల్ తొలి కాంగ్రెస్, సంఘటితమైన కమ్యూనిస్టు మహిళా ఉద్యమానికి నాంది పలికింది. భౌతిక పరిస్థితుల్లోనూ, స్వీయశక్తిలోనూ కార్మికవర్గం విప్లవం దిశగా సమాజాభివృద్ధి చారిత్రకంగా పెంపొంది పరిపక్వమయిన వాస్తవాన్ని మూడవ ఇంటర్నేషనల్‌కూ, కమ్యూనిస్టు మహిళా ఉద్యమానికీ మధ్యగల సంబంధాన్ని ప్రతిబింబించింది. రెండవ ఇంటర్నేషనల్‌వలె మూడవ ఇంటర్నేషనల్ తొలి కాంగ్రెస్ కేవలం మహిళల సమానహక్కు డిమాండ్‌నూ, పోరాడే కార్మికవర్గ శ్రేణులతో కలిసి వారు చేయి చేయి కలిపి పోరాడటాన్నీ ఆమోదించడంతో సంతృప్తి పడలేదు. అప్పట్లో రష్యాతో సంబంధాలు పెట్టుకోవడంలో వున్న తీవ్రమైన ఇబ్బందులవల్ల చాలా మంది విదేశీ మహిళలు ఆ మహాసభలో పాల్గొనలేకపోయారు. రష్యన్ కామ్రేడ్స్ ప్రతిపాదించిన ఒక తీర్మానాన్ని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ తీర్మానం మహిళల సంపూర్ణ సమానత్వాన్ని అంగీకరిస్తూ, వారు విప్లవంలో ఆవశ్యకమైన శక్తి అని కూడా గుర్తించింది. “తన ముందున్న కర్తవ్యాలను నెరవేర్చాలంటే, పెట్టుబడిదారీ విధానాన్ని సంపూర్తిగా నిర్మూలించి, ప్రపంచ కార్మికవర్గ అంతిమ విజయాన్ని సుసాధ్యం చేయాలంటే, కార్మికవర్గానికి చెందిన స్త్రీ పురుషులు భుజం భుజం కలిపి సాగించే ఉమ్మడి పోరాటంవల్ల మాత్రమే సాధ్యమవుతుంది. కార్మికవర్గ స్త్రీలు సర్వసన్నద్ధులై చురుగ్గా పాల్గొన్నప్పుడే కార్మికవర్గ నియంతృత్వం నెలకొల్పబడి కొనసాగించబడుతుంద”నీ కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఆమోదించింది.

కమ్యూనిస్టు మహిళా ఉద్యమం అభివృద్ధి చెందడానికి, విస్తరించడానికి, ప్రభావం చూపడానికేకాక, కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌తో వివిధ దేశాల్లోని దాని సెక్షన్లతో సంబంధాలు పెంపొందించుకోవడానికి కూడా ఈ తీర్మానం నిర్ణయాత్మకమయింది. రెండవ ఇంటర్నేషనల్ సైద్ధాంతికంగానూ, సంస్థాపరంగానూ కూడా పటిష్టపడలేకపోయింది. దాని నిబద్ధత, నాయకత్వ తీర్మానాలకూ, ప్రదర్శనలకూ దాటి ముందుకి వెళ్లలేదు. దాని నాయకత్వం కింద కాకపోయినా, దాని చట్రంలోనే సోషల్ డెమోక్రటిక్ మహిళా ఉద్యమం రూపుదిద్దుకుంది. సామ్రాజ్యవాద యుగంలో జరిగిన సంఘటనల నించి మూడవ ఇంటర్నేషనల్ గుణపాఠాలు నేర్చుకుంది. రెండవ ఇంటర్నేషనల్ లోపాలనించి, దాని లజ్జాకరమైన అంతిమ వైఫల్యంనించి, దాని ద్రోహం నించి కూడా అది నేర్చుకుంది. అందుకే దానికి విరుద్ధంగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ సైద్ధాంతికంగా, సంస్థాపరంగా పటిష్టమైన సంస్థగా

రూపొందింది. కమ్యూనిస్టు మహిళా ఉద్యమం దాని చట్రంలోనేగాక, దానితో విడదీయరాని సంబంధం కలిగి వుండి, దాని నాయకత్వం కింద పనిచేసింది, విస్తరించింది. ఉప్పెనలా ముందు కురుకుతున్న కార్మికవర్గానికి చెందిన మహత్తరమైన సంస్థగా అది కూడా లెనిన్ ఒక సంఘటితమైన కార్యాచరణగా పెంపొందించిన చారిత్రకభౌతికవాద సిద్ధాంతంపై ఆధారపడే తన కార్యకలాపాలను, పోరాటాలనూ తీర్చిదిద్దింది. రష్యా విప్లవం అనుభవాలపై, సూత్రాలపై కూడా అది ఆధారపడింది. కమ్యూనిస్టు మహిళా ఉద్యమ సూత్రాలు, లక్ష్యాలు ఉమ్మడి ఇంటర్నేషనల్ యొక్క సంస్థాపరమైన, ఆచరణాత్మకమైన సూత్రాలను అనుసరించవలసిన అవసరం వుంది. ఎందుకంటే, తమ వర్గసోదరులతో కలిసి మహిళా కార్మికులు అలా తమ స్వేచ్ఛనీ, సమాన హక్కుల్నీ సాధించగల విప్లవానికి అవసరమైన శక్తులుగా చారిత్రక ప్రాముఖ్యతను సంతరించుకోగలరు, ఆ లక్ష్యాన్ని సాధించనూగలరు.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ప్రపంచ కాంగ్రెస్‌లతోనో, లేదా దాని కార్మికవర్గ కమిటీ విస్తృత సమావేశాలతోనో ముడిపడి జరిగిన అంతర్జాతీయ మహిళా మహాసభలూ, చర్చా సమావేశాలూ పై లక్ష్యాలను విజయవంతంగా నెరవేర్చాయి. ఈ ప్రత్యేక మహాసభల్లో జరిగిన చర్చల్లోనైతేనేమి, నివేదికలపై, తీర్మానాలపై జరిగిన ఓటింగులో నైతేనేమీ మహిళా కామ్రేడ్స్ సహజంగానే అత్యంత శ్రద్ధాసక్తులతో పాల్గొన్నారు. 1921లో మాస్కోలో జరిగిన కమ్యూనిస్టు మహిళల రెండవ అంతర్జాతీయ మహాసభ కమ్యూనిస్టు మహిళా ఉద్యమ సూత్రాలకూ, ఎత్తుగడలకూ, నిర్మాణానికీ మౌలికమైన రూపకల్పన చేసింది. అంతర్జాతీయ కమ్యూనిస్టు మహిళా ఉద్యమానికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా అది సఫ్రగెట్స్ (ఓటు హక్కుని డిమాండ్ చేసేవారు) కంటేనే కాక బూర్జువా సంస్కరణవాద సోషల్ డెమోక్రసీ కంటే, దాని మహిళా ఉద్యమం కంటే ఎంత భిన్నమైనదో స్పష్టమయింది. లైంగికపరమైన, వర్గ సంబంధితమైన బానిసత్వానికి అసలు కారణం స్వంత ఆస్తి అని, ఉత్పత్తి సాధనాలపై వ్యక్తిగత యాజమాన్యాన్ని నిర్మూలించి, దాన్ని సామాజిక యాజమాన్యంగా మార్చగలిగిననాడే మహిళలు సంపూర్ణంగా విముక్తి సాధించగలరనే పరిశీలనపైనే ఆ మార్గదర్శక సూత్రాలు ఆధారపడ్డాయి. సామాజిక వ్యవస్థలో ఈ విస్తృతమైన, మౌలికమైన మార్పుని తేవాలంటే, స్త్రీ పురుష ప్రమేయం లేకుండా, ఏ ఆస్తీ లేని వారందరితోపాటు, అతి తక్కువ ఆస్తి కలవారు కూడా ఉమ్మడి కార్యాచరణలోకి దూకాలి. కార్మికవర్గం విప్లవాత్మకమైన వర్గపోరాటాన్ని చేపట్టనిదే మహిళల నిజమైన, సంపూర్ణమైన విముక్తి సాధ్యంకాదు. మహిళలు పాల్గొనకుండా పెట్టుబడిదారీ విధానం నిర్మూలించబడటంగానీ నూతన సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భవించటంగానీ సాధ్యం కాదు.

కమ్యూనిజం ద్వారా విముక్తిని సాధించాలంటే విప్లవం అనేది ముందు షరతు కావాలని మార్గదర్శక సూత్రాలు నిర్ధారించాయి. ఆ విప్లవం ద్వారా విజయోన్ముఖంగా పోరాడే కార్మికవర్గం సమాజాన్ని మార్చే లక్ష్యాన్ని చేరుకునే మార్గంగా కార్మికవర్గ నియంతృత్వాన్ని నెలకొల్పుతుంది. స్త్రీల సమానత్వానికి అనుకూలంగా చట్టాలలో మార్పులూ, కార్మికవర్గ పరిస్థితులను మెరుగుపరిచే సాంఘిక సంస్కరణలూ, కార్మికవర్గ నియంతృత్వానికి బదులు బూర్జువా నియంతృత్వమూ, స్వేచ్ఛనూ సమానత్వాన్నీ నెలకొల్పగలవనే మోసపూరితమైన, హానికరమైన భ్రమలను ఆ మార్గదర్శక సూత్రాలు పటాపంచలు చేశాయి. అశేష ప్రజానీకాన్ని వేతన బానిసత్వానికి గురిచేసే దోపిడీ బూర్జువా సమాజంలో ఎలాంటి సంస్కరణలైనా కేవలం అక్కడొక అతుకు ఇక్కడొక అతుకు వేసే పరిష్కారాలే కాగలవు తప్ప అవి మహిళా సమస్యకుగాని, సామాజిక సమస్యకుగానీ ఎలాంటి పరిష్కారాన్నీ చూపలేవని మార్గదర్శక సూత్రాలు వివరించాయి. కమ్యూనిస్టు మహిళా ఉద్యమానికి సంస్కరణలు 'అంతిమ లక్ష్యాలు' కానేరవని తేల్చి చెప్పాక, కార్మిక స్త్రీల జీవితాలను వేధించే రోజువారీ సమస్యలను కొంతవరకు తీర్చడంకోసం; ఆ వర్గం స్త్రీలను చైతన్యవంతం చేసి, సంఘటితపరిచే కార్యక్రమం చేపట్టే విధంగా సంబంధాలు ఏర్పరుచుకోవడం కోసం, అవసరమైన డిమాండ్లను అవి రూపొందించాయి. చైతన్యవంతమైన ప్రజల అవగాహన, అభీష్టం, దృఢ నిశ్చయం రోజువారీ పాక్షిక డిమాండ్లను దాటి, కార్మికవర్గం అధికారాన్ని చేపట్టే దిశగా, సమాజాన్ని మార్చే దిశగా పయనించే విధంగా అవి దోహదపడ్డాయి. అంతేగాక, విప్లవంకోసం పోరాడటంలో వారి సామర్థ్యాన్ని బలోపేతమొనర్చి అభివృద్ధి పరచడానికి కూడా అవి దోహదపడ్డాయి.

కమ్యూనిస్టు మహిళలను విడిగా సంఘటితపరచడమనే అభిప్రాయాన్ని ఆ మార్గదర్శక సూత్రాలు స్పష్టంగా తోసిపుచ్చాయి. వారు ఒకేరకమైన హక్కులు, విధులు గల

సభ్యులుగా, సమాన ప్రాతిపదికపై తమ దేశంలోని కమ్యూనిస్టు పార్టీలో చేరవలసి వుంటుంది. మహిళా కార్మికులు, మహిళా వృత్తిపనివారు తమతోటి పురుష కామ్రేడ్స్‌తో కలిసి ఒకే యూనియన్‌లో చేరాలి. అయితే, కొన్ని సామాజిక పరిస్థితుల ఆధిపత్యం వల్ల చాలా మంది స్త్రీ పురుషులు సమిష్టి సంస్థల అవసరాన్నీ, ఆధిక్యతనూ గుర్తించడంలో గల అశక్తత, వెనుకబాటుతనం వల్ల కమ్యూనిస్టు పార్టీకి కొన్ని ప్రత్యేక సంస్థలు అవసరమయ్యాయి. అయితే, అవి విజయవంతంగా సాగించే తమ కార్యకలాపాల ద్వారా కాలక్రమేణా నిష్ప్రయోజనకమైనవిగా నిరూపించుకుంటాయి. ఈ సంస్థలు, ప్రత్యేకించి స్త్రీ పురుష కామ్రేడ్స్‌తో ఏర్పడేవి ఎలా నిర్మించబడాలనేది ఉద్యమ అవసరాలే నిర్ణయిస్తాయి. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ స్త్రీలందరినీ ఒక్కుమ్మడిగా సమీకరించడం లక్ష్యంగా అన్ని దేశాల కమ్యూనిస్టు పార్టీలు క్రమబద్ధంగా నిర్మాణయుతమైన, చురుకైన కార్యక్రమాన్ని చేపట్టాలనేది అంతర్జాతీయ కమ్యూనిస్టు మహిళా ఉద్యమం యొక్క ముఖ్యమైన సూత్రం.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ మూడవ ప్రపంచ కాంగ్రెస్ ఈ మార్గదర్శక సూత్రాలనే ధృవీకరించింది. సంఘటితమైన కమ్యూనిస్టు మహిళల అంతర్జాతీయ మహాసభలు, చర్చా సమావేశాలలో రెండు బెర్లిన్‌లోను, మిగిలినవి మాస్కోలోనూ జరిగాయి. ఈ మార్గదర్శక సూత్రాల ప్రాతిపదికపైనే ట్రేడ్ యూనియన్లలో, కో–ఆపరేటివ్‌లలో పార్టీ పనికి సంబంధించిన ముఖ్యమైన రంగాల కార్యకలాపాల గురించీ, పార్టీ సిద్ధాంత కృషికీ సంబంధించిన కార్యకలాపాల గురించీ ఆ సమావేశాల్లో విశ్లేషించడం జరిగింది. అంతేగాక, ఈ మహాసభలు మహిళల, కార్మిక స్త్రీల మహాసభలను, ప్రతినిధి సమావేశాలను క్రమబద్ధంగా నిర్వహించడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేశాయి. కమ్యూనిస్టు పార్టీకి వెలుపల వున్న కార్మిక స్త్రీలను పార్టీ క్యాంపెయిన్ల వైపు ఆకట్టుకోవడానికి, అదే సమయంలో వారిని సామాజిక, సామూహిక కృషిలో విద్యావంతుల్ని చేయడానికి కూడా అది ఎంతో విలువైన సాధనం అయింది. అలానే, వారు పార్టీయేతర ప్రజాసంఘాల్లో, ముఖ్యంగా పార్టీ పట్ల అభిమానంగల మహిళా సంఘాల్లో ఎలా పని చేయాలనే విషయమై కూడా ఒక వైఖరిని తీసుకున్నారు. అదే విధంగా, కమ్యూనిస్టు మహిళల జాతీయ సదస్సులు సహజంగానే ఆ దేశపు కమ్యూనిస్టు పార్టీతో కలిసి ఉద్యమాన్ని ప్రోత్సహించాయి. రెండు అంతర్జాతీయ మహిళా సెక్రటేరియట్‌లు, ఒకటి పశ్చిమ దేశాలకోసం బెర్లిన్‌లోనూ, మరొకటి తూర్పు దేశాలకోసం మాస్కోలోనూ 1921 నించి పనిచేస్తూ వచ్చాయి. వివిధ దేశాల కమ్యూనిస్టు మహిళా ఉద్యమాల మధ్య బలమైన సంయమనాన్ని, సంబంధాలను పెంపొందించడానికీ వాటికి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నాయకత్వానికీ మధ్య బలమైన సంబంధాన్ని పెంపొందించడానికి అవి కృషి చేశాయి. ఐదవ ప్రపంచ కాంగ్రెస్ తర్వాత అవి సమైక్యమై కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ కార్యవర్గ కమిటీలోని మహిళా విభాగంగా ఏర్పడ్డాయి. దాని కార్యస్థానం మాస్కో. కార్మికవర్గ ప్రపంచ సంస్థకు చెందిన అన్ని విభాగాలను, అంగాలను, అది సమైక్యపరిచింది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ జాతీయ విభాగాల నాయకత్వానికి అది ఒక నమూనాగా పని చేసింది.

కమ్యూనిస్టు మహిళా ఉద్యమ నిర్మాణానికీ, మౌలిక విధానానికీ సంబంధించి ఉమ్మడి సూత్రాలను రూపొందించడం వల్ల అంతర్జాతీయంగా సమైక్య కార్యాచరణకు బలం చేకూరింది. అది వేగాన్ని పుంజుకుంది, స్థిరపడింది. 1921లో కరువు వాతపడిన రష్యాకు సహాయపడవలసిందిగా మహిళా కమ్యూనిస్టు నాయకులు ఇచ్చిన పిలుపును పురస్కరించుకుని పెట్టుబడిదారీ దేశాల్లో అసంఖ్యాకమైన మహిళలు ఎంతో త్యాగపూరితమైన, చురుకైన సహాయాన్ని అందించారు. ప్రతి సంవత్సరం మార్చి 8న పాటించే అంతర్జాతీయ కమ్యూనిస్టు మహిళా దినోత్సవం రష్యాలోను, పెట్టుబడిదారీ దేశాల్లోను, వలస–అర్ధవలస దేశాల్లోనూ సంఖ్యరీత్యా పెరుగుతున్న అభివృద్ధి చెందుతున్న విప్లవాత్మకమైన మహిళలను సమైక్యపరిచింది. కమ్యూనిజాన్ని సాధించడం కోసం తమలో తమకు, తమకూ తమ సోదరులకూ మధ్యవున్న విడదీయరాని అంతర్జాతీయ సంఘీభావ సంబంధం గురించి వారిని జాగృతపరిచింది. సామ్రాజ్యవాద యుద్ధ ప్రమాదానికి వ్యతిరేకంగా నిరంతరంగానూ దృఢంగానూ పోరాడాలనీ; కార్మికవర్గ నియంతృత్వ తొలిరాజ్యమైన రష్యాకు వ్యతిరేకంగా ఆర్థిక దిగ్బంధనం అనే సోవియట్ వ్యతిరేక విధానాన్ని సమర్థించే బూర్జువా సోషల్ డెమోక్రటిక్ లేదా బోల్షివిక్ వ్యతిరేక దుష్ప్రచార క్యాంపెయిన్లకు వ్యతిరేకంగా దృఢంగా పోరాడాలనీ మూడవ ఇంటర్నేషనల్ యొక్క జాతీయ విభాగాలు అన్ని తరగతులకు చెందిన శ్రామికులకు, కార్మికవర్గ ప్రజారాసులకు పిలుపు ఇచ్చినపుడు విప్లవ లక్ష్య సాధన కోసం, తమ విముక్తి సాధనకోసం మహిళలు ముందు పీఠీన నిలిచారు. తమ పూర్తి శక్తికొద్దీ కృషి

చేయటానికి సర్వసన్నద్ధులయ్యారు. రష్యాకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాద దేశాలు తలపెట్టే సైనిక దాడులను ఎదుర్కోవడానికి కూడా సిద్ధమయ్యారు.

దోపిడీ పీడనలతో పీల్చి పిప్పి చేయబడి సాంఘికంగా, జాతీయంగా అణచివేయబడిన బల్గేరియా, రుమేనియా, యుగోస్లావియా ప్రజలు తిరుగుబాట్లు చేశారు. ఇటలీ, పోలెండ్, తదితర దేశాల్లో పరిశ్రమలలో, గ్రామీణ ప్రాంతంలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులు ఫాసిజానికీ, దౌర్జన్యానికీ వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. గ్రేట్ బ్రిటన్‌లో జరిగిన గని కార్మికుల మహత్తర పోరాటంలో; సామ్రాజ్యవాద దోపిడీకి గురైన చైనా, ఇండియా, ఇండోనేషియా, ఇండో – చైనా, నైరుతి ఆఫ్రికా, సామాజిక బానిసత్వానికి వ్యతిరేకంగా విప్లవదాడులు చేశారు. ఈ అన్ని పోరాటాల్లోనూ అన్ని రకాల సమ్మెలు, లాక్ అవుట్‌లలోనూ స్త్రీ కార్మికులు, కార్మికుల భార్యలు ఆదర్శప్రాయంగా నిలిచిన ప్రతిచోటా, సామాజిక రాజకీయ విధానాలపై, పేదల రాజకీయ, సాంస్కృతిక హక్కులపై, తదితర అనేక సమస్యలపై ఎడతెరిపి లేకుండా జరిగే చర్చల్లో కార్మిక మహిళలు తమ సోదరులతో కలిసి పోరాటాల్లో పాల్గొనడంవల్లా వీరోచితంగా వ్యవహరించడం వల్లా, అమరులు కావడంవల్లా చరిత్రలో తమకంటూ గొప్ప విప్లవాత్మకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. కార్యాచరణ ద్వారా వ్యక్తం గాకపోయినా మహిళలు ఎక్కడ ఏ సంఘటనలో చురుగ్గా పాల్గొన్నగానీ, అంతర్జాతీయ సంఘీభావ సంబంధపు చైతన్యం వారి పోరాట దీక్షను, ఉత్సాహాన్నీ రెట్టింపు చేసింది. కమ్యూనిస్టు మహిళా ఉద్యమ భావాల విప్లవ బీజాలు మొలకెత్తుతున్నాయి, పెరిగి పెద్దవవుతున్నాయి.

రష్యాలో సంఘటితమైన మహిళా కామ్రేడ్స్ కమ్యూనిస్టు మహిళా ఉద్యమానికి బలమైన, సురక్షితమైన బెటాలియన్లను, నిజానికి ఒక పూర్తి స్థాయి జాతీయ సైన్యాన్నే అందించారు. నిజానికి వారు అందించినది వారి సంఖ్యాబలం కంటే కూడా విలువైనది; రష్యా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన గల కార్మికవర్గ నియంతృత్వ రాజ్యంలో సమాన అధికార హోదాతో వారు కృషి సలిపారు. ఎందుకంటే, కార్మికవర్గం రాజ్యాధికారాన్ని హస్తగతం చేసుకుని తన రాజ్యాన్ని ప్రకటించుకున్న దశలోని విప్లవయోధులుగా సోషలిస్టు నిర్మాణం కోసం ఆ అధికారాన్ని వెచ్చించిన దశలో సహచరులుగా, కార్మిక వర్గానికి రైతాంగానికి చెందిన శ్రామిక స్త్రీలను మేల్కొలిపి చైతన్యపరిచే కర్తవ్యంలో భాగస్వాములుగా తాము పొందిన విలువైన అనుభవాల గనిని వారు కమ్యూనిస్టు మహిళా ఉద్యమానికి అందించారు. అయితే, కమ్యూనిస్టు మహిళా ఉద్యమం రష్యాకు ఆవల ఇతర దేశాల్లో వుండే విభిన్న చారిత్రక పరిస్థితులలో ఆ అనుభవాలను గుడ్డిగా ఆలోచించకుండా అనుకరించలేదు. ఆ అనుభవాలు ఎంతో ఫలప్రదమైన ప్రేరణలుగా, మార్గదర్శకాలుగా పని చేశాయి. అరుణారుణ అక్టోబర్ విప్లవం, దిగ్బంధన కాలం, విదేశీ జోక్యం, అంతర్యుద్ధం, వీరోచితమైన సోషలిస్టు నిర్మాణం దశలో స్వాతంత్ర్యయోధుల జాజ్వలమాన వ్యక్తిగత ఉదాహరణలు అంతర్జాతీయ కమ్యూనిస్టు మహిళా ఉద్యమానికి విప్లవ శక్తినీ, ఉత్తేజాన్నీ అందించే జీవధారగా పని చేశాయి. విప్లవం కోసం వారు ఎలా ప్రాణాలు ధారపోయాలో, అంతకంటే కష్టమైన విషయం, విప్లవం కోసం వారు ఎలా జీవించాలో అన్ని దేశాల కమ్యూనిస్టు మహిళలు సోవియట్ మహిళల నించి నేర్చుకున్నారు.

మూడవ ఇంటర్నేషనల్‌తోపాటు కమ్యూనిస్టు మహిళా ఉద్యమం కూడా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. కెనడా, అమెరికా, మెక్సికో, మధ్య, దక్షిణ అమెరికా దేశాల్లోను, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలోను అది సజీవంగా నిలిచి గట్టి ప్రభావాన్ని నెరిపింది; సమీప, దూర ప్రాచ్య దేశాల్లో కూడా అది మహిళాలోకాన్ని విప్లవ రాజకీయాలతో చైతన్యవంతం చేసింది. వేల సంవత్సరాలుగా ఆర్థిక సామాజిక జీవన కట్టుబాట్ల మధ్య నలిగిన మహిళలే మహిళా బానిసల్లో అత్యంత అణచివేతను ఎదుర్కొన్నారు. ఈ దేశాలు కొన్నిటిలో పెట్టుబడిదారీ వర్తకం, తీవ్రతరమైన పెట్టుబడిదారీ ఉత్పత్తి ఆరంభమయిన పర్యవసానంగా అక్కడ బూర్జువా మహిళా ఉద్యమం తలెత్తి గణనీయమైన విజయాన్ని చవిచూసింది. అయితే, ఈ ఉద్యమానికి సంబంధించిన బూర్జువా స్వభావాన్నీ, లక్ష్యాలనూ పరిగణనలోకి తీసుకోకపోయినాగానీ, అది ప్రజలను మేల్కొల్పలేక పోయింది. ఉత్తేజపరచలేకపోయింది. ఆ విధంగా అది సమాజం అట్టడుగు పొరల్లో జీవిస్తున్న సెక్షన్లలోకి చొచ్చుకుపోవడంలో విఫలమయింది. అందుకే మరింత విస్తృతమైన ఉద్యమాలకూ మరింత ఉన్నతమైన లక్ష్యాలకూ అవసరమైన ప్రేరణ దానికి కొరవడింది. ఉజ్వలంగా ప్రకాశిస్తున్న సోవియట్ వేగుచుక్క, లక్ష్యాన్ని ఎత్తి చూపడమేగాక, దాన్ని చేరుకునే మార్గాన్ని కూడా అది చూపింది. తూర్పు దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలతో సంబంధం కలిగిన కమ్యూనిస్టు మహిళా ఉద్యమం తలెత్తింది. ప్రత్యేకించి

చైనాలో అది కార్మికవర్గ రైతాంగ మహిళా జనసామాన్యాన్నే కాక అసంఖ్యాకమైన విద్యావంతులయిన మహిళలను, పెటీ బూర్జువా మహిళలను కూడా భయమనేది ఎరుగని విప్లవయోధులుగా రూపొందించింది. 1927లో అంతర్జాతీయ కమ్యూనిస్టు మహిళా దినోత్సవం నాడు హుపే రాష్ట్రానికి సంబంధించిన మహిళల మహాసభను నిర్వహించారు. దాని ఆచరణకు సంబంధించిన కార్యక్రమం "మహిళల విముక్తి సాధనకు విప్లవమే ఏకైక మార్గం" అని తొలి ప్రకటన వాక్యాలతో ఆరంభమవుతుంది.

కమ్యూనిస్టు మహిళా ఉద్యమం అభివృద్ధి, దాని విజయాలు శ్లాఘనీయమైనవి. విజయం ఉన్మత్తతకు కారణం కాకూడదు. పైగా, విజయం మన బాధ్యతను పెంచుతుంది. సంఘటితమైన తొలి మహిళాయోధులు, క్షీణిస్తున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానదశ, ప్రపంచ కార్మికవర్గ విప్లవం ఆరంభమై నిరంతరాయంగా పరిపక్వమవుతున్న దశ తమ ముందు వుంచిన మహత్తర కర్తవ్యాల భారాన్ని మరచి, తాము ఇప్పటి వరకు శ్రామిక స్త్రీ జనావళి మధ్య చేసిన పని, సాధించిన విజయాలను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే, వారు కమ్యూనిజానికి అన్యాయం చేసినవారే అవుతారు. కమ్యూనిస్టు మహిళా ఉద్యమ స్త్రీ పురుష ప్రతినిధులు ఊహాజనితమైన విషయాలపై కేంద్రీకరించకుండా, ఆయా విషయాల వాస్తవ పరిస్థితిని చూడగలగాలి. అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం రష్యాలో అభివృద్ధి చెంది, తన ప్రభావాన్ని చూపినా, ఆ రెండు అంశాల్లోనూ మొత్తం మీద అది బలహీనంగా వుందనే చెప్పాలి. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌కు చెందిన అన్ని జాతీయ విభాగాల కేంద్ర నాయకత్వం, దాని కింద పనిచేసే సంస్థలూ కూడా కార్మిక స్త్రీలు విప్లవాత్మకమైన కార్మికవర్గ పోరాటంలో పాల్గొనవలసిన అవసరాన్నీ దాని విలువనూ, అలా పాల్గొనవలసిన అవసరానికి గల చారిత్రక కారణాలనూ తగినంతగా గుర్తించడంలో విఫలమయ్యాయనే చెప్పాలి. ఎక్కడైతే సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ విధానం రాజ్యమేలుతుందో, దోపిడీ సాగిస్తుందో అక్కడ సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ ఆర్థిక విధాన శక్తికీ, రాజ్యాంగానికీ, సామాజిక వ్యవస్థకూ వ్యతిరేకంగా కమ్యూనిస్టు మహిళా ఉద్యమం ముందుకొచ్చింది. పైగా అది బూర్జువా, సోషల్ డెమొక్రటిక్ మహిళా ఉద్యమం నుంచి బలమైన, హేయమైన పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. కమ్యూనిస్టు మహిళా ఉద్యమం ఇంకా తొలి ప్రాయంలోనే వుంది. కనుక ఆ ఉద్యమంలో కొట్టవచ్చినట్టు కనపడే కొన్ని బలహీనతలు చారిత్రకంగానే అనివార్యమయ్యాయి. వివిధ దేశాల కమ్యూనిస్టు పార్టీల వైఖరిలో కూడా పొరపాట్లు వున్నాయి.

ఇవీ, మరికొన్ని ఇతర పరిస్థితులూ కమ్యూనిస్టు మహిళా ఉద్యమం వేగంగా, గణనీయంగా పురోగమించడాన్ని నిరోధించలేవు సరికదా, తన దీక్షను, శక్తిని అత్యున్నత స్థాయికి తీసుకుపోయే విధంగా అవి దాన్ని ప్రేరేపిస్తాయి. లెనినిస్టు కర్తవ్యపాలన చైతన్యంతో గతితార్కిక భౌతికవాదం సహాయంతో అది తాను పరిపక్వత చెందడానికీ, ప్రభావం చూపడానికీ అవసరమైన పరిస్థితుల గురించి పరిశీలిస్తుంది. లోతైన సైద్ధాంతిక అవగాహనతో అది ఆచరణలో విజయాన్ని సాధిస్తుంది. నేర్చుకుంటూ, పనిచేస్తూ, పోరాడుతూ, కమ్యూనిస్టు మహిళా ఉద్యమం తనకు ఎదురవుతున్న అన్ని అడ్డంకులను, అవరోధాలను అధిగమిస్తుంది. విప్లవం కోసం కమ్యూనిజం స్థాపన కోసం పాటుపడే శక్తులుగా మహిళలకు సమాన ప్రాతిపదిక వుండాలనే వాదనను అది ఆచరణ ద్వారా పరిపుష్టం చేస్తుంది. సంఘటితపడిన మహిళా కమ్యూనిస్టులు తమ సైద్ధాంతిక అవగాహనలో కార్యాచరణ రంగంలో ప్రస్ఫుటమయ్యే పొరపాట్లను, వైఫల్యాలను అధిగమించడానికి వారు ఎంతో ఆసక్తితో తెలివితేటలతో ముందుకు వస్తారనేది ప్రత్యేక ప్రాముఖ్యతతో చెప్పుకోవాలి. కమ్యూనిస్టు మహిళా ఉద్యమం ఎదుట మొదటి కార్మికవర్గ నియంతృత్వ రాజ్యం అనే ఉత్తేజకరమైన ఉదాహరణ వుంది. ఆ రాజ్యం తన రాజ్యాంగంలో మహిళల సంపూర్ణ సమానత్వాన్ని రచించింది; విస్తృతమైన మాతాశిశు సంరక్షణ కేంద్రాల ద్వారా, ఇతర ప్రాథమిక నూతన మార్పుల ద్వారా అది ఈ సమానత్వాన్ని ఖాయపరుస్తుంది. సామ్రాజ్యవాద గుత్తపెట్టుబడిదారీ విధానం యొక్క నిర్దాక్షిణ్యమైన పాలన కింద బూర్జువా సామాజిక వ్యవస్థ స్థిరపడి, పునఃసంఘటితమైనాగానీ, దాని నిర్మూలనను వేగిరపరిచే భౌతిక శక్తుల ప్రభావం వల్ల కమ్యూనిస్టు మహిళా ఉద్యమం మున్ముందుకే సాగుతుంది. పెట్టుబడిదారీ విధానం కింద వున్న అన్ని దేశాల, ప్రాంతాల పీడిత ప్రజలకు చెందిన సంఘటితమైన, విప్లవాత్మకమైన, పోరాడే శక్తులతోపాటు కమ్యూనిస్టు మహిళా ఉద్యమం కూడా కమ్యూనిజం సాధనకు అవసరమైన స్వీయాత్మక తిరుగుబాటు శక్తేనని రుజువవుతోంది. అది శ్రామిక స్త్రీలను

***(తరువాయి 20వ పేజీలో.......)***

# వాకపల్లి బాధితులపై 'న్యాయ'స్థానం చేసిన అత్యాచారం!

'వాకపల్లి' బాధితులకు కోర్టు నోటీసులు పంపి, న్యాయవ్యవస్థ మరోసారి 'నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు' అనుకుంది. పాలకవర్గాలకు 'జీహుజూర్' అంటూ అది ఎంతగా గులాంగిరీ చేస్తుందో నిస్సిగ్గుగా దండోరా వేసి మరీ చాటుకుంది. మహిళా ఉద్యమాల ఘోషకు తట్టుకోలేక అత్యాచార చట్టానికి వేసిన మాట్లను తీసేసి మరిన్ని తూట్లు పొడిచింది.

అసలు వాకపల్లి కేసులో మొదటి నుంచీ శాసన, పరిపాలన వ్యవస్థలు నగ్నంగా దోషులను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నాయి. చివరాఖరికి న్యాయ వ్యవస్థ కూడా అదే పని చేసి, తానూ అదే తానులో గుడ్డననే విషయం గుర్తు చేసింది.

మహిళా ఉద్యమాలు ఎంతగానో కళ్లకు, చెవులకు గంతలు కట్టుకున్న న్యాయవ్యవస్థ ముందు అరిచీ అరిచీ కంఠశోష తెచ్చుకుంటే అది 'రేప్ లా' (అత్యాచార చట్టం)కు కొన్ని సవరణలు చేసింది. అందులో ముఖ్యమైనది–అత్యాచారం కేసులో బాధితుల వాంగ్మూలాన్ని కీలకమైన సాక్ష్యంగా పరిగణించాలి అనేది. అంతేకాదు ముద్దాయిలే తమ నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలి అనేది కూడా. కానీ వాకపల్లి కేసులో ఈ సవరణలన్నీ మొహం చాటేశాయి.

చట్టానికి లోబడి వుంటామని చెప్పుకునే ప్రభుత్వ వర్గాలు మొదటి నుండీ ఈ కేసులో ఎలా చట్ట ధిక్కారానికి పాల్పడుతున్నాయో వృధా ప్రయాసే అయినా మరోసారి గుర్తు తెచ్చుకుందాం.

మాపై పోలీసులు అత్యాచారం చేశారంటూ వాకపల్లి మహిళలు తమ నోరు విప్పగానే విశాఖ ఎస్పీ, రాష్ట్ర డి.జి.పి, హోం మంత్రి 'ఇది కూంబింగ్ ఆపడానికి నక్సల్స్ పన్నిన కుట్ర' అన్నారు. (ముందే ఇలా మాట్లాడే హక్కు ఏ చట్టం వీళ్లకిచ్చింది? విచారణ తంతు ముగిసిన తర్వాత కదా అత్యాచారం జరిగిందో, లేదో చెప్పాల్సింది.) ఆ తర్వాత కనీసం జరగాల్సిన తూ తూ మంత్రం తంతులైనా జరగలేదు. సకాలంలో వైద్య పరీక్షలు జరుపలేదు. దోషులను – పోనీ కోర్టు భాషలో 'ముద్దాయిలే' అందాం – అరెస్టు చేయలేదు. ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయలేదు. ముద్దాయిల గుర్తింపు ప్రక్రియను చేపట్టలేదు. కనీసం ఆరోజు కూంబింగ్‌కు ఎవరు వెళ్లారో పేర్లయినా ప్రకటించలేదు. పైగా కేసు వెనక్కి తీసుకొమ్మని బాధితులను బెదిరించారు. ప్రలోభ పెట్టారు.

కానీ బాధితులు దృఢంగా నిలబడ్డం వల్ల, వారికి అనేక సంఘాలూ, ప్రజలూ మద్దతు ఇవ్వడం వల్ల, ఆందోళనలు చేపట్టడం వల్ల గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి నాగిరెడ్డిని ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విచారణ చేపట్టిన నాగిరెడ్డి తన నివేదికలో 'అత్యాచారం జరిగినట్టు ఆధారాలున్నాయని' వెల్లడించాడు. దానితో నివేదికను తుంగలో తొక్కి సి.ఐ.డి.ని విచారణకు పురమాయించింది. సి.ఐ.డి. తన విచారణలో అత్యాచారం జరగలేదని హైకోర్టుకు నివేదిక సమర్పించడంతో హైకోర్టు కేసును కొట్టివేసింది.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసును అంత తేలిగ్గా మూసేయడంతో బాధిత మహిళలూ, ప్రజాస్వామికవాదులు అవాక్కయ్యారు. అయితే 'న్యాయ'స్థానాల 'ఘనత' ఇంతటితో ముగిసిపోలేదు.తమ ఆరోపణలకు ఆధారాలను చూపించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని పాడేరు కోర్టు బాధిత మహిళలకే నోటీసులు పంపింది. దాంతో బాధిత మహిళలూ, ప్రజాస్వామిక వాదులూ మరింత తెల్లబోక తప్పలేదు. ప్రాథమిక విచారణ కూడా చేయించకుండా గ్రేహౌండ్స్ బలగాలను వెనకేసుకొచ్చిన అధికారులూ, మంత్రులను కోర్టు తప్పుపట్టాలి. ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేయని పోలీసులను తప్పుపట్టాలి. సకాలంలో వైద్య పరీక్షలను చేయించని వాళ్లను తప్పుపట్టాలి. కేసును వెనక్కి తీసుకొమ్మని బాధితులను బెదిరించినవాళ్లను తప్పుపట్టాలి. 'ముద్దాయిలను' కనీసం సస్పెండ్ చేయనందుకూ, అరెస్ట్ చేయనందుకూ అధికారులను తప్పుపట్టాలి. కానీ వీళ్లెవ్వరినీ తప్పుపట్టని 'న్యాయ' స్థానం బాధితులనే తప్పుపట్టింది. పైగా ఆరోపణలు నిరూపించకపోతే శిక్షిస్తాననీ మాట్లాడింది. అత్యాచారం కేసులో నిందితులు నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని చట్టం చెప్తుండగా, బాధితులే నేరాన్ని నిరూపించుకోవాలని కోర్టు ఏ చట్టం ప్రకారం నోటీసులు పంపినట్టు? ఇక్కడ

న్యాయస్థానమే చట్టవిరుద్ధంగా ప్రవర్తించినట్టు. పైగా నిరూపించుకోకపోతే శిక్షిస్తానంటోంది. 'వంద మంది దోషులు తప్పించుకున్నా ఫర్వాలేదు గానీ, ఒక నిర్దోషి తప్పించుకు పోకూడదనే' సూత్రాన్ని 'ఆదర్శంగా' తీసుకుంటానని చెప్పుకునే న్యాయవ్యవస్థ ఇప్పుడు బాధితులను శిక్షిస్తానని ఎలా మాట్లాడుతున్నది?

ఈ నోటీసుల ద్వారా 'న్యాయ' స్థానం మహిళలకు ఏం సందేశమిస్తోంది? 'మహిళల్లారా! మీరు అత్యాచారానికి గురైతే బయటపెట్టుకోకండి. మీలోనే కుమిలి కుమిలి చావండి. అంతేగాని కోర్టులకెక్కకండి. ఎక్కితే మిమ్మల్నే శిక్షించగలం జాగ్రత్త' అని చాటడం లేదూ. మనుస్మృతిని తలకెక్కించుకున్న న్యాయస్థానాలు ఇంతకంటే ఏం చేయగలవు? ప్రజా కోర్టుల్లో అత్యాచారం చేసిన వాళ్లను శిక్షించినపుడు, 'శిక్షించడానికి చట్టాలున్నాయి, కోర్టులున్నాయి, చట్టాన్ని చేతిలోకి తీసుకోవడానికి మీరెవరు' అని విప్లవకారులను ప్రశ్నించే 'మేధావుల'కు ఇప్పటికన్నా కనువిప్పు కావాలి.

ఇంతకూ వాకపల్లి బాధితులమీద శాసన, పరిపాలన, న్యాయ వ్యవస్థలు ఇంతగా ఎందుకు కక్షగట్టాయి? అని ప్రశ్నించుకుంటే– ఈ అత్యాచారం వెనుక ఒక పెద్ద కుట్ర వుంది. అది సామ్రాజ్యవాదపు కుట్ర. మన్యం కొండల్లో సామ్రాజ్యవాదులకు కావాల్సిన ఎంతో సంపదుంది. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో ఇక్కడ బాక్సైట్ గనులపై సామ్రాజ్యవాదులకు కన్ను పండింది. వాటిని తవ్వుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఇక్కడ దృఢంగా పోరాడుతున్న మావోయిస్టు ఉద్యమం సామ్రాజ్యవాదుల ఆటలను కొనసాగనివ్వడం లేదు. బాక్సైట్ వెలికితీతకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేసి అనేక ఆందోళనలు చేపట్టింది. మావోయిస్టు ఉద్యమ చైతన్యంతో సంఘటితమైన ప్రజలు బాక్సైట్ కోసం సర్వేకు వచ్చే అధికారులను కూడా తమ గడ్డపై అడుగుపెట్టకుండా అడ్డుకుంటున్నారు. ఇక్కడ ఉద్యమం వున్నంత కాలం తమ ఆటలు సాగవని గుర్తించిన సామ్రాజ్యవాదులు, వాళ్ల కాపలాకుక్కలైన భారత పాలకవర్గాలు ఉద్యమంపై, తీవ్రమైన హింసను ప్రయోగిస్తున్నాయి. అందులో భాగంగా పలు 'ఎన్‌కౌంటర్లను' చేసి విప్లవకారులను హత్య చేశాయి. ప్రజలను అరెస్టులుచేసి, తీవ్ర చిత్రహింసలకు గురి చేసి తప్పుడు కేసులు బనాయిస్తున్నాయి. ఈ నష్టాలను తట్టుకుంటూ కూడా ఇక్కడి ఉద్యమమూ, ప్రజలు వెనుకడుగు వేయలేదు. ముఖ్యంగా ఈ ఉద్యమంలో మహిళలు చురుకైన పాత్ర వహిస్తున్నారు. అందుకే పాలకవర్గాలు మహిళలనూ టార్గెట్ చేస్తున్నాయి. మహిళలను టార్గెట్ చేయడానికి అత్యాచారాన్ని మించిన 'ఆయుధం' లేదని తర తరాల నుంచీ పాలకవర్గాలు భ్రమిస్తున్నాయి. ఇందులో భాగమే వాకపల్లి అత్యాచారం. తమ గడ్డపై మావోయిస్టు వుద్యమం ఉన్నంత కాలం పోలీసులు వస్తారనీ, పోలీసులు వస్తే తమ మానప్రాణాలకు రక్షణ వుండదనే భయాన్ని ప్రజల్లో కల్గించి ప్రజలను ఉద్యమం నుండి దూరం చేయాలనేది పాలకవర్గాల కుట్ర.

వాకపల్లి అత్యాచారాలు మనకు మరో విషయాన్ని కోటిన్నొకటోసారి గుర్తు చేస్తున్నాయి. ప్రస్తుత భారత రాష్ట్రపతి ఒక మహిళ. ప్రస్తుత భారత ప్రభుత్వాన్ని తన కనుసన్నల్లో నడిపిస్తున్నదీ ఒక మహిళే. ఇటువంటి ఉదాహరణలను చూపి మహిళల స్థితిగతులు పూర్తిగా మారిపోయాయని చెప్తుంటారు. కానీ ఈ మహిళల పాలనలోనే ఒకే సంఘటనలో 11 మంది మహిళలపై మూకమ్మడి అత్యాచారాలు జరిగాయి. ఈ మహిళల పాలనలోనే అత్యాచార బాధితులు కనీసం తమకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించే పరిస్థితి లేదు. అంతేకాదు ఈ మహిళా పాలకులు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనపై కనీసం నోరు విప్పలేదు. బూటకపు విచారణకైనా ఆదేశించలేదు. ఇదేం కొత్త కాదు. ఇందిరా గాంధీ పాలనలోనే రమిజాబీపై అత్యాచారం జరిగింది. ఆమె పాలనలోనే దోషులను నిర్దోషులను చేసింది. అంతేకాదు రమిజాబీ పైనే బురద జల్లినదీ ఆమె కాలంలోనే. ప్రస్తుత సమాజంలో పాలనలో మహిళలున్నా పురుషులున్నా ఈ దోపిడీ వ్యవస్థనూ, దోపిడీ వ్యవస్థకు బలమైన ఆధారంగా వున్న పితృస్వామ్యాన్ని బలంగా కాపాడుతారని వాకపల్లి సాక్షిగా మరింత స్పష్టమైంది.

న్యాయస్థానాలు నిస్సిగ్గుగా వదిలేసినప్పటికీ, ఈ నేరస్తులు శిక్ష నుండి తప్పించుకోలేరు. తమ గ్రామంలోకి ఇక మీదట పోలీసులు అడుగుపెడ్తే నరుకుతామని వాకపల్లి మహిళలు ధైర్యంగా ప్రకటించారు. అదే నేరస్తులకు నిజమైన శిక్ష.ఈ మహిళల సాంప్రదాయక ఆయుధాల నుండి ఎవరైనా తప్పించుకొని వస్తే, ఆ నేరస్తులను శిక్షించడానికి ప్రజా విముక్తి గెరిల్లా సైన్యపు ఆయుధాలు కాచుకునే వుంటాయి. అలా వాకపల్లి మహిళలు ఆనందంతో ధింసావేసే రోజులు తప్పక తిరిగొస్తాయి. ★

*(48వ పేజీ తరువాయి...)*

మోహరించిన పి.ఎల్.జి.ఎకు చెందిన ఆంబుష్ పార్టీ దాడికి దిగడంతో శతృవు గాబరాతో పారిపోయాడు. అదేరోజు సాయంత్రం 4 గంటలకు శత్రువు గ్రేహౌండ్స్ బలగాలతో సహా ఇతర బలగాల్ని కలుపుకుని పెద్దఎత్తున దాడికి వచ్చాడు. సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల వరకు గోసామ పరిసరాల్లో శత్రువుకు, పి.ఎల్.జి.ఎ బలగాలకు హోరా హోరీగా యుద్ధం సాగింది. శత్రువు పెద్దఎత్తున బాంబులు వేసినా, తూటాల వర్షం కురిపించినా పి.ఎల్.జి.ఎ బలగాలు ఏమాత్రం చెదరక, బెదరక ఉన్న చోటనే ఉండి శత్రువును గట్టిగా ప్రతిఘటించాయి. పి.ఎల్.జి.ఎ బలగాలు సాహసోపేతంగా శత్రువుపైకి దూసుకెళ్ళి కౌంటర్ దాడి చేశాయి. దీంతో ఒరిస్సా గ్రేహౌండ్స్ పోలీసులు ముగ్గురు చనిపోయి, కొంత మంది గాయపడ్డారు. గెరిల్లాలు చేసిన ఈ సాహసోపేత కౌంటర్ దాడితో పోలీసు బలగాలు తీవ్రంగా భయపడి పారిపోవడం మొదలుపెట్టాయి. పారిపోతున్న పోలీసుల్ని పి.ఎల్.జి.ఎ బలగాలు ఒక కిలోమీటర్ వరకు వెంబడించి తరిమివేశాయి. ఈ కౌంటర్ దాడిలో ముగ్గురు పోలీసులను మట్టికరిపించి రెండు ఎ.కెలను, ఒక ఇన్‌సాస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో పి.ఎల్.జి.ఎకు చెందిన కామ్రేడ్స్ రాంబత్తి, ఇక్బాల్‌లు అమరులయ్యారు.

గోసామ పర్వత ప్రాంత పరిసరాల్లో జరిగిన పోరులో గెరిల్లా బలగాలు పైచేయి సాధించి పోలీసులను తరిమివేయడంతో రెండు రోజుల పాటు పోలీసులు గోసామ గుట్టలు ఎక్కడానికి సాహసించలేదు. ఒరిస్సా రాష్ట్ర పోలీసులు, ఒరిస్సా గ్రేహౌండ్స్, ఆంధ్రా గ్రేహౌండ్స్ బలగాలతోపాటు కేంద్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద విమానాల్లో పంపిన 800 మంది పారామిలిటరీ బలగాలూ కలిపి మొత్తం 1400 మంది పోలీసులు గోసామ పర్వతాల్లో పి.ఎల్.జి.ఎ. గెరిల్లాల్ని చుట్టుముట్టి దెబ్బతీయడానికి గోసామ పర్వతాల చుట్టూ మోహరింపులు చేసినా, రెండు సైనిక హెలికాప్టర్లతో గాలింపులు చేసినా గెరిల్లాలు వాటన్నింటిని విఫలం చేసి సురక్షితంగా రిట్రీట్ అయ్యారు. రిట్రీట్‌లో 300 పైబడి మేలు రకం తుపాకుల్ని, 50 వేల తూటాల్ని శత్రువుకు అందకుండా తీసుకు వచ్చారు. పి.ఎల్.జి.ఎ. బలగాలు రిట్రీటయిన తర్వాత మాత్రమే శత్రువు భయం భయంగా రోజుకు కొన్ని మీటర్లు మాత్రమే అడ్వాన్స్ అవుతూ నెలరోజులపాటు వెతికి పి.ఎల్.జి.ఎ గెరిల్లాలు తాత్కాలికంగా దాచి వచ్చిన 570 తుపాకుల్ని, 1 లక్షా 19 వేల తూటాల్ని స్వాధీనం చేసుకోగలిగాడు.

గోసామ పరిసరాల్లో పి.ఎల్.జి.ఎ బలగాలు సాగించిన కౌంటర్ దాడికి బెదిరి ప్రాణ భయంతో పారిపోయిన శత్రువు 38 మంది గెరిల్లాలను చంపివేశామని ప్రగల్బాలతో ప్రచారం సాగించాడు. ఫిబ్రవరి 18 వరకు గోసామ గుట్టల్ని ఎక్కడానికి సాహసించని శత్రువు రెండు రోజుల్లోనే 80 శాతం తుపాకుల్ని, 90 శాతం తూటాల్ని తిరిగి స్వాధీనం చేసుకున్నామని అతిశయోక్తులతో కూడిన ప్రచారానికి లంకించుకున్నాడు. ముఖాముఖి సమరాల్లో పి.ఎల్.జి.ఎతో తలపడి విజయాలు సాధించలేని శత్రువు సైకలాజికల్ వార్ ఫేర్‌లో భాగంగా అబద్ధాల్ని, అతిశయోక్తుల్నీ ప్రచారం చేసి విప్లవ శిబిరాన్ని గందరగోళానికి గురిచేసే ప్రయత్నం చేశాడు. తద్వారా పడిపోయిన పోలీసుల నైతిక స్థైర్యాన్ని నిలబెట్టడానికి, ప్రతిపక్షాల్ని శాంతింపచేయడానికి ప్రయత్నించాడు.

## నయాగఢ్ తర్వాత పరిణామాలు

సంఘటన జరిగిన మరుసటి రోజే కేంద్రం నుంచి జె.ఓ.సి ఛీఫ్ ఎం.ఎల్.కుమావత్ నయాగఢ్‌కు వచ్చాడు. కేంద్ర బలగాలూ, ఎ.పి, ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా బలగాలు హెలికాప్టర్లతో గోసామా అడవుల్లో, నయాగఢ్ జిల్లాలో ఏరియల్ సర్వే జరుపుతూ ర్యాలీలు నిర్వహించాయి.

ఒరిస్సా అసెంబ్లీలో కుక్కల కొట్లాట తారాస్థాయికి చేరింది. ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తే, అభివృద్ధి నిరోధక పాలకపార్టీలు, ప్రత్యేకించి బి.జె.పి మావోయిస్టులపై గట్టి చర్యలు తీసుకోవాలంటూ గగ్గోలు పెట్టింది.

బహుళజాతి సంస్థల కార్పోరేట్ యజమానులు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌ల వలె ఒరిస్సా కూడా తమకు సురక్షితం కాదని నిర్ధారణకు వచ్చారు. వీరికి హామీనిచ్చేందుకు నవీన్ పట్నాయక్ అదనపు బలగాలు కావాలని ప్రధానమంత్రిని కలవడానికి ఢిల్లీకి వురికాడు. ఒరిస్సాలోని సి.ఆర్.పి.ఎఫ్. బలగాలను కొనసాగిస్తామనీ, త్వరలో 5 బెటాలియన్లను ఏర్పాటు చేస్తామని మన్మోహన్‌సింగ్ నవీన్ పట్నాయక్‌కు హామీనిచ్చాడు.

నయాగఢ్ తుపాకులు తమకు మరింత తలనొప్పి తెచ్చిపెట్టాయని భయపడుతూ ఎ.పి., ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు

గాలింపు చర్యల్ని తీవ్రతరం చేశాయి.

పాలకవర్గాల ఈ ప్రయత్నాలన్నింటి మధ్య మావోయిస్టు గెరిల్లా బలగాలు ప్రజల మద్దతుతో సురక్షితంగా రిట్రీటయ్యాయి.

నవీన్ పట్నాయక్ ప్రభుత్వం వెర్రెత్తిపోయి అమాయకుల్ని, మామూలు ప్రజల్ని ఎక్కడ పడితే అక్కడ అరెస్టులు చేసింది. నయాగఢ్‌లో పౌరుల్ని, బరంపూర్‌లో కార్మికుల్ని, దారింగ బాడిలో సాధారణ ఆదివాసుల్ని, పూరీలో తునికాకు వ్యాపారులనూ, బొలంగిరిలో 8 మంది ఆందోళన కారులనూ, భువనేశ్వర్, కటక్, చౌద్వాలో సాధారణ ప్రజల్ని అరెస్టులు చేశారు. ఫుల్‌బానీ దగ్గర చకాపడలో బి.జె.పి., బి.జె.డి. వ్యక్తులు ఒక అమాయకుణ్ణి చంపారు.

మావోయిస్టు పార్టీ వెంటనే ఈ వున్మాద చర్యల్ని తీవ్రంగా ఖండించి, అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ప్రజల భూమి, జీవనాధారం కోసం మావోయిస్టు పార్టీ ప్రజాయుద్ధాన్ని తిరిగి బలోపేతం చేస్తుంది.

గోసామ పర్వతాల దగ్గర నుండి రిట్రీటయిన పి.ఎల్.జి.ఎ. బలగాలను దెబ్బ తీయడానికి, గెరిల్లాలకు ఆయుధాలను దక్కకుండా చేయడానికి నెలల తరబడి శతృవు తీవ్ర ప్రయత్నాలు చేశాడు. ముఖ్యంగా ఆంధ్ర గ్రేహౌండ్స్ నేతృత్వంలో ఒరిస్సా ప్రత్యేక బలగాలు కలిసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టింది. కానీ పి.ఎల్.జి.ఎ బలగాలు నిరంతరం అప్రమత్తంగా వుంటూ, గెరిల్లా పద్ధతులను తు.చ తప్పకుండా పాటిస్తూ సురక్షిత ప్రాంతానికి క్షేమంగా చేరుకున్నారు. నయాగడ్ ఆపరేషన్‌లో స్వాధీనం చేసుకుని తెచ్చిన ఆయుధాలు – మందుగుండును వెంటనే ఒరిస్సా, ఎ.ఒ.బి., డి.కె., ఎన్.టి. పి.ఎల్.జి.ఎ. బలగాలకు అందించారు. పి.ఎల్.జి.ఎ బలగాల నీడనైనా పట్టుకోలేక శతృవు పూర్తిగా విఫలమయ్యాడు. నయాగఢ్ దాడి మొత్తం ఒక ఎత్తు అయితే, గోసామ పర్వతాల్లో పోరాటం, ఆ తర్వాత సుదీర్ఘ ప్రయాణం మరొక ఎత్తు. ఆయుధాలను పి.ఎల్.జి.ఎ. బలగాలకు అందించాలనే లక్ష్యంతో గెరిల్లాలు అత్యంత కష్ట నష్టాలకోర్చి, శక్తికి మించిన బరువులను మోసుకుంటూ నెలల తరబడి ప్రయాణం చేశారు. భారత విప్లవ చరిత్రలో "నయాగఢ్ మార్చ్"గా నిలిచిపోయే సుదీర్ఘ ప్రయాణమిది. ఈ ప్రయాణంలో కామ్రేడ్ అర్జున్ ప్రమాదవశాత్తు అమరుడుకాగా, కామ్రేడ్ కమల ఎన్‌కౌంటర్‌లో అమరురాలైంది. సుదీర్ఘ ప్రయాణం అనంతరం గమ్య స్థానానికి చేరుకున్న పి.ఎల్.జి.ఎ. బలగాలు ఈ మొత్తం ఆపరేషన్‌లో అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించి, శతృవుతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించిన తమ సహచర కామ్రేడ్స్‌కు నివాళులర్పించి వారి ఆశయసాధనకు ప్రతినబూనాయి.

గెరిల్లాజోన్లను విముక్తి ప్రాంతాలుగా, పి.ఎల్.జి.ఎ.ను పి.ఎల్.ఎ.గా, గెరిల్లా యుద్ధాన్ని మొబైల్ యుద్ధంగా అభివృద్ధి పరిచే లక్ష్య సాధనలో ముందుకు సాగుతున్న మావోయిస్టు పార్టీకి, పి.ఎల్.జి.ఎ.కు నయాగఢ్ ఆపరేషన్ విలువైన నూతన అనుభవాలెన్నింటినో అందించింది. ఈ మల్టిపుల్ రెయిడ్‌లోని బలాన్ని, బలహీనతల్ని పి.ఎల్.జి.ఎ సమీక్షించింది. ప్రజాయుద్ధాన్ని, సైన్యాన్ని బలోపేతం చేసే మార్గంలో నయాగఢ్ నిస్సందేహంగా ఒక మైలురాయిగా నిలుస్తుంది. దండకారణ్యం, బీహార్–ఝార్ఖండ్ ఇంకా పోరాట ప్రాంతాలన్నింటా ప్రజల్ని ఇది తప్పకుండా బలోపేతం చేస్తుంది.

## ప్రజాయుద్ధంలో అసాధ్యమైందేమీలేదు.

మావోయిస్టులకు ప్రజాపునాది లేదు. మావోయిస్టుల సంఖ్య వేళ్ల మీద లెక్కించగలిగేంత మాత్రమే వుంది. ఇది ప్రభుత్వమూ, పోలీసు అధికారులూ ఎప్పుడూ పాడేపాట.

కానీ హఠాత్తుగా ఈ పాట బాణీమారి మావోయిస్టులు ఎంతటి దాడికైనా పాల్పడతారు, ఈ దాడిలో వందలాది మావోయిస్టులూ, వాళ్ల మద్దతుదారులూ పాల్గొన్నారంటూ తమ బలగాల నైతిక స్థైర్యాన్ని నిలబెట్టడానికీ, వాళ్ల బలహీనతను కప్పిపుచ్చుకోవడానికి పాట మార్చారు.

మరి పి.ఎల్.జి.ఎ. నయాగఢ్ పరిసరాల్లోకి ఎలా చేరుకోగలిగింది? ఆరు నెలల నుంచి అదే రాష్ట్రంలో సన్నాహాలూ, మిలిటరీ రిహార్సళ్లు జరుగుతున్నా పోలీసులు ఆవగింజంత సమాచారాన్ని కూడా కనుక్కోలేక పోయారెందుకు?

మావోయిస్టు ఉద్యమానికి ప్రజల మద్దతు లేదు. ప్రజల నుంచి అది వేరయిపోయిందని కొట్టిపారేసే బూర్జువా మేధావులకు, పోలీసు బాస్‌లకూ, కార్పొరేట్ మీడియాకు ఇవి సమాధానాలు దొరకని ప్రశ్నలే.

వాస్తవానికి ప్రజల కష్టాలు పట్టించుకోని ఈ ప్రభుత్వానికీ, రాజకీయ పార్టీలకూ గ్రామీణ ప్రజానీకం

# నవీన్ పట్నాయక్ చర్చల పిలుపు పచ్చి మోసం!

# దోపిడీ, అణచివేతలున్నంత వరకు ఆయుధాలు అప్పగించే ప్రశ్నేలేదు!!

# శత్రువు నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలతో ప్రజల్ని సాయుధం చేస్తూనే వుంటాం!!!

మావోయిస్టులు ఆయుధాలు అప్పగిస్తే తాను చర్చలకు సిద్ధమంటూ ఫిబ్రవరి 24న ఒరిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించాడు. చర్చలకు ముందు షరతుగా ఆయుధాలు వదిలేయాలంటూ పిలుపునివ్వటం అత్యంత హాస్యాస్పదం. అదీ కూడా ప్రత్యేకించి, మా పార్టీ నాయకత్వంలోని పి.ఎల్.జి.ఎ. వెయ్యికి పైగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్న సాహసోపేత నయాగఢ్ మల్టిపుల్ రెయిడ్ జరిగిన తర్వాత ఈ విధమైన పిలుపునివ్వటం మరీ హాస్యాస్పదం. ఈ సందర్భంగా ఒక విషయం స్పష్టం చేయటం అవసరం. మావోయిస్టులు ఎత్తుకుపోయిన ఆయుధాల్లో 80 శాతం ఆయుధాలూ, 70 శాతం మందుగుండునూ తిరిగి స్వాధీనం చేసుకున్నామని అతడు చెపుతున్నదంతా పచ్చి అబద్ధం. తన కిరాయి పోలీసు బలగాలు కోల్పోయిన ఆత్మస్థైర్యాన్ని నింపడానికి చేస్తున్న వ్యర్థ ప్రయత్నం. హెలికాప్టర్ల పహారాలో నక్సల్ వ్యతిరేక ప్రయివేట్ పోలీసు బలగాల, కేంద్ర పారా మిలిటరీ బలగాల చుట్టివేతల్ని ఛేదించుకుని ఆయుధాలూ, మందుగుండు చాలావరకు మావోయిస్టుల స్థావరాలకు చేరుకున్నాయి.

మావోయిస్టులు ఆయుధాలు వదిలేయాలని నవీన్ పట్నాయక్ అమాయకంగా, తెలివితక్కువగా పిలుపునిస్తున్నాడు. ఇదెలా వుందంటే, ఒరిస్సా ప్రజలపై దోపిడీ, అణచివేతలను మానుకోవాలనీ, సామ్రాజ్యవాదులకూ, దళారీ బూర్జువాలకు నమ్మినబంటుగా ఊడిగం చేయటం మానుకోవాలని తననెవరైనా అడిగితే ఎంత తెలివితక్కువగా వుంటుందో అలా మాట్లాడుతున్నాడు. దయ్యాలు వేదాలు వల్లించినట్లు, ఒకపక్క అదనంగా అయిదు ఇండియా రిజర్వు బెటాలియన్లను అత్యంత అధునాతన ఆయుధాలతో ఏర్పాటు చేస్తూనే మావోయిస్టులు ఆయుధాలు వదిలేయాలంటున్నాడు. ఈ చర్చల ప్రతిపాదనను సి.పి.ఐ(మావోయిస్టు) కేంద్ర కమిటీ ఒరిస్సా ప్రభుత్వ ప్రచార యుద్ధంగానే పరిగణిస్తుంది. అదే విధంగా సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల, దళారీ నిరంకుశ బడా బూర్జువాల దోపిడిని ఒరిస్సాలో అడ్డుకుంటూ, రాష్ట్ర వ్యాప్తంగా సాయుధ పోరాటాన్ని విస్తరించేందుకే కట్టుబడి వున్నామని పునరుద్ఘాటిస్తున్నది. ఒరిస్సా ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్ గతం నుండి కూడా ఒరిస్సా ప్రజల రక్తం తాగి, రాష్ట్రంలోని ఖనిజ సంపదలను, సహజ వనరులను కొల్లగొట్టుకుపోయిన సామ్రాజ్యవాదులకు, దళారీ బూర్జువాలకు నమ్మిన బంటుగా పని చేసినవాడే. టాటాల తైనాతీగా పని చేసిన అతని చేతులకు అంటిన కళింగనగర్ పేద ఆదివాసుల రక్తపు మరకలు ఇంకా మాసిపోలేదు. కొరియాకు చెందిన ప్రజావ్యతిరేక పోస్కో ఉక్కు ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజలపై అతడు ఫాసిస్టు దాడులను తీవ్రం చేస్తూ, ఆ ప్రాజెక్టును రక్షించడానికే కంకణం కట్టుకున్నాడు. ఒరిస్సాలోని సహజ సంపదలను కొల్లగొట్టుకుపోవడానికి అతడి ప్రభుత్వం రెండు లక్షల కోట్లకు సంబంధించిన ఒప్పందాలపై సంతకాలు చేసింది. పాలకవర్గాలకు చెందిన రాజకీయ నాయకులూ, ఉన్నతాధికారులూ తాము అందించిన దళారీ సేవలకు పెద్ద మొత్తంలో కమీషన్లు అందుకొని జేబులు నింపుకుంటుండగా, నవీన్ పట్నాయక్ ప్రభుత్వ మద్దతుతో ఏర్పాటవుతున్న ఎస్.ఇ.జడ్.లు, గనులూ, ప్రాజెక్టులూ మొదలైన వాటివల్ల లక్షలాది పేద ఆదివాసీలు, ఇతర సెక్షన్ల రైతాంగం నిర్వాసితులు అవుతున్నారు.

సామ్రాజ్యవాదుల ఆజ్ఞలమేరకు నవీన్ పట్నాయక్ లాంటి ప్రజావ్యతిరేక ద్రోహులు మావోయిస్టు ఉద్యమంపై విచ్చలవిడి నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, విప్లవకారులనూ, సానుభూతిపరులను అరెస్టులూ, హత్యలూ చేస్తున్నారు. పోస్కో లాంటి బహుళజాతి తిమింగలాలతో, టాటాలు, మిట్టల్లూ, అంబానీలు, జిందాల్లు తదితర దళారీలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవటమూ, సామ్రాజ్యవాదులకు, స్వదేశీ దళారీ బూర్జువా, భూస్వామ్య శక్తులకు నమ్మినబంటుగా పని చేయకుండా

వుండటమూ నవీన్ పట్నాయక్‌కు ఎంత అసాధ్యమో, ఆయుధాలు విడిచిపెట్టడం మావోయిస్టులకూ అంతే అసాధ్యం.

దోపిడీ, పీడనా, అణచివేతలున్నంతకాలం మా సాయుధ పోరాటం కొనసాగుతూనే వుంటుంది. మావోయిస్టుల్ని ఆయుధాలు వదిలి చర్చలకు రమ్మనటం పిచ్చివాగుడు తప్ప మరొకటి కాదు. లేదంటే ఒక సెక్షన్ ప్రజల్ని నిలబెట్టుకోవడానికి చేసే చౌకబారు ప్రచార జిమ్మిక్కు ఇది.

చర్చలకు ముందు షరతుగా ఆయుధాలు వదలి రమ్మంటూ నవీన్ పట్నాయక్ మావోయిస్టులకు ఇచ్చిన పిలుపు వెనుకనున్న మోసాన్ని, కపటత్వాన్ని గమనించాల్సిందిగా ప్రగతిశీల, ప్రజాస్వామిక సంస్థలకూ, వ్యక్తులకూ, ఒరిస్సా ప్రజానీకానికందరికీ సి.పి.ఐ (మావోయిస్టు) కేంద్ర కమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. లక్షలాది ప్రజానీకాన్ని వారి బతుకుదెరువు నుంచీ, స్వస్థలాల నుంచి వెళ్లగొట్టి, ఒరిస్సాలోని సహజ వనరులను కొల్లగొట్టుకుపోతున్న పోస్కో, టాటా ఉక్కు తదితర ప్రజావ్యతిరేక, జాతి వ్యతిరేక ప్రాజెక్టులను తరిమివేసేందుకు ప్రజలు పెద్దయెత్తున సమైక్యమై, మిలిటెంటు ఉద్యమాన్ని నిర్మించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నది.

ప్రజలకు సంబంధించిన ప్రతి పోరాటంలోనూ సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ ముందు పీఠిన నిలబడుతుందనీ, సామ్రాజ్యవాదులనూ, దళారీ బూర్జువా, భూస్వామ్య శక్తులనూ, నవీన్ పట్నాయక్ లాంటి వారి ఏజెంట్లనూ తన్ని తరిమి, ఈ జలగల కబంధ హస్తాల నుండి ప్రజలు తమ్ము తాము విముక్తి చేసుకునేందుకు సహాయపడే క్రమంలో సాయుధ పోరాటాన్ని మరింత తీవ్రం చేస్తుందనీ ఒరిస్సా ప్రజలకు సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ తిరిగి హామీనిస్తున్నది. ఇందుకోసం ప్రజల క్రియాశీల పాత్రతో మా పి.ఎల్.జి.ఎ. నేటి నయాగఢ్, మునుపటి కోరాపుట్, ఆర్.ఉదయగిరి తదితర ఘటనల తరహాలో శత్రువు నుండి ఆయుధాలను స్వాధీనం చేసుకుని, ఒరిస్సా అంతటా సాయుధ పోరాటాన్ని విస్తరింపచేసేందుకు ప్రజలను సాయుధులను చేస్తుంది. తిరుగులేని ఈ చరిత్ర కవాతును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అణచివేత క్యాంపెయిన్లు ఏవీ ఆపలేవు.

***ఆజాద్***
***పత్రికా ప్రతినిధి***
***కేంద్రకమిటీ***
***సి.పి.ఐ (మావోయిస్టు)***

హృదయాల్లో స్థానం లేదు. కానీ మావోయిస్టులు ప్రజలతోనే వున్నారు. ఈ ప్రజల కోసం అనన్యత్యాగాలు చేస్తున్నారు. ప్రజల మద్దతుతో మావోయిస్టులు ఇటువంటి కర్తవ్యాన్ని విజయవంతంగా సాధించగలగడానికి కారణమిదే.

సంఖ్య తక్కువ. ఆయుధాలు తక్కువ. అందునా అధునాతన ఆయుధాలు మరీ తక్కువ. పోలీసులు అసలు పట్టుకోడానికే ఇష్టపడని ఆయుధాలు.

ఇంతకంటే ఎక్కువ ఆయుధాలు లేవు. కానీ మావో చెప్పినట్లు మానవుల చైతన్యం, సృజనాత్మక ఆచరణలే యుద్ధంలో నిర్ణయాత్మకపాత్ర వహిస్తాయి. పి.ఎల్.జి.ఎ. గెరిల్లాలు గొప్ప అంకితభావంతో, త్యాగంతో అక్షరాలా దీన్ని అమలుపరచి నయాగఢ్ మల్టీపుల్ రెయిడ్‌ను విజయవంతం చేశారు. వందలాది కిలోమీటర్లు పర్వతాల్లో ప్రయాణం, మంచి తిండిలేదు, కంటినిండా కునుకులేదు. అయినా క్రమశిక్షణ గల పి.ఎల్.జి.ఎ. యోధుల్ని ఇవేవీ నిరుత్సాహపరచలేదు.

తమ ప్రయాణ మార్గంలో కొత్త ప్రాంతాల్లోని పేద ఆదివాసీ ప్రజలతో మమేకమయ్యారు. ముఖ్యంగా గంజాం, ఫుల్‌బానీ, నయాగఢ్ జిల్లాల్లో ఆదివాసీ ప్రజలతో గట్టి సంబంధాలు ఏర్పరచుకున్నారు. దోపిడిదారులు వాళ్ల భూముల్ని గుంజుకుని, వాళ్ల భూముల్లోనే వాళ్లను కూలీలుగా ఎలా మార్చారనేది అక్కడి ఆదివాసీ ప్రజలకు వివరించారు. బయటి నుంచి వచ్చిన అగ్రవర్ణాల వ్యాపారస్తులు, భూస్వాములూ, ఆదివాసీల మధ్య, ఆదివాసీ – పేద దళిత ప్రజల మధ్య హిందూ, క్రైస్తవ మత కొట్లాట ఎలా రగిలిస్తున్నారనేది, ఆర్.ఎస్.ఎస్., వి.హెచ్.పి. నాయకులు తమ దోపిడిని ప్రశ్నించకుండ వాళ్లనెలా పక్కదారి పట్టిస్తున్నారనేదాన్ని గురించి అక్కడి పేద ప్రజానీకానికి

తెలియజెప్పారు.

తమ భూమి, జీవనాధారాన్ని రక్షించుకోవడానికి దండకారణ్యం, బీహార్–జార్ఖండ్, మల్కన్‌గిరి, బాశధార, సంబల్‌పూర్, కోరాపుట్, కళింగనగర్ ప్రజల్లా సంఘటితం కావడానికి వారిని ఉద్యుక్తుల్ని చేశారు. ప్రజా యుద్ధాన్ని ముందుకు తీసుకుపోవడానికి ప్రజాసంఘాలు, పార్టీ, ప్రజాసైన్యాన్ని బలోపేతం చేయవలసిన అవసరాన్ని గురించి వారికి వివరించారు. అలా ప్రజలకు రాజకీయ అవగాహన కల్పించి వారి మద్దతు సంపాదించుకున్నారు. ప్రజల మద్దతుతో సునాయాసంగా నయాగఢ్ విజయం సాధించారు.

ఐక్యతా కాంగ్రెస్–9వ కాంగ్రెస్ నిర్దేశించిన కేంద్ర కర్తవ్య సాధనకు తోడ్పడే విధంగా పి.ఎల్.జి.ఎ. నయాగఢ్ ఆపరేషన్‌ను నిర్వహించింది. పి.ఎల్‌జి.ఎ. బలగాలకు ఆయుధాలు అందించడానికీ, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాల్లోని ఎస్.ఇ.జెడ్ పీడిత ఆదివాసీ, గైరాదివాసీ రైతాంగానికి ఆయుధాలు అందించి వారి ప్రతిఘటనను తీవ్రతరం చేయడానికి నయాగఢ్ ఆపరేషన్ చేపట్టింది. రాజకీయంగా, మిలిటరీ పరంగా నయాగఢ్ ఆపరేషన్ అనేక ప్రాధాన్యతలను సంతరించుకుంది.

1. ఇది పి.ఎల్.జి.ఎ. ఆయుధ సంపత్తిని పెంచి, మెరుగుపరచి, దాని ప్రతిఘటనా సామర్థ్యాన్ని పెంచడానికి తోడ్పడింది.

2. కేంద్ర ప్రభుత్వ నాయకత్వంలో దేశవ్యాప్తంగా మొదలైన దాడికి కౌంటర్ దాడిగా ఈ దాడి వుపయోగపడింది. ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో విప్లవోద్యమంపై తీవ్రతరం చేసిన దాడికి కౌంటర్‌గా ఈ దాడి వుపయోగపడింది.

3. ఒరిస్సా రాష్ట్రంలోని సకల వనరులనూ దళారీ నిరంకుశ బూర్జువాల, బహుళజాతి కంపెనీల పెట్టుబడులకు తాకట్టు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఈ చర్య తీవ్ర ప్రమాద సంకేతాన్నిచ్చింది. ఎస్.ఇ.జెడ్. పీడిత రైతాంగానికీ, ఆదివాసులకూ ఈ ఆయుధాలు అందితే తమ పెట్టుబడులకు భద్రత వుండదని సి.బి.బి., ఎం.ఎన్.సి.లు తీవ్రంగా ఆందోళన చెందాయి.

4. రాష్ట్ర రాజధానికి కేవలం 84 కి.మీ. దూరంలోనే ఈ ఘటన జరగడంతో శాంతి భద్రతల పరిరక్షణ(సి.బి.బి., ఎం.ఎన్.సి.ల పెట్టుబడుల రక్షణ)లో విఫలమయిన ప్రభుత్వం వెంటనే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ప్రతిపక్షాలు అనేక రోజులపాటు అసెంబ్లీని స్థంభింపచేశాయి.

సామ్రాజ్యవాదుల, దళారీ నిరంకుశ బూర్జువాల పెట్టుబడుల రక్షణకు, దేశ సంపదలను, వనరులను వారికి తాకట్టు పెట్టడానికి సిద్ధమైన పాలక ప్రభుత్వాలు ఏ పార్టీ అధికారంలో వున్నప్పటికీ నయావలస దోపిడికి తలుపులు బార్లా తెరుస్తున్నాయి. ఎస్.ఇ.జెడ్.ల రూపంలో, రకరకాల ప్రాజెక్టుల రూపంలో దొడ్డి దారిన ప్రవేశిస్తున్న వలస పాలనకు గేట్లు తెరుస్తూ, రైతాంగానికి చెందిన లక్షలాది ఎకరాల పంట భూములను ఈ రాబందులకు అప్పగించి ప్రజలను నిర్వాసితుల్ని చేస్తున్నాయి. నిర్వాసితులవుతున్న లక్షలాది ప్రజానీకం ఇందుకు వ్యతిరేకంగా మిలిటెంటు పోరాటాలకు దిగి, స్వతహాగా ప్రభుత్వ బలగాలతో సాయుధ ఘర్షణలకు తలపడుతున్నారు. జీవన్మరణ పోరాటంలో వున్న ఈ ప్రజానీకం మావోయిస్టు పార్టీ అండదండల కోసం ఎదురు చూస్తున్నది. పోరాడే ప్రజలకు ఆయుధాలు అందించి, వారిని సాయుధ పోరాటానికి సమాయత్తం చేయవలసిన బాధ్యత నేడు మావోయిస్టు పార్టీపై వుంది. ఇందుకు సయాగఢ్ తరహా దాడులు మరెన్నింటినో పి.ఎల్.జి.ఎ. చేపట్టవలసిన అవసరం వుంది.

మరోవంక ఈ ఆయుధాలు బెంగాల్, ఒరిస్సా తదితర ప్రాంతాల్లో ఎస్.ఇ.జడ్ పీడిత రైతాంగానికి, ఆదివాసీ ప్రజానీకానికి అందుతాయని పాలకవర్గాలు తీవ్రంగా ఆందోళన చెందుతున్నాయి. గత 3 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీ నేతృత్వంలో పి.ఎల్.జి.ఎ. బలగాలు సాగిస్తున్న ఎత్తుగడల ఎదురు దాడులతో విస్తృతంగా, తీవ్రంగా కొనసాగుతున్న గెరిల్లా యుద్ధ చర్యలతో బెదిరిపోయిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా విప్లవోద్యమ నిర్మూలనకు పథకాలు రచిస్తున్నాయి. సామ్రాజ్యవాదుల మార్గదర్శకత్వంలో, ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష సహాయ సహకారాలతో కేంద్ర ప్రభుత్వం ముప్పేట దాడికి వ్యూహరచన చేస్తున్నది. సామ్రాజ్యవాదుల నమ్మిన బంటు ప్రధాని మన్మోహన్‌సింగ్ దేశ అంతర్గత భద్రతకు (అభివృద్ధి నిరోధక భారతపాలకుల భద్రతకు అని అర్థం చేసుకోవాలి) "వామపక్ష తీవ్రవాదం" ప్రధానమైన ముప్పు అంటూ ప్రకటించిన నేపథ్యంలో మావోయిస్టు ఉద్యమ అణచివేతకు

రాష్ట్రాలకు పూర్తి స్థాయిలో సహాయం అందించటానికి కేంద్రం హామీ ఇచ్చింది. ఇప్పటికే దింపిన 35 బెటాలియన్ల సి.ఆర్.పి.ఎఫ్. బలగాలకు తోడు మరో 35 బెటాలియన్ల ఇండియా రిజర్వ్ బలగాలను కేంద్రం ఏర్పాటు చేయతలపెట్టింది. ఝార్ఖండ్‌లో 55 కంపెనీల రాష్ట్ర పోలీసు బలగాలను "సెంగైల్" పేరిట ప్రత్యేక నక్సల్ వ్యతిరేక బలగాలుగా మార్చారు. పోలీసుల సంఖ్యను గత రెండు సంవత్సరాల్లో రెట్టింపు సంఖ్యకు పెంచారు. ఛత్తీస్‌గఢ్‌లో గత మూడు సంవత్సరాల్లో సల్వాజుడుం మూకలు, పోలీసులు కలిసి జరిపిన మారణకాండలో 700లకు పైగా ఆదివాసీ ప్రజలు చనిపోయారు. వందలాది మహిళలను అత్యాచారాలు, హత్యలు చేశారు. ఇంత పెద్దయెత్తున దమనకాండను జరిపి కూడా మావోయిస్టు ఉద్యమాన్ని అరికట్టలేని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఇప్పుడు కార్పెట్ సెక్యూరిటీ పేరిట 3–5 కిలోమీటర్లకొకటి చొప్పున పోలీసు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో యూనిఫైడ్ కమాండ్ ఏర్పాటు చేసి, జాయింట్ ఆపరేషన్ పేరుతో ఆంధ్ర, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్‌లలో దాడులు జరుపుతున్నారు. ఆంధ్ర గ్రేహౌండ్స్ బలగాలు ఇతర రాష్ట్రాలలోకి చొరబడి కంచాల తరహా కోవర్టు ఆపరేషన్లకు పాల్పడుతున్నాయి.

దేశానికంతటికీ నమూనాగా చూపబడుతున్న గ్రేహౌండ్స్ బలగాలు మితిమీరిన కండకావరంతో ప్రజలపై, ముఖ్యంగా ఆదివాసీ మహిళలపై దుర్మార్గానికి పాల్పడితే పాలకులు, న్యాయస్థానాలు ఈ కిరాయి మూకలను వెనకేసుకొస్తున్నాయి. పారా మిలిటరీ బలగాలా, గ్రేహౌండ్స్ లాంటి నక్సల్ వ్యతిరేక ప్రత్యేక శిక్షణ పొందిన కిరాయి బలగాల దురాగతాలు ప్రజల్ని భారత రాజ్యానికి వ్యతిరేకంగా తయారు చేస్తున్నాయి. పెద్దయెత్తున బలగాల్ని దింపుతున్న ప్రభుత్వ నూతన పథకాలు ప్రజల్ని పెద్ద మొత్తంలో ఉద్యమంలోకే మళ్ళిస్తాయి. సామ్రాజ్యవాదుల వెన్నుదన్నుతో అభివృద్ధి నిరోధక భారత పాలకవర్గాలు కొనసాగిస్తున్న ఫాసిస్టు అణచివేత క్యాంపెయిన్ ప్రజా యుద్ధాన్ని మరింత బలోపేతం చేయడానికే తోడ్పడుతుంది. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న దాడిని ఓడించటం నేడు పార్టీ, పి.ఎల్.జి.ఎ. ముందున్న కర్తవ్యాలు. ఈ కర్తవ్య సాధనలో నయాగఢ్ ప్రేరణగా నిలుస్తుంది. ప్రజలు మరింతగా పి.ఎల్.జి.ఎలో చేరి, పి.ఎల్.జి.ఎ. పి.ఎల్.ఎ.గా, గెరిల్లా యుద్ధం మొబైల్ యుద్ధంగా మారి, మరిన్ని నయాగఢ్‌లూ, కోరాపుట్‌లూ, గిరిఢీలూ, జహనాబాద్‌లూ, ఆర్.వుదయగిరిలూ, దంతెవాడలూ సృష్టించే రోజు ఎంతో దూరంలో లేదు. ప్రజలు, శత్రువు నుండే ఆయుధాలు గుంజుకుని సాయుధులవుతారు. టాటా, బిర్లా, మిట్టల్, పోస్కో జిందాల్‌లనూ, భూస్వాములనూ వారి ఏజెంట్లు మన్మోహన్, రాజశేఖర్, నవీన్, బుద్ధదేవ్, రమణ్‌సింగ్, అద్వానీ, మోడీ మొదలైన వారిని ఓడించి తమపై స్వారీ చేస్తున్న సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ బూర్జువా,

> సామ్రాజ్యవాద వ్యతిరేక, భూస్వామ్య వ్యతిరేక పోరాటం జరిపే చారిత్రక దశ మొత్తం అంతటిలోనూ, మనం తప్పనిసరిగా జాతీయ బూర్జువా వర్గాన్ని మన వైపు తిప్పుకొని అది సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజల పక్షం వహించేటట్లు దానితో సమైక్యం కావాలి. సామ్రాజ్యవాదాన్ని భూస్వామ్య విధానాన్ని వ్యతిరేకించే కర్తవ్యం ప్రధానంగా పూర్తి అయిపోయిన తర్వాత కూడా, కొంత కాలంపాటు మనం తప్పనిసరిగా జాతీయ బూర్జువా వర్గంతో స్నేహం కొనసాగించాలి. సామ్రాజ్యవాద దురాక్రమణను ఎదుర్కోవడంలోనూ, ఉత్పత్తిని విస్తృతపర్చడంలోనూ మార్కెటును నిలకడగా వుంచడంలోనూ, బూర్జువా మేధావులను మనవైపు తిప్పుకొని వారిని మలచుకోవటంలోనూ కూడా అది మనకు లాభదాయకంగా వుపయోగపడుతుంది.
>
> \- మావో

# భారత విప్లవ చరిత్రలో మైలురాయిగా నిలిచే నయాగఢ్ దాడిని సమున్నతంగా ఎత్తి పడదాం!

భారత విప్లవ ప్రజా యుద్ధంలో 2008 ఫిబ్రవరి 15వ తేదీ ప్రజా సైన్యం సాధిస్తున్న విజయాలకు ఒక గుర్తుగా నిలిచిపోయే రోజు. ప్రజా గెరిల్లా బలగాలు ఆ రోజున ఒరిస్సా రాష్ట్రంలోని నయాగఢ్ జిల్లా కేంద్రంపై దాడి చేశాయి. ఏక కాలంలో ఆరు లక్ష్యాలపై గెరిల్లా బలగాలు దాడి చేసి పెద్ద మొత్తంలో ఆయుధాలు, మందుగుండును తీసుకుని పి.టి.ఎస్, ఆర్మరీల్లోని 1200 తుపాకుల్ని, 1 లక్షా 75 వేల తూటాల్నీ స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ప్రతిఘటనకు ప్రయత్నించిన 14మంది పోలీసులను గెరిల్లాలు మట్టి కరిపించారు. దాడిలో భాగంగా రోడ్డు బ్లాక్ కోసం దస్‌పల్లాలోని ఒక గ్యారేజి నుండి టైరు తీసుకెళుతున్న గెరిల్లాలపై బి.జె.పి గూండాలు



స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

స్వాధీనం చేసుకుని పి.ఎల్.జి.ఎ బలగాలకు అందించాయి. 1. పోలీసు ట్రైనింగ్ స్కూలు(పి.టి.ఎస్) 2. నయాగఢ్ జిల్లా రిజర్వ్ హెడ్ క్వార్టర్స్/జిల్లా పోలీసు ఆర్మరీ 3.దస్ పల్లా పోలీసు స్టేషన్ 4. నువాగావ్ పోలీసు స్టేషన్ 5. మహిపూర్ పోలీసు అవుట్ పోస్టు 6. గల్లేరి పోలీసు అవుట్ పోస్టులపై పి.ఎల్.జి.ఎకు చెందిన వందలాది గెరిల్లా బలగాలు ఏక కాలంలో దాడి చేశాయి. రాష్ట్ర రాజధానికి కేవలం 84కి.మీ దూరంలో వున్న జిల్లా పోలీసు కేంద్రంపై 15.2.08నాడు రాత్రి 10.15గంటలకు పి.ఎల్.జి.ఎ గెరిల్లా యోధులు మెరుపు దాడి చేసి 2గంటల పాటు జిల్లా కేంద్రాన్ని తమ అదుపులోకి దాడికి పాల్పడి ఎంతగా అర్థం చేయించినా వినకుండా పెడచెవిన పెట్టి రెచ్చిపోవటంతో అనివార్యంగానే ఒక గూండాను నిర్మూలించారు.

అనివార్య కారణాల వల్ల దాడికి నిర్ణయించుకున్న వ్యవధి పెరిగి పి.ఎల్.జి.ఎ బలగాలు రిట్రీట్ కావడానికి ఎంచుకున్న గోసామ పర్వత ప్రాంతానికి చేరుకునే సరికి తెల్లవారిపోయింది. దీని వల్ల శత్రువుకు పి.ఎల్.జి.ఎ బలగాల రిట్రీట్ ప్రాంతం అర్థమయి ఉదయం 9గంటలకల్లా దాడికి వచ్చాడు. గోసామ పరిసరాల్లో

*(తరువాయి 42 వ పేజీలో...)*